ఈ భవనం ఓ ఉపాధ్యాయుడిది. గతంలో రెండు సాధారణ ఇళ్లు ఉండేవి. వాటిని నాలుగేళ్ల క్రితం కూలగొట్టి ఎలాంటి అనుమతులు లేకుండా వైసీపీ నాయకుల అండతో నాలుగు అంతస్థుల భవనం నిర్మించాడు. అద్దెల రూపంలో రూ.లక్షలు వసూలు చేస్తున్నా మునిసిపాలిటీకి పన్ను మాత్రం రూ.6,860 మాత్రమే చెల్లిస్తున్నాడు. ఈ భవనానికి కొలతల ప్రకారం పన్ను వేస్తే ఏడాదికి రూ.1.50 లక్షల మేర ఉంటుంది. ఈ నాలుగేళ్లలో సుమారు రూ.6లక్షల మేర మునిసిపాలిటీ ఆదాయానికి గండిపడింది. అయినప్పటికీ మునిసిపల్ రెవెన్యూ విభాగం చోద్యం చూస్తోంది. ఇది మచ్చుకు ఉదాహరణ మాత్రమే. ఇలాంటివి అనేకం ఉన్నాయి.




మార్కాపురం పట్టణంలో గత ఐదేళ్ల కాలంలో వైసీపీ నాయకులు, అనుచరులు సాగించిన దురాగతాలు అన్నీఇన్నీ కావు. అక్కడా ఇక్కడా అని కాకుండా ఎలాంటి అనుమతులు లేకుండా పట్టణమంతా బహుళ అంతస్థుల భవనాలను ఇష్టారీతిన నిర్మించారు. నిబంధనలకు తిలోదకాలిచ్చారు. నియోజకవర్గ స్థాయి నేతలు, మునిసిపాలిటీలోని ముఖ్యనాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతో యథేచ్ఛగా నిర్మాణాలు సాగాయి. ఇంత జరుగుతున్నా రాజకీయ ఒత్తిళ్లతో ఇచ్చింది పుచ్చుకొని అధికారులు కూడా చోద్యం చూశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రస్తుతం అధికారుల్లో చలనం మొదలైంది. గతంలో చూసీచూడనట్లు వ్యవహరించిన వారు నేడు నోటీసులు ఇస్తున్నారు. ప్రస్తుతం మార్కాపురం పట్టణంలో సుమారు 50కిపైగా అక్రమ నిర్మాణాలకు మునిసిపల్ అధికారులు నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలను తొలగించే కార్యక్రమానికి కూడా ఇప్పుడు శ్రీకారం చుట్టారు.

ఈ చిత్రంలోని షోరూం మార్కాపురంలోని కళాశాల రోడ్డులోనిది. ఇది ఏఎంసీ మాజీ చైర్మన్ అయిన వైసీపీ ముఖ్య నాయకునిది. ఆయన కుమారుడి పేరున షోరూం భవనం ఉంది. సంవత్సరం క్రితం ఇది ప్రారంభమైంది. దీనికి ఏడాదికి ఎంతలేదన్నా సుమారు రూ.2లక్షల వరకూ మునిసిపాలిటీ పన్ను ఉంటుంది. కానీ అధికారం అండతో పన్ను కట్టడం లేదు. షోరూం నిర్మించకముందు ఉన్న రెండు చిన్నపాటి భవనాలకు విధిస్తున్న రూ.21వేల పన్ను మాత్రమే నేటికీ మునిసిపాలిటీ రెవెన్యూ విభాగం వసూలు చేస్తోంది. ఈ షోరూం నుంచి సదరు నాయకుడు నెలకు రూ.2.5లక్షల అద్దె వసూలు చేస్తున్నాడు. వాస్తవానికి షోరూం కమర్షియల్ నిర్మాణం. కానీ ఆ నాయకుడు రెసిడెన్షియల్ ప్లాన్ మాత్రమే తీసుకున్నాడు. జీప్లస్‌టూకు మాత్రమే అనుమతి ఉండగా అదనంగా మరో రెండు అంతస్థులు నిర్మించాడు. అంతేకాక 256 సర్వేనంబరులో ఈ షోరూం నిర్మించినా దానికి సంబంధించిన డాక్యుమెంట్లు మాత్రం 258 సర్వే నంబర్‌లోనివి. వైసీపీ నాయకుడు నిబంధనలు కాలరాసినా మునిసిపల్ అధికారులు మిన్నకుండిపోయారు.



# అక్రమ అంతస్థులు

## అనుమతులు లేకుండానే నిర్మించిన వైసీపీ నేతలు

- పన్ను వేసేందుకు కూడా సాహసించని అధికారులు
- మునిసిపాలిటీ ఆదాయానికి రూ.50 కోట్ల మేర గండి
- కూటమి ప్రభుత్వం రావడంతో యంత్రాంగంలో కదలిక
- 50 బహుళ భవనాలకు నోటీసులు


సర్వే నెంబర్, ప్లాన్‌లో తేడాలున్నా యథేచ్ఛగా సాగుతున్న వైసీపీ నాయకుడి భవనం

మార్కాపురం, జూలై 31: మునిసిపాలిటీల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలన్నా ముందుగా పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల అనుమతి తీసుకోవాలి. అందుకోసం నిర్మాణదారుడు స్థలానికి సంబంధించి అన్ని రకాలైన డాక్యుమెంట్లు కలిగి ఉండాలి. నిర్మాణానికి ముందే ఖాళీస్థలం పన్ను కూడా రెవెన్యూ విభాగానికి చెల్లించాలి. అంతేకాక మునిసిపాలిటీ అనుమతిపొందిన ప్లానర్ వద్ద ఎంత విస్తీర్ణంలో, ఎన్ని అంతస్థుల్లో నిర్మాణం చేస్తారో ప్లాన్ అప్రూవల్ తీసుకోవాలి. అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నిర్మాణాలకు అనుమతులు ఇస్తారు. నిర్మాణం అనంతరం పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత మునిసిపల్ రెవెన్యూ అధికారులు పన్ను వేస్తారు. కానీ ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇలాంటి నిబంధనలన్నింటికీ ఆపార్టీ నాయకులు తిలోదకాలిచ్చారు. మునిసిపాలిటీని సంప్రదించకుండానే ఇష్టారీతిన నిర్మాణాలు పూర్తి చేశారు. బ్యాంకుల్లో రుణం పొందాలనుకునే వాళ్లు మాత్రం ఏదో మొక్కుబడిగా ప్లాన్ వరకూ తీసుకున్నారు. జీప్లస్‌టూకు అనుమతులిస్తే అదనంగా మరో రెండు మూడు అంతస్థులు యథేచ్ఛగా నిర్మించారు. గత ఐదేళ్లలో నిర్మాణాలు పూర్తిచేసిన భవనాలు, వాణిజ్య సముదాయాల్లో 80శాతం ఇలా నిబంధనలు పాటించలేదని తెలుస్తోంది. ఈవిధంగా మార్కాపురం మునిసిపాలిటీ ఎంతలేదన్నా సుమారు రూ.50 కోట్ల వరకూ ఆదాయం కోల్పోయినట్లు అంచనా.


ప్రారంభానికి సిద్ధమైన అనుమతులులేని ఓ షోరూం

### కూటమి ప్రభుత్వం రాగానే అధికారుల్లో కదలిక

మార్కాపురం పట్టణంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమ నిర్మాణాల వైపు తొంగి చూసేందుకు కూడా మునిసిపాలిటీ అధికారులు భయపడ్డారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారిలో కదలిక మొదలైంది. అక్రమ నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చారు. అలాంటివి దాదాపు వంద వరకూ ఉన్నట్లు సమాచారం. అలాగే పక్కాగా మునిసిపాలిటీ స్థలంలో నిర్మించిన బహుళ అంతస్థుల భవనాన్ని ఇటీవల కూల్చేశారు. అన్న క్యాంటీన్ పక్కన వైసీపీ ముఖ్యనాయకుడి అనుచరుడు దానిని కట్టాడు. వైసీపీ పాలనలో టీడీపీకి చెందిన వాళ్లు నిర్మాణాలు చేసుకోవాలంటే పలు రకాల కొర్రీలతో అధికారుల ద్వారా ఇబ్బందులకు గురిచేశారు. ఇలాంటి ఫిర్యాదులు పదులసంఖ్యలో అప్పట్లో టీడీపీ నేత, ప్రస్తుత ఎమ్మెల్యే నారాయణరెడ్డి వద్దకు వెళ్లాయి. కాగా ముందుగా ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన వాటిని కూల్చేస్తున్నారు. ఎలాంటి కనీస అనుమతులు లేనివాళ్లకు, ప్లాన్ తీసుకున్నా నిర్మాణాల్లో తేడాలు ఉన్నవి, పన్నులు వేయని వాటికి ఇప్పటికే మునిసిపల్ అధికారులు నోటీసులు ఇచ్చారు. నిర్మాణదారులు సమాధానం ఇచ్చిన తర్వాత వాటిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు.

### అక్రమ నిర్మాణాలు, పన్ను చెల్లించని వారికి నోటీసులు ఇచ్చాం



మార్కాపురం పట్టణంలో అక్రమ నిర్మాణాలు చేసిన వారికి, నిర్మాణాలు పూర్తిచేసి పన్నులు చెల్లించని వారికి నోటీసులు ఇచ్చాం. 10 రోజులవుతున్నా ఇప్పటికీ సమాధానాలు రాలేదు. ప్రధానంగా సెల్లార్లకు ఎవరూ అనుమతులు తీసుకోకుండానే ఇష్టారీతిన భవనాలు కట్టారు. అక్రమ నిర్మాణాలు చేసేవారిని ఎవరినీ ఉపేక్షించేది లేదు.

\- ఇ.కిరణ్, మార్కాపురం మునిసిపల్ కమిషనర్



# 8న ఎస్‌ఎంసీ ఎన్నికలు

- నేడు నోటిఫికేషన్, ఓటర్ల జాబితా ప్రకటన

ఒంగోలు(విద్య), జూలై 31: స్కూలు యాజమాన్య కమిటీల (ఎస్‌ఎంసీల) ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం ఉన్న తల్లిదండ్రుల కమిటీల స్థానంలో పాఠశాల యాజమాన్య కమిటీలు ఏర్పాటవుతున్నాయి. ఈ మేరకు సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికల షెడ్యూల్‌ను ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

- పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికల నిర్వహణకు గురువారం హెచ్‌ఎంలు నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అదేరోజు ఎన్నికల్లో పాల్గొనే ఓటర్ల జాబితాను ప్రకటించి నోటీసు బోర్డులో ఉంచుతారు. కమిటీ సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు.
- ఆగస్టు 5వతేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి వాటిని పరిష్కరిస్తారు. మధ్యాహ్నం మూడు నుంచి నాలుగు గంటల వరకు ఓటర్ల తుది జాబితాను సిద్ధం చేసి నోటీసు బోర్డులో ప్రదర్శిస్తారు.
- ఆగస్టు 8న ఎన్నికలు నిర్వహించి పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులను ఎన్నుకుంటారు. మధ్యాహ్నం 1.30 నుంచి కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్లు ప్రమాణస్వీకారం చేస్తారు. మధ్యాహ్నం 3 నుంచి 3.30 మధ్య మొదట కమిటీ సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. ప్రైవేటు యాజమాన్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలు మినహా మిగిలిన ఇతర యాజమాన్యాల్లోని అన్ని పాఠశాలల యాజమాన్య కమిటీలకు ఎన్నికలు నిర్వహించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### మార్గదర్శకాలు జారీ

పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ఎన్నికల్లో తల్లిదండ్రుల్లో ఒకరు మాత్రమే పాల్గొనాలి. ఒక పాఠశాలలో వేర్వేరు తరగతులు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఒకరు అన్ని తరగతుల ఎన్నికల్లో పాల్గొనవచ్చు. కమిటీలో చైర్మన్, వైస్ చైర్మన్లను సభ్యులు ఎన్నుకుంటారు. సభ్యుల్లో ఒకరు మహిళ, మరొకరు బలహీనవర్గాలకు చెందిన వారై ఉండాలి. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, హెచ్‌ఎంలకు కమిటీ ఎన్నికల్లో ఓటుహక్కు లేదు. ప్రతి తరగతి నుంచి ఎస్‌ఎంసీ సభ్యుడిగా ఒకరిని ఎన్నుకుంటారు. ఎన్నికలకు కనీసం 50శాతం మంది తల్లిదండ్రులు హాజరుకావాలి. చేతులెత్తడం లేదా నోటిమాట చెప్పడం ద్వారా సభ్యులను ఎన్నుకుంటారు. ప్రత్యేక పరిస్థితులు ఉంటేనే ఓటింగ్ నిర్వహించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ఈ సీజన్‌కు 69 టీఎంసీలు

- సాగు, తాగునీటి కోసం కోరిన ఎన్నెస్పీ అధికారులు
- ఉమ్మడి జిల్లా ఆయకట్టుకు 57, తాగునీటికి 12 టీఎంసీలు
- కృష్ణమ్మ పరవళ్లతో ముందుగానే నీటి విడుదలకు అవకాశం



ఒంగోలు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో సాగు, తాగునీటికి ఢోకా లేదు. కృష్ణమ్మ పరవళ్లు ఆ మేరకు ప్రజలకు, ప్రత్యేకించి సాగర్ ఆయకట్టు రైతాంగానికి భరోసా కలిగిస్తున్నాయి. అంతేకాక షెడ్యూల్ కన్నా ముందుగానే సాగర్ నుంచి నీటిని విడుదల చేసే అవకాశం కూడా కనిపిస్తోంది. ఒంగోలు కేంద్రంగా ఉన్న జలవనరులశాఖ సర్కిల్ పర్యవేక్షణలో ఉమ్మడి జిల్లాలోని సాగర్ ఆయకట్టు ఉంది. ఈ పరిధిలో సుమారు 4.42 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. దీర్ఘకాలంగా కాలువల చివరి ప్రాంతంలోని దాదాపు లక్ష ఎకరాలకు నీరు అందక వర్షాధారిత పంటలను రైతులు వేస్తున్నారు. మిగిలిన సుమారు మూడున్నర లక్షల ఎకరాల్లో ఇంచుమించు సగం విస్తీర్ణంలో మాగాణి, మిగిలిన సగం విస్తీర్ణంలో ఆరుతడి పంటలు సాగు చేస్తారు. అయితే 2023-24 సీజన్‌లో సాగర్ డ్యాం నిండకపోవడంతో సాగు నీరివ్వలేదు. దీంతో ఆరుతడి పంటలు సాగుచేసే భూముల్లో వర్షాధారం లేదా అందుబాటులో ఉన్న వనరులతో పంటలను వేసినా మాగాణి సాగు చేయలేకపోయారు. దీంతో సాగర్ ఆయకట్టులో ధాన్యం ఉత్పత్తి, పశుగ్రాసానికి ఇబ్బంది కలిగింది. పాడిపరిశ్రమపైనా ఆ ప్రభావం పడింది.

### కృష్ణానదికి కరువు తీరా వరద

ఈ ఏడాది కృష్ణానదిలో ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు ఇప్పటికే నిండుకుండలా మారింది. ఆ జలాశయం నీటిమట్టం 885 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 212 టీఎంసీలు కాగా బుధవారం ఉదయానికే 883 అడుగులకు చేరింది. ఎగువ నుంచి 4.20లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండటంతో 10 గేట్లు ఎత్తి 2.50లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతున్నారు. ఆ నీరు సాగర్ డ్యాంకు గురువారం చేరనుంది. కాగా 590 అడుగుల నీటిమట్టం, 315 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న సాగర్ డ్యాంలో ప్రస్తుతం 521 అడుగుల మట్టంలో 153 టీఎంసీలు నీరు ఉండగా లక్షా 70వేల క్యూసెక్కుల నీరు వస్తోంది గురువారం నాటికి ఇన్‌ఫ్లో రెండున్నర లక్షలకు చేరే అవకాశం ఉంది. అలా నీరు వస్తే రానున్న వారంరోజుల్లో సాగర్ డ్యాం కూడా నిండే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ఈ సీజన్‌కు సాగర్ ఆయకట్టులో సాగుకు, తాగునీటికి ఢోకా ఉండదన్న అభిప్రాయం అధికారుల్లో వ్యక్తమవుతోంది

### ముందుగానే ఇచ్చే అవకాశం

ఉమ్మడి జిల్లాలోని సాగర్ ఆయకట్టులో సాగు, తాగుఅవసరాలకు 69 టీఎంసీలు నీరు అవసరమని జిల్లా అధికారులు అంచనా వేశారు. గతంలో ఆయకట్టులో సాగైన విస్తీర్ణం, తాగునీటి వనరులకు సరఫరా చేసిన నీటి లెక్క ఆధారంగా సాగు కోసం సుమారు 57టీఎంసీలు, నాలుగు విడతలుగా తాగునీటి కోసం మరో 12 టీఎంసీలు అవసరమని గుర్తించారు. ఆమేరకు ఉన్నతాధికారులకు ఇక్కడి ఎన్నెస్పీ అధికారులు ప్రతిపాదించారు. నాలుగు రోజుల క్రితం ప్రాజెక్టు సీఈ నిర్వహించిన సమీక్షలో ఆ మేరకు నివేదించిన వారు తొలి మూడు మాసాల్లో కనీసం 20 టీఎంసీలు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం జోన్1లో ఉన్న గుంటూరు, పల్నాడు జిల్లాలకు ఆగస్టు ఆఖరులో, జోన్-2లో ఉన్న ప్రకాశం, బాపట్ల జిల్లాలకు సెప్టెంబరు 15 నుంచి నీరు విడుదల చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం శ్రీశైలం నిండి సాగర్ డ్యాం వైపు కృష్ణమ్మ పరుగులు తీస్తుండటంతో మరింత ముందుగానే సాగుకు నీరు ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

- బాత్‌రూంలో శిశువు మరణం
- బాలికను రిమ్స్‌కు తరలించిన పోలీసులు
- విచారణ చేపట్టిన అధికారులు
- నెలన్నర క్రితమే చేరిందంటున్న సిబ్బంది


కేజీబీవీ సిబ్బందిని విచారిస్తున్న డీఈవో సుభద్ర

# కేజీబీవీలో విద్యార్థిని ప్రసవం

వివరాలు లోపలి పేజీల్లో..

# అంటకాగిన వారు ఔట్!

- వైసీపీ ప్రభుత్వ బాధితులకు ప్రాధాన్యం
- పోలీసు బదిలీల్లో కూటమి ప్రభుత్వం మార్క్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలతో అంటకాగి విధి నిర్వహణలో అడ్డగోలుగా వ్యవహరించిన పోలీసు అధికారులపై కూటమి సర్కారు వేటు వేస్తోంది. అప్పట్లో ఎన్ని అర్హతలు ఉన్నా పోస్టింగ్‌లు ఇవ్వకుండా వేధించిన, లూప్ లైన్‌లో ఉంచిన వారికి ప్రాధాన్యం ఇస్తోంది. పోలీసు శాఖలో ఉన్నతాధికారుల నుంచి సీఐల వరకూ జరుగుతున్న బదిలీలను పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం జరిగిన డీఎస్పీలు, సీఐల బదిలీల్లో గత ప్రభుత్వంతో అంటకాగిన వారిని పక్కనపెట్టి అర్హత ఉండీ ఇప్పటివరకూ ప్రాధాన్యం లేని పోస్టుల్లో ఉన్న వారిని నియమించింది. సీఐల విషయంలోనూ అదేపంథాను అనుసరిస్తున్నట్లు ప్రాథమికంగా జరిగిన కొన్ని బదిలీల్లోనే తేటతెల్లమవుతోంది. దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డిని బదిలీ చేసి పోలీసు హెడ్‌క్వార్టర్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. అలాగే ఒంగోలు డీఎస్పీ కిషోర్‌ను బదిలీ చేసి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. వీరిలో అశోక్‌వర్ధన్‌రెడ్డి సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు దర్శి నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థికి మద్దతుగా వ్యవహరించారన్న ఆరోపణను ఎదుర్కొన్నారు. ఒంగోలులోని రిమ్స్ ఆవరణలో జరిగిన రాజకీయ ఘర్షణ, వెంగముక్కలపాలెంలో పోలింగ్ కేంద్రం వద్ద జరిగిన గొడవలో పోలీసుశాఖ అప్పటి అధికారపార్టీకి అనుకూలంగా వ్యవహరించిందన్న అపవాదును మూటగట్టుకుంది. తాలూకా సీఐపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు తీసుకున్నప్పటికీ, ప్రస్తుతం డీఎస్పీని బదిలీ చేసి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడం గమనార్హం. దర్శి డీఎస్పీగా కర్నూలు జిల్లాలో సీఐడీలో ఉన్న లక్ష్మీనారాయణకు అవకాశం ఇవ్వడంలో కూడా ఆంతర్యం లేకపోలేదు. వైసీపీ ప్రభుత్వం ఉన్నంత కాలం పక్కనపెట్టిన రాయపాటి శ్రీనివాసరావుకు ఒంగోలు డీఎస్పీగా అవకాశం ఇవ్వాలని భావించగా, గుంటూరు జిల్లాలో ఆయన అవసరం ఉందన్న కారణంతో తాత్కాలికంగా పోస్టింగ్ ఇవ్వలేదని తెలిసింది. మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావును కూడా హెడ్‌క్వార్టర్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కువకాలం పనిచేసి గత వైసీపీ ప్రభుత్వంలో అప్రధాన్య పోస్టులో ఉన్న ఘట్టమనేని శ్రీనివాసరావును మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే అభ్యంతరం చెప్పినా నెల్లూరు రూరల్‌కు డీఎస్పీగా నియమించారు. బుధవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత వచ్చిన కొన్ని సీఐల పోస్టింగ్‌ల విషయంలోనూ అదే పంథా కనిపించింది. ఒంగోలు తాలూకాకు నియమించిన సీఐ అజయ్ కుమార్, వన్‌టౌన్‌కు నియమితులైన వై.నాగరాజు, సింగరాయకొండ సీఐగా నియమితులైన హజరత్తయ్య, మార్టూరు సీఐగా నియమితులైన ఎన్.శేషగిరిరావు, చీరాల వన్ టౌన్‌కు బదిలీ అయిన మారేడు శ్రీనివాసరావు, సంతమాగులూరు సీఐగా నియమితులైన వెంకట్రావు కూడా ఇప్పటివరకూ వీఆర్‌లోనూ, ప్రాధాన్యం లేని పోస్టుల్లో ఉన్నవారే. గత ప్రభుత్వం వారిని కావాలని పక్కనపెట్టింది. కూటమి ప్రభుత్వం గుర్తించి వారికి కీలక సర్కిళ్లను అప్పగించింది. స్థానికంగా మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫార్సు చేసినా అధికారుల గత పనితీరును పరిశీలించిన తర్వాతే పోస్టింగ్‌లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. అందువలన కొందరి సిఫార్సులు కూడా చెల్లడం లేదని సమా చారం. చీమకుర్తి సీఐగా గతంలో ప్రచారం జరిగినట్లు హిందూ పురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ సిఫారసు చేసిన సుబ్బారావుకే దక్కింది.


దర్శి డీఎస్పీగా నియమితులైన లక్ష్మీనారాయణ


మంత్రి లోకేశ్ ఓఎస్‌డీగా మార్కాపురం వాసి
రైతు కుటుంబం నుంచి ఎదిగిన వెంకటరమణ
లోపలి పేజీల్లో..


వైసీపీలో భగ్గుమన్న విభేదాలు
మార్కాపురం మునిసిపల్ చైర్మన్‌గిరీపై వీడని పీటముడి
లోపలి పేజీల్లో..

# దేవి సీఫుడ్స్‌ను సందర్శించిన కలెక్టర్

• ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలన



రొయ్యల ప్రాసెసింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

సింగరాయకొండ, జూలై 31 : మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని దేవి సీఫుడ్స్‌ను బుధవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా సందర్శించారు. కంపెనీలోని రొయ్యల ప్రాసెసింగ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం రొయ్యల కొనుగోలు, శుభ్రపరిచే విధానం, ఏఏ దేశాలకు ఎగుమతి చేస్తారన్న విషయాలను అక్కడి ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కంపెనీ వర్కర్లు ఉండే హాస్టల్‌ను పరిశీలించారు. వారికి కంపెనీ కల్పించే సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్, ఏడీ ఉషాకిరణ్, ఏఈ వర్షిణి ఉన్నారు.

## ఎమ్మెల్యే బీఎన్‌కు సత్కారం



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న రవి

సంతనూతలపాడు, జూలై 31: సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.రవి మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఒంగోలులోని బీఎన్ నివాసంలో ఎమ్మెల్యేను కలిసిన ఆయన దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

## అద్దంకి వెంకటేశ్వర్లు సేవలు అభినందనీయం : ఎస్పీ



వెంకటేశ్వర్లు దంపతులను సత్కరిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 31: జిల్లాలోని పోలీసుశాఖలో సుదీర్ఘకాలంగా సేవలందించిన అద్దంకి వెంకటేశ్వర్లు సేవలు అభినందనీయమని ఎస్పీ ఏఆర్.దామోదర్ కొనియాడారు. ఒంగోలులోని పోలీసు శిక్షణ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న సీఐ అద్దంకి వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ కార్యక్రమం పీటీసీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్పీ మాట్లాడుతూ 41సంవత్సరాలుగా పోలీసుశాఖలో పనిచేస్తూ వివిధ స్టేషన్‌లలో వివిధ హోదాలలో ఆయన అందించిన సేవలు మరువలేనివి అన్నారు. ప్రతి ఉద్యోగికి తన జీవితంలో ఉద్యోగ విరమణ తప్పదని, విరమణ పొందిన తర్వాత శేష జీవితాన్ని కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలని, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు దంపతులను ఆయన శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో పీటీసీ ఇన్‌చార్జి వైస్‌ప్రిన్సిపాల్ డి.లక్ష్మీకుమార్, డీఎస్పీలు సురేష్‌బాబు. జ్యోతిరాణి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## విద్యా సామగ్రి పంపిణీ



మాట్లాడుతున్న పోతుల రామారావు

టంగుటూరు, జూలై 31 : టంగుటూరులోని పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు బుధవారం విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఇంటర్ విద్యార్థులకు నీట్, ఏపీఈఏపీ సెట్ మెటీరియల్‌ను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని సూచించారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన ప్రిన్సిపాల్ నారాయణరావును ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సరోజా సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు చిడిపోతు వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకుడు కసుకుర్తి శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పట్టుబడిన మద్యం సీసాలు ధ్వంసం



మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న పోలీసు సిబ్బంది

సంతనూతలపాడు, జూలై 31: సార్వత్రిక ఎన్నికల సమయంలో ఒంగోలు రూరల్ సర్కిల్ పరిధిలోని నాగులుప్పలపాడు, మద్దిపాడు, సంతనూతలపాడు మండలాల్లో ఆయా రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి పట్టుకున్న 32 మద్యం బాక్సులలోని మద్యం సీసాలను ఎస్పీ ఏఆర్.దామోదర్ ఆదేశాల మేరకు బుధవారం ఆయా పోలీస్‌స్టేషన్‌లలో ధ్వంసం చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.రవి, సీఐ అజయ్‌కుమార్, ఎస్సై దేవకుమార్, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

## సాంస్కృతిక చైతన్య ప్రచారయాత్ర ప్రారంభం



మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

ఒంగోలు(కల్చరల్), జూలై 31: నవ్యాంధ్ర రాష్ట్ర సాంస్కృతిక చైతన్య ప్రచార కళాయాత్రను బుధవారం ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి ఒంగోలులోని తెలుగుతల్లి విగ్రహం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని అమరావతిలో 25 అడుగుల ఘంటసాల విగ్రహాన్ని ఏర్పాటు చేసి కళాక్షేత్రాన్ని నిర్మించాలని, ఎన్టీఆర్, ఘంటసాలకు భారతరత్న ప్రకటించాలని కోరారు. అదేవిధంగా కృష్ణానదికి ఇరువైపులా తెలుగుజాతి మహనీయుల విగ్రహాలు ఏర్పాటుచేయాలని లలిత కళా అకాడమీ అధ్యక్షుడు సంతవేలూరి కోటేశ్వరరావు కోరారు. జిల్లాస్థాయిలో అన్ని కళా, ప్రజాసంఘాల వారితో కోఆర్డినేట్ కమిటీ నిర్మాణం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పలు కళాసంస్థల ప్రతినిధులు యు.కోటేశ్వరరావు, తన్నీరు శివప్రసాద్, ఝాన్సీరాణి, కోట సుభాష్‌చంద్రబోస్, చిన్నారెడ్డి, ఎస్‌కే. నూరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రానైట్ పరిశ్రమ సమస్యలను పరిష్కరించాలి

ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకుల వినతి



సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ నాయకులు

చీమకుర్తి, జూలై 31: గ్రానైట్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని చీమకుర్తి గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు కాట్రగడ్డ రమణయ్య కోరారు. చీమకుర్తి, బూదవాడ, ఆర్ఎల్.పురం, మర్రిచెట్లపాలెం గ్రానైట్ ఫ్యాక్టరీల ఓనర్ల అసోసియేషన్ నాయకులు బుధవారం రామతీర్థం వీటీసీలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. 3సీఎం శ్లాబులు ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీ ఓనర్లు ఆగస్టు 1 నుంచి సమ్మెలోకి వెళ్లనున్న నేపథ్యంలో మిగతా అన్ని రకాల శ్లాబులను ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీల పరిస్థితి ఏమిటనే విషయంపై చర్చించడానికి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న నాయకులు డిమాండ్, సరఫరా మధ్య అంతరాన్ని తగ్గించటం ద్వారా శ్లాబు రేట్లు పెరిగేలా చేయవచ్చనే అభిప్రాయానికి వచ్చారు. ఒకేసారి సమ్మెలోకి వెళ్తే ఫ్యాక్టరీలను లీజుకు తీసుకున్నవారు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉండటంతో సమ్మెలోకి వెళ్లకుండా ఉత్పత్తిని నియంత్రించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా ప్రతి ఆదివారం ఫ్యాక్టరీలను మూసివేసి ఉత్పత్తిని నిలిపివేయాలని, బిల్లులు లేకుండా రవాణా చేయకూడదని తీర్మానించారు. బయ్యర్ల వద్ద నుంచి కచ్చితంగా బిల్లులు తీసుకోవాలని, అలా కాకుండా అక్రమ రవాణాకు పాల్పడటం ద్వారా ప్రభుత్వ ఖజానాకు గండికొట్టే వ్యవహారాలకు చెక్ పెట్టాలని తీర్మానించారు. పరిశ్రమను సంక్షోభం నుంచి గట్టెక్కించే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కాట్రగడ్డ రమణయ్య, నూకల సురేంద్ర, అహ్మద్‌బాష, మస్తాన్‌రెడ్డి, లగడపాటి శ్రీనివాసరావు, కందిమళ్ల గంగాధరరావు, వైఎస్.రాము, మలినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రొయ్యల సీడ్ తయారీ, సాగు పరిశీలన

• పలు సూచనలు చేసిన కలెక్టర్



ఆక్వా రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

కొత్తపట్నం(ఒంగోలునగరం), జూలై 31: మోనోడాన్ నాసిరకం రొయ్యల సీడ్ రైతులను నట్టేట ముంచేసిందన్న ఫిర్యాదుల నేపథ్యంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా బుధవారం జిల్లాలోని పలుచోట్ల రొయ్యల సాగును, రొయ్యల సీడ్‌ను తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. తొలుత కొత్తపట్నం మండలం గమళ్ళపాలెం పరిధిలోని రవి హేచరీస్‌లో రొయ్యల ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. ఉత్పత్తి చేసే విధానాన్ని, హేచరీలోని పలు విభాగాలను స్వయంగా పరిశీలించారు. సముద్రపు నీటి రిజర్వాయర్ యూనిట్, ఫీడ్ యూనిట్, షవర్ యూనిట్‌లను తనిఖీ చేశారు. రవి హేచరీ నిర్వాహకులు సుబ్బారెడ్డి రొయ్యల సీడ్‌ను ఉత్పత్తి చేసే విధానాన్ని కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఆమె ఈతముక్కల గ్రామంలోని రొయ్యల సాగును పరిశీలించారు. ఆక్వా రైతు కుల్లూరు సుబ్బారావుతో మాట్లాడారు. రొయ్యల చెరువు వద్దనే సంబంధిత వివరాలను తెలుసుకున్నారు. ఎకరాకు ఎంత ఖర్చు అవుతుంది, రొయ్య పిల్లలు ఎక్కడ నుంచి కొనుగోలు చేస్తారు, సాగు ఎన్ని నెలలు అనే వివరాలను తెలుసుకున్నారు. సాగులో ఎదురవుతున్న ఇబ్బందులను గురించి ఆమె రైతులను ఆరా తీశారు. రొయ్యల సాగు పూర్తి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి లోకేష్ ఓఎస్‌డీగా మార్కాపురంవాసి

• పలువురి అభినందన



ఆకుల వెంకటరమణ

మార్కాపురం, జూలై 31: రాష్ట్ర మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేష్ ఓఎస్‌డీగా మార్కాపురం పట్టణానికి చెందిన ఆకుల వెంకటరమణ నియమితులయ్యారు. ఈయన గతంలో తూర్పుగోదావరి జిల్లా చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేశారు. అక్కడ గిరిజనులతో మమేకమై వారికి ప్రభుత్వ పథకాలను అందించడంలో, జీవన ప్రమాణాలను పెంపొందించడంలో సఫలీకృతులయ్యారు. అక్కడ నుంచి కడప జిల్లా బద్వేలు ఆర్డీవోగా బదిలీ అయ్యారు. అక్కడకూడా సమర్థవంతమైన అధికారిగా ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందారు. ప్రస్తుతం వెంకటరమణ అత్యంత కీలకమైన మానవ వనరులశాఖలో మంత్రి నారా లోకేష్ ఓఎస్‌డీగా నియమితులు కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి..**

మార్కాపురం పట్టణానికి చెందిన ఆకుల శ్రీరాములు, లక్ష్మీనరసమ్మల కుమారుడు వెంకటరమణ. సాధారణ రైతు కుటుంబంలో పుట్టారు. ప్రభుత్వ కొలువు సాధించాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ఆ దిశగా శ్రమించి అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2012లో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలు రాశారు. కానీ ఆ నోటిఫికేషన్‌కు సంబంధించి ఫలితాలు మాత్రం 2016లో విడుదలయ్యాయి. వెంకటరమణ కృషి పట్టుదల, శ్రమలకు ప్రతిఫలంగా అప్పట్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారు. అంతేకాక అత్యంత వెనుకబడిన మార్కాపురం ప్రాంతంలోని విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఆయన తల్లిదండ్రుల పేరున సొంతంగా గ్రంథాలయాన్ని నడుపుతున్నారు. తనలాగా ఎవరూ ఇబ్బందులు పడకూడదని ఈ నిర్ణయం తీసుకున్నారు. వందలాది మంది పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ఆ గ్రంథాలయాన్ని ఉపయోగించుకుంటున్నారు. అంతేకాక మార్కాపురం వచ్చిన ప్రతిసారీ గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి వారిలో స్ఫూర్తిని నింపుతున్నారు. మోటివేషనల్ తరగతులు కూడా తీసుకుంటున్నారు. పేద విద్యార్థులెవరైనా ఉంటే వారికి ఉచితంగా స్టడీ మెటీరియల్ కూడా అందిస్తున్నారు. తద్వారా ఈ ప్రాంతం పట్ల ఆయనకున్న అభిమానాన్ని చాటుకుంటున్నారు.

# చెత్త తయారీ కేంద్రాలకు గ్రహణం

• నిరుపయోగంగా ట్రైసైకిళ్లు, ఆటోలు



ఎంపీడీవో కార్యాలయంలో మూలనపడి ఉన్న ట్రైసైకిళ్లు, ఆటోలు

మద్దిపాడు, జూలై 31: చెత్త తయారీ కేంద్రాలకు గ్రహణం పట్టింది. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం చెత్త సంపద కేంద్రాలకు శ్రీకారం చుట్టగా ఆ లక్ష్యం నెరవేరడం లేదు. వాటిని పట్టించుకునే నాథుడే లేక ట్రై సైకిళ్లు, చెత్తను సేకరించే ఆటోలు నిరుపయోగంగా పడిఉన్నాయి. మద్దిపాడు మండలంలో నాటి టీడీపీ ప్రభుత్వం 10 చెత్త తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అప్పుడు అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో ఆ పనులు శరవేగంగా జరిగాయి. ఆ క్రమంలో ఇప్పటివరకు 6 కేంద్రాలు పూర్తయ్యాయి. మిగతా నిర్మాణ దశలో ఉన్నాయి. రాష్ట్రంలో 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే చెత్త సంపద కేంద్రాలను పట్టించుకోవటం మానేసింది. దీంతో అవి నిరుపయోగంగా పడిఉన్నాయి. మండలంలో చెత్త తయారీ కేంద్రాలకు వైసీపీ ప్రభుత్వం గ్రీన్ వలంటీరీలను నియమించింది. అయితే గ్రామాల్లో ఉన్న చెత్తను రిక్షాలకు వేసుకొని ఊరికి దూరంగా పడేసేవారు కానీ వాటితో వర్మి కంపోస్టు తయారు చేయలేదు. దీంతో నందిపాడు గ్రామంలో చెత్త సంపద కేంద్రాలు పిచ్చి మొక్కలు మొలిచి నిరుపయోగంగా మారాయి. గుండ్లాపల్లి చెత్త సంపద కేంద్రానిదీ అదేపరిస్థితి. ఆయా కేంద్రాల్లో పనిచేసే సిబ్బందికి గత ఆరు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని గ్రామపంచాయతీలకు కేటాయించేందుకు నాడు రూ.30 లక్షలు ఖర్చుతో ఆటో రిక్షాలు, ట్రైసైకిళ్లు కొనుగోలు చేశారు. అయితే తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు వాటిని పట్టించుకోలేదు. దీంతో అవన్నీ స్థానిక ఎంపీడీవో కార్యాలయం దగ్గర మూలనపడి తుప్పుపట్టి పడిఉన్నాయి. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

# ఓపెన్ కాని వెబ్‌ల్యాండ్‌తో అవస్థలు

• ఇబ్బందిపడుతున్న రైతులు

మద్దిపాడు, జూలై 31: గత వైసీపీ ప్రభుత్వం భూముల రీసర్వే పేరిట చేసిన తప్పులు ప్రస్తుతం అప్‌డేట్ చేస్తున్నామంటూ ఉద్యోగులు చెప్తున్న మాటలకు రైతులు ఇబ్బందిపడుతున్నారు. వెబ్‌ల్యాండ్ ఓపెన్ కాకపోవడం, ఎప్పుడు వస్తుందో అర్థంగాక రైతులు తలపట్టుకుంటున్నారు. మేము చేసేదేం లేదంటూ ఉద్యోగులు నెపం ప్రభుత్వంపై నెడుతున్నారు. గత ప్రభుత్వం రీసర్వే పేరుతో గ్రామాల్లో డ్రోన్ సర్వే చేపట్టింది. సమగ్ర ప్రణాళిక నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టానుసారం భూములు రీసర్వే చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలో అన్ని గ్రామల్లో రీసర్వే పూర్తయినట్లు అధికారులు గణాంకాలు చూపిస్తున్నారు. అయితే గ్రామాల్లో చాలా వరకు భూములు రీసర్వే చేయలేదు. సర్వే చేసిన వాటికి ఎల్పీ నెంబర్లు ఇచ్చారు. గ్రామాల్లో చాలావరకు జగన్ బొమ్మలతో కూడిన సర్వే హద్దురాళ్లను పొలాల వద్ద వేశారు. దీనిపై పెద్దఎత్తున దుమారం రేగింది. భూమి రిజిస్టర్ చేయాలంటే వెబ్‌ల్యాండ్‌లో పేరు నమోదై ఉండాలి. అయితే ప్రభుత్వం వెబ్‌సైట్ నిలిపివేయడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. రైతులు సాధారణంగా ఖరీఫ్‌కు ముందు భూమి తనఖా పెట్టి రుణాలు తీసుకుంటారు. సహకార సంఘాలు భూములు తనఖా పెట్టుకుని మాత్రమే రుణాలు ఇస్తున్నాయి. అయితే వెబ్‌ల్యాండ్ పని చేయక, బాండ్లు రిజిస్ట్రేషన్ కావటం లేదు. ఉన్నతాధికారులు స్పందించి వెబ్‌ల్యాండ్‌ను పునరుద్ధరించాలని మండల రైతులు కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో గిరిజన యువకుడు మృతి

• బైకును లారీ ఢీకొనడంతో ఘటన

పెద్దదోర్నాల, జూలై 31: రోడ్డు ప్రమాదంలో గిరిజన యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని గంటవానిపల్లె చెరువు వద్ద బుధవారం చోటు చేసుకొంది. ఈ ఘటకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బందంబావిగూడేనికి చెందిన కుడుముల రాజుకొండయ్య బైకుపై స్వగ్రామం నుంచి దోర్నాల వస్తున్నాడు. కర్నూలు వైపు వెళుతున్న లారీ అదుపుతప్పి బైకును ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని 108దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతిచెందాడు. ఎస్సై అంకమ్మరావు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించి, కేసునమోదు చేశారు.

## చోరీ కేసులో ఇద్దరు యువకులు అరెస్ట్

మార్కాపురం, జూలై 31: మార్కాపురంలోని గడియారస్తంభం కూడలి సమీపంలోని పూల దుకాణంలో జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు యువకులను మార్కాపురం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.35,480ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై అబ్దుల్‌రెహమాన్ కథనం మేరకు పట్టణానికి చెందిన షేక్ ఖాజావలికి గడియారస్తంభం కూడలి వద్ద పూలదుకాణం ఉంది. జూలై 25న రాత్రి షెట్టర్ తాళాలు పగులకొట్టి దుకాణంలో ఉన్న రూ.లక్ష నగదును దొంగిలించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలించారు. ఈ క్రమంలో సమీపంలోని సీసీ కెమెరాల్లో నమోదైన రికార్డులను పరిశీలించి నిందితులను గుర్తించారు. స్థానిక భగత్‌సింగ్ కాలనీ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న జగదీశ్వరి థియేటర్ ప్రాంతానికి చెందిన షేక్ ఇనాయక్ అలీ, రాజ్యలక్ష్మి కాలనీకి చెందిన జెల్లి సాయికుమార్‌లను స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. తామే దొంగతనం చేసినట్లు నిందితులిద్దరూ ఒప్పుకోవడంతో వారి వద్దవున్న నగదును స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి బుధవారం కోర్టులో హాజరుపర్చారు. న్యాయాధికారి వారికి రిమాండ్ విధించారు.

## సబ్ జైలులో న్యాయాధికారి తనిఖీ

గిద్దలూరు టౌన్, జూలై 31: గిద్దలూరులోని సబ్‌జైలును బుధవారం అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.మేరీసారాదానమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, భోజన, మెడికల్ వసతులు, మంచినీటి సౌకర్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఖైదీలపై ఉన్న కేసుల వివరాలను పరిశీలించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సెషన్స్ కేసుల్లో విచారణ జరుగుతున్న కేసులకు సంబంధించి బెయిల్‌కు అర్జీలు పెట్టుకోవాల్సిందిగా ఆమె సూచించారు. అనంతరం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన తప్పిదాలే నేరాలకు దారితీస్తామయన్నారు. సమస్యలు ఉంటే ప్రశాంతంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఉద్రేకంలో ఆలోచన లేకుండా నిర్ణయాలు తీసుకోకూడదని చెప్పారు. కార్యక్రమంలో సబ్‌జైలు వార్డెన్ పి.రవీంద్రనాథ్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కె.ప్రకాశ్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# అవీ..ఇవీ..

## నేడు పాకలలో మంత్రిచే పింఛన్ల పంపిణీ

సింగరాయకొండ, జూలై 31 : సామాజిక పింఛన్‌ల పంపిణీ గురువారం నుంచి ప్రారంభంకానుంది. మండలంలోని పాకల పంచాయతీ పరిధిలోని పల్లెపాలెంలో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పాల్గొననున్నారు. అనంతరం ఆయన గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేస్తారు.

## అత్యవసర విమానలాండింగ్ సౌకర్యాలపై మాగుంట ప్రశ్న

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 31: ఆంధ్రప్రదేశ్‌లో అత్యవసర విమాన లాండింగ్ సౌకర్యాల ఏర్పాట్లపై ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర రోడ్డురవాణా, హైవేస్‌శాఖ మంత్రి నితిన్‌గడ్కరి సమాధానం ఇస్తూ గత ఐదేళ్లలో దేశంలో అత్యవసరంగా హైవేలపై విమానాలు దిగేందుకు 11 ప్రాజెక్టులను చేపట్టినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకాశం జిల్లా సింగరాయకొండ ప్రాజెక్టుకు సంబంధించి ప్రధాన సివిల్ పనులన్నీ పూర్తి కాగా బాపట్ల జిల్లా రేణంగివరం దగ్గర ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయని మాగుంట ప్రశ్నకు కేంద్ర మంత్రి వివరణ ఇచ్చారు.

## భవిత కేంద్రాల్లోని పిల్లలకు ప్రత్యేక విద్య

మద్దిపాడు, జూలై 31: మద్దిపాడులోని భవిత కేంద్రం ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు వివిధ కృత్యాల ద్వారా ప్రత్యేక విద్యను అందజేస్తున్నట్లు జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.రమేష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపయోగించే బోధన ఉపకరణాలు పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం, విద్యాప్రవేశ్ కార్యక్రమ అమలును తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నైతిక విలువలతో కూడిన విద్య అందించాలి : డీఈవో



మాట్లాడుతున్న డీఈవో సుభద్ర

మద్దిపాడు, జూలై 31: విద్యార్థులకు నైతిక విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అవసరమని, ఉపాధ్యాయులు ఆ దిశగా వారిని తీర్చిదిద్దాలని డీఈవో సుభద్ర పేర్కొన్నారు. బుధవారం తెల్లబాడు హైస్కూలును ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎంఈవో ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మద్దిపాడు, జూలై 31: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం మద్దిపాడు పోలీస్‌స్టేషన్ వద్ద చెత్తను తొలగించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. రూరల్ సీఐ అజయ్‌కుమార్ మాట్లాడుతూ మొక్కలు మానవ మనుగడకు సహాయపడతాయన్నారు. హెల్మెట్ భారం కాదు బాధ్యతని, ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ మహేష్, ఏఎస్సై రమేష్ ప్రేమ్‌కుమార్, బుర్రా వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముక్తినూతలపాడు విద్యార్థుల ప్రతిభ

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 31: నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కిప్పింగ్ పోటీల్లో ఒంగోలు నగర పరిధిలోని ముక్తినూతలపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. అండర్-12 విభాగంలో టి.ప్రసన్న ద్వితీయ స్థానం సాధించగా, ఆర్‌సహోన్ తృతీయ స్థానంలో నిలిచారు. టి.లాస్య తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా బుధవారం స్థాని స్కూలులో స్కిప్పింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను హెచ్‌ఎం దేవసేన, పీడీ ప్రభాకర్, పీఈటీ రామాంజిబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

## పూర్వ డీఎల్‌సీవోపై విచారణ

ఒంగోలు(విద్య), జూలై 31 : జిల్లాలో గతంలో పని చేసిన పూర్వ డీఎల్‌సీవో తోట సాయినాథ్‌పై విచారణ ప్రారంభించారు. గతంలో ఆయనపై పలు ఆరోపణలు రావడంతో అప్పటి కలెక్టర్ దినేష్‌కుమార్ విచారణకు ఆదేశించారు. అయితే సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈ విచారణ జాప్యం జరిగింది. ఈక్రమంలో ఒంగోలులో మంగళ, బుధవారాల్లో డీసీవో బి.శ్రీనివాసరెడ్డి, ఏడీ అర్చనలు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఫిర్యాదుదారులను విచారించారు.

## పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.359

సంతనూతలపాడు, జూలై 31: పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారం పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.359 పలికింది. కందులూరు క్లస్టర్ నుంచి 1222 పొగాకు బేళ్లు అమ్మకానికి రాగా 1069 బేళ్లు అమ్ముడైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. 153 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు చెప్పారు. కనిష్ఠ ధర రూ.205, సరాసరి ధర రూ.289.46 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో 13 కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## ఇరువురికి ఉద్యోగ నియామకపత్రాల అందజేత

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 31: జిల్లా ప్రజాపరిషత్ యాజమాన్య పరిధిలో ఇరువురికి కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలను జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అందజేశారు. ఒంగోలులోని జడ్పీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో గలగల నరేష్‌కు జిల్లా పరిషత్ కార్యాలయంలో, వై.సుధాకర్‌కు గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆఫీసు సబార్డినేట్లుగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో సి.హనుమంతరావు, పరిపాలనాధికారి వాకా శ్రీనివాసరెడ్డి, సిబ్బంది వై.కిషోర్‌బాబు పాల్గొన్నారు.

## అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలకు జిల్లా జట్టు



జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 31: మూలపాడు, మంగళగిరిలో ఆగస్టు 1వ తేదీ నుంచి జరిగే సీనియర్స్ మెన్ అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లకు ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు పాల్గొంటుందని కార్యదర్శి కారసాల నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులపాటు కొరిశపాడులో జరిగిన ఎంపిక పోటీల్లో క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొనగా కొల్లా క్రాంతికిరణ్, ఎం.లోకేష్‌రెడ్డి (వికెట్‌కీపర్), పీవీ.పవన్‌కుమార్ (వికెట్‌కీపర్), ఎం.అభినవ్, పి.దుర్గాబాలాజీ, జి.రోహిత్, ఎ.కిరణ్, వి.వేణు (వైస్‌కెప్టెన్), ఎస్.చిన్నారావు, జి.సుమంత్, జి.సుమనందన్, ఎస్.ఆశిష్, పి.నవీన్, కె.శివకుమార్, జీజీ.పార్థసారథి, స్టాండ్ బైగా ఎన్‌వీ.పవన్‌కుమార్, జి.రవి, పి.వల్లి, టి.సురేష్, పి.వినయ్‌లను ఎంపిక చేసినట్లు తెలిపారు. కోచ్‌లుగా సుధాకర్, చంద్రశేఖర్‌లు వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

## అసిస్టెంట్ సిటీప్లానర్ కేవీకి సత్కారం



వెంకటేశ్వర్లు దంపతులను సత్కరిస్తున్న అతిథులు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 31: ఒంగోలు నగర పాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ కె.వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ వేడుక బుధవారం ఘనంగా జరిగింది. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మేయర్ గంగాడ సుజాతతోపాటు, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, వెలనాటి మాధవరావు, కమిషనర్ ఎం.జశ్వంత్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ రవీంద్ర. టీడీపీ కూటమి కార్పొరేటర్లు దాచర్ల వెంకటరమణయ్య, టి.రవితేజ, అంబూరి శ్రీను, సంద్రపాటి వర్ధ్‌వర్ల్, మలగా రమేష్, వైసీపీ కార్పొరేటర్లు కేవీ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సెక్షన్‌హెడ్‌లు, డీఈలు, ఏఈలు, రెవెన్యూ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, టౌన్‌ప్లానింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## కొత్తపట్నంలో పట్టపగలే చోరీ

• రూ.లక్ష నగదు, బంగారం అపహరణ

కొత్తపట్నం(ఒంగోలునగరం)జూలై 31: కొత్తపట్నంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన బుధవారం జరిగింది. స్థానిక పోస్టాఫీసురోడ్డులోని నంబూరి సత్యంకు చెందిన ఇంటిలో పట్టపగలే దొంగలు చొరబడి రూ.లక్ష నగదు, ఐదు సవర్ల బంగారాన్ని దోచుకెళ్లారు. సత్యం దంపతులు బుధవారం ఉదయాన్నే చినగంజాంలోని తన బంధువుల ఇంటికి వెళ్లారు. దీంతో దుండగులు ఇంట్లో ఎవరూ లేకుండా చూసి తలుపులు బద్దలు కొట్టి బీరువాలో ఉన్న నగదును, బంగారాన్ని అపహరించారు. సాయంత్రం ఇంటికి వచ్చిన సత్యం దంపతులు చోరీ జరగడంతో బావురుమన్నారు. కొత్తపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# వైసీపీలో భగ్గుమన్న విభేదాలు

**చైర్మన్ పదవిపై వీడని పీటముడి ● ప్రస్తుత చైర్మన్ తీరుకు నిరసనగా సమావేశానికి కౌన్సిలర్ల డుమ్మా**


ఖాళీగా ఉన్న చైర్మన్ కుర్చీ

మార్కాపురం, జూలై 31: మార్కాపురం మున్సిపల్ చైర్మన్ పీఠం బదిలీ వ్యవహారం వైసీపీలో విభేదాలకు కారణమైంది. మున్సిపల్ చైర్మన్ ఒకవైపు, కౌన్సిలర్లంతా మరోవైపు అన్నట్లు పరిస్థితి తయారైంది. అవినీతి అక్రమాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న చైర్మన్ వ్యవహార శైలి నచ్చకపోయినా ఇప్పటి వరకు కౌన్సిలర్లు మిన్నకున్నారు. వైసీపీ అధిష్ఠానం కూడా ఈ వ్యవహారాన్ని పట్టించుకోలేదు. గతంలో చేసుకున్న ఒప్పందం మేరకు తాను గద్దె దిగుతానని చైర్మన్ చెబుతూ కాలయాపన చేస్తున్నారు. ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు ఉన్నా చైర్మన్ పీఠం వ్యవహారంపై ఎటూ తేల్చలేకపోవడం కూడా కౌన్సిలర్ల అసహనానికి కారణమైంది. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పొందినప్పటి నుంచి ఆ పార్టీ కౌన్సిలర్లు అయోమయస్థితిలో ఉన్నారు. ప్రస్తుత చైర్మన్ గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే పక్షాన చేరినట్లు తెలుస్తోంది. దీంతో అప్పట్లో కౌన్సిలర్లందరినీ దగ్గరుండి గెలిపించిన మార్కాపురం మాజీ ఎమ్మెల్యే సోదరుడు అగ్గిమీద గుగ్గిలమవుతున్నాడు. ఈ నేపథ్యంలోనే ప్రతి నెలా జరిగే మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని వేదికగా చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సోదరుడి ఆదేశాల మేరకు బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి చైర్మన్, 9వ వార్డు కౌన్సిలర్ సిరాజుల్లాబేగ్ మినహా మిగిలిన 27 మంది కౌన్సిలర్లు డుమ్మా కొట్టారు. దీంతో కోరంలేక కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేయాల్సి వచ్చింది.

**పీఠం బదిలీ వ్యవహారంలో విభేదాలు**

మార్కాపురం మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని వైసీపీ 2021లో దక్కించుకుంది. అప్పటి పరిస్థితుల నేపథ్యంలో మొత్తం 35 స్థానాలకుగాను 30 మంది ఆ పార్టీ తరఫున కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. అప్పట్లో చైర్మన్ పదవి కోసం ప్రధానంగా ఇద్దరు పోటీపడ్డారు. ఒకరు ఆర్యవైశ్య సామాజిక వర్గం నుంచి మరొకరు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వాళ్లు. ఎన్నికలు ఏకపక్షంగా జరిగినా అప్పట్లో సుమారు రూ.5 కోట్ల మేర ఖర్చయింది. అందులో సింహభాగం ఖర్చు పెట్టిన రెడ్డి సామాజికవర్గం నాయకురాలికి నచ్చజెప్పి తొలుత ఆర్యవైశ్య సామాజిక వర్గం నాయకునికి చైర్మన్ పీఠం అప్పజెప్పారు. రెండున్నర సంవత్సరాల తర్వాత ఆమెకు అవకాశం కల్పించాల్సి ఉంటుందని అప్పట్లోనే ఒప్పందం చేసుకున్నారు. అంతేకాక ఆమెకు ఇవ్వాల్సిన డబ్బుల విషయం కూడా చాలా స్పష్టంగా ఒప్పందంలో పేర్కొన్నారు. పీఠం ఆమెకు అప్పజెప్పని పక్షంలో సుమారు రూ.2.5 కోట్లు ఇవ్వాలనేది కూడా ఒప్పందంలో ఒక భాగం. అయితే 2023లోనే పీఠాన్ని ఆమెకు అప్పజెప్పాల్సివున్నా చైర్మన్ ససేమిరా అన్నాడు. అంతేకాక సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సామాజిక వర్గ ఓట్లకు గండి పడుతుందనే భయంతో అధిష్ఠానం కూడా కాలయాపన చేసింది. ఈ విషయమై ఆమె గట్టిగా నిలదీయడంతో సార్వత్రిక ఎన్నికల అనంతరం పీఠం బదిలీ ఉంటుందని నచ్చజెప్పారు. ఈ క్రమంలో మార్కాపురం అభ్యర్థిని గిద్దలూరుకు, అక్కడి అభ్యర్థిని మార్కాపురం మార్చడం చైర్మన్‌కు కలిసొచ్చింది. వైసీపీ పరాజయం పాలవడంతో ఎన్నికల అనంతరం ఛైర్మన్ పీఠం ఆశించిన ఆమె తన డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడిని పెంచింది. దీంతో దిగి వచ్చిన చైర్మన్ ప్రస్తుతం తాను డబ్బులు ఇవ్వలేనని రాజీనామా చేసి దిగిపోతానని ఆమెకు చెప్పాడు. ఈ విషయంలో వైసీపీకి చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు సక్రమంగా జోక్యం చేసుకోకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటి కొచ్చింది. ప్రస్తుత చైర్మన్‌తోపాటు ఇప్పటివరకు పీఠం ఆశించిన ఆమె కూడా గత ఎన్నికల్లో ఇక్కడ పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యేతో దగ్గరగా ఉండడం ప్రస్తుత గిద్దలూరు వైసీపీ ఇన్‌చార్జ్‌కు నచ్చలేదు. తాను అప్పట్లో అన్నీ దగ్గరుండి వ్యవహారం నడిపితే ఇప్పుడు తనను పట్టించుకోకపోవడాన్ని జీర్ణించుకోలేక పోవడంతోనే కౌన్సిలర్లంతా బుధవారం జరిగిన మున్సిపల్ సమావేశానికి గైర్హాజరు కావాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా ఛైర్మన్ పీఠం వ్యవహారం వైసీపీలో అన్నిస్థాయి నాయకుల మధ్య విభేదాలకు కారణమైనట్లు తెలుస్తోంది.

**మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా**

మార్కాపురం వన్‌టౌన్, జూలై 31: మార్కాపురం మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం బుధవారం వాయిదాపడింది. కౌన్సిల్ సమావేశానికి 33వ వార్డుకు చెందిన టీడీపీ కౌన్సిలర్ నాలి కొండయ్య, 9వ వార్డుకు చెందిన వైసీపీ సిరాజుల్లా బేగ్‌లు మాత్రమే హాజరయ్యారు. మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ తన ఛాంబర్‌కే పరిమితమయ్యారు. వైసీపీకి చెందిన 29 మంది కౌన్సిలర్లు మూకుమ్మడిగా గైర్హాజరు కావడంతో కోరంలేక సమావేశాన్ని అధికారులు వాయిదా వేశారు.


సభ్యులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

## షిఫ్ట్‌ఆపరేటర్ల ఆధ్వర్యంలోనే విద్యుత్ స్తంభాల చోరీ

● నలుగురిని తొలగిస్తూ డీఈ ఉత్తర్వులు

ఎర్రగొండపాలెం, జూలై 31: మండలంలోని అమానిగుడిపాడు విద్యుత్తు ఉపకేంద్రంలో పాతవిద్యుత్ స్తంభాల చోరీ షిఫ్ట్ ఆపరేటర్ల పర్యవేక్షణలో జరిగిందని, దీంతో నలుగురు షిఫ్ట్ ఆపరేటర్లను విధులనుంచి తొలగించినట్లు మార్కాపురం ఏపీసీపీడీసీఎల్ ఆపరేషన్ డీఈ నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. ఉపకేంద్రంలో బుధవారం పరిశీలించగా 105 పాత విద్యుత్ స్తంభాలు కాంట్రాక్టర్ షిఫ్ట్ ఆపరేటర్లకు అప్పగించారని తెలిపారు. స్తంభాలు బయటకు వెళ్లడానికి షిఫ్ట్ ఆపరేటర్లే సహకరించినట్లు సమాచారం ఉందన్నారు. దర్యాప్తు పూర్తి అయ్యే వరకు నలుగురు షిఫ్ట్ ఆపరేటర్లను విధుల నుంచి తొలగించామని తెలిపారు. లైన్ ఇన్‌స్పెక్టర్ సంజాయిషీ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. 105 స్తంభాలు విలువ శాఖకు చెల్లించాలని నోటీసు ఇస్తామని తెలిపారు. ఒక్కొక్క స్తంభం విలువ రూ.1000 ఉంటుందన్నారు. దర్యాప్తు అధికారిగా మార్కాపురం ఏడీఈ సియనాయక్‌ను నియమించినట్లు తెలిపారు.

## గుండెపోటుతో ఏఆర్ కానిస్టేబుల్ మృతి

గిద్దలూరు టౌన్, జూలై 31 : గుండెపోటుతో ఏఆర్ కానిస్టేబుల్ మృతిచెందాడు. రాచర్ల మండలం అనంపల్లె గ్రామానికి చెందిన శిరిగిరి రవి (37) ఏఆర్ కాని స్టేబుల్‌గా 15 సంవత్సరాల నుంచి పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి ఒంగోలులో విధి నిర్వహణలో రవి గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రవి మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. రవికి భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. బుధవారం సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించగా పోలీసుశాఖ అధికారులు, సిబ్బంది రవికి వీడ్కోలు పలికారు. రవి మృతితో అనంపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## పలు దుకాణాల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ

మార్కాపురం వన్‌టౌన్, జూలై 31: మార్కాపురం పట్టణంలోని పలు దుకాణాల్లో ఫుడ్‌సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నరసింహులు మాట్లాడుతూ ప్రధాన వీధిలోని ఫ్యాన్సీ స్టోర్‌ను తనిఖీ చేయగా దానికి లైసెన్స్ లేదని నోటీసులు జారీ చేశామన్నారు. నెహ్రూబజార్‌లోని ఒక మెస్‌పై వచ్చిన ఆరోపణలపై కూడా విచారించి శాంపిల్స్ సేకరించామన్నారు. రాజాజీ వీధిలోని ఒక ఫ్యాన్సీ స్టోర్‌లో కూడా శాంపిల్స్ తీశామన్నారు. కాల పరిమితి ముగిసిన వస్తువులు అమ్మినా, దుకాణాలకు లైసెన్స్‌లు లేకపోయినా, ఎంఆర్‌పీ కంటే అధికంగా అమ్మినా తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

**శాంతిభద్రతలకు విఘాతం**

## కలిగిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ

ముండ్లమూరు, జూలై 31 : మండలంలోని శంకరాపురం గ్రామంలో ఇటీవల గొడవ పడి కేసులు పెట్టుకొని జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చిన వారితో పాటు ఇరు వర్గాలను దర్శి డీఎస్పీ జీ అశోక్ వర్ధన్‌రెడ్డి బుధవారం ముండ్లమూరు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ వారితో మాట్లాడుతూ అనవసరంగా గొడవలకు పాల్పడి శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దన్నారు. గొడవలకు దూరంగా ఉండి అందరూ కలసి మెలసి జీవించాలన్నారు. గ్రామంలో ప్రశాంతమైన వాతావరణానికి భంగం కలిగించే వ్యక్తులను గుర్తించి వారిపై రోజూ నిఘా పెడతామన్నారు. అవసరమైతే ఇరు వర్గాలపై రౌడీ షీట్లు కూడా ఓపెన్ చేయటం జరుగుతుందన్నారు. సీఐ షేక్ షమీముల్లా, ముండ్లమూరు, తాళ్లూరు ఎస్‌ఐలు వీ నాగమల్లేశ్వరరావు, విజయ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

## రహదారిని పరిశీలించిన జేసీ


రైల్వేలైన్ రహదారిని పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

దర్శి, జూలై 31 : మండలంలోని దర్శి-అద్దంకి రోడ్డులోని రైల్వే లైన్ కిందిగా వెళ్లే రహదారిని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. రహదారిని వెడల్పు తక్కువగా నిర్మించినందువల్ల ధాన్యం తరలించే వాహనాలు వెళ్లే వీలు లేకుండా రైతులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు కొద్ది రోజుల కిందట కలెక్టర్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆ రహదారిని జేసీ పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్, ఇన్‌చార్జి తహసీల్దార్ రవిశంకరర్ పాల్గొన్నారు.

## డ్రగ్స్‌ను పూర్తిగా నిషేధించాలి : డీవైఎఫ్‌ఐ

దర్శి, జూలై 31 : గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా సరఫరా అయిన డ్రగ్స్‌ను పూర్తిగా నివారించాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి. రామన్న కోరారు. దర్శి బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలికలపై దాడులు అధికమయ్యామన్నారు. యువత మత్తుకు అలవాటు పడి అకృత్యాలకు పాల్పడుతున్నదని చెప్పారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మహిళపై దాడులు అరికట్టేందుకు, డ్రగ్స్ నిషేధానికి పటిష్ట చర్యలు తీసకోవాలని సూచించారు. యువతకు ఉద్యోగ అవకాశాలు లేక ఖాళీగా ఉండటంతో చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దొనకొండలో కారిడార్ అభివృద్ధి చేసి ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై. రాము, రైతు సంఘం నాయకుడు సందు వెంకటేశ్వరరావు, కె.వెంకటరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



## విద్యుత్ బాధిత కుటుంబాలకు అండ

**ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి**

**ఒక్కొక్కరికి రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందజేత**



మృతులు బాలాజీ, దేశబోయిన నజీర్, వీరమాచనేని గౌతమ్ తల్లిదండ్రులకు బాండ్‌పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర, విద్యుత్ అధికారులు

కనిగిరి, జూలై 31: విద్యుత్ ప్రమాదంలో మరిణించిన వారిని తెచ్చివ్వలేను కానీ మీ కుటుంబ సభ్యుడిగా అండగా ఉంటానని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. గతనెల 23న మండలంలోని పునుగోడు గ్రామంలో విద్యుత్ హైటెన్షన్ వైరు తగిలి ముగ్గురు యువకులు సజీవ దహనమైన విషయం విదితమే. మృతి చెందిన యువకుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా నగదు బాండ్‌ను బుధవారం వారి నివాసాలకు ఎమ్మెల్యే విద్యుత్ అధికారులతో కలసి స్వయంగా వెళ్లి అందజేశారు. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువకులు విద్యుత్ ప్రమాదంలో మరణించిన విషయం తననెంతో కలచి వేసిందన్నారు. పరిహారం నగదు బాండు వచ్చిన తర్వాతే మిమ్మల్ని కలవాలని అనుకున్నానని, బాధిత కుటుంబ సభ్యులతో అన్నారు. మీరు ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటానని ఉగ్ర వారిని ఓదార్చారు. అనంతరం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రమాదం జరిగిన విషయం తెలిసి తాను విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకుపోయి ఆయన ద్వారా సీఎం దృష్టికి తీసుకువెళ్లానని చెప్పారు. దీంతో సీఎం వెంటనే ప్రమాదంలో మరణించిన కుటుంబానికి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు తెలిపారు. అసెంబ్లీ జరుగుతున్న సమయంలో తనకు విద్యుత్ షాక్ ఘటన విషయం తెలిసిందన్నారు. ఈ ఘటనలో ముగ్గురు స్నేహితులు దహనమైన విషయం తనను గుండె పిండి చేసిందన్నారు. ఆ ముగ్గురు మరణాలు ఆ కుటుంబాల్ని దిక్కుతోచని స్థితిలో పడేశాయన్నారు. ఈ సమయంలో వారికి ప్రతి ఒక్కరూ ఓదార్పుగా నిలవాలన్నారు. విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన ఇందిరాకాలనీకి చెందిన కామినేని బాలాజీ, దేశబోయిన నజీర్, కాశిరెడ్డి కాలనీకి చెందిన వీరమాచనేని గౌతమ్ కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా బాండ్‌లు అందించినట్లు తెలిపారు. ఆయా నగదు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమౌతాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సత్యన్నారాయణ, ఈఈ హరిబాబు, డీఈ ఉమాకాంత్, ఏఈలు పవన్‌కుమార్, టీడీపీ నాయకులు తమ్మినేని వెంకటరెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు, ఫిరోజ్ పాల్గొన్నారు.



## చికిత్స పొందుతూ యువకుడు మృతి

అద్దంకి, జూలై 31 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు అంకరాజు(28) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. ముండ్లమూరు మండలం పోలవరానికి చెందిన అంకరాజు అద్దంకిలో చెల్లెలు వద్ద వైద్య చికిత్స కోసం ఉన్న తండ్రి వద్దకు వచ్చి సోమవారం రాత్రి అద్దంకి నుంచి పోలవరంనకు మోటార్‌సైకిల్‌పై వెళ్తూ తిమ్మాయపాలెం సమీపంలో ముందు వెళ్తున్న మోపెడ్‌ను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన అంకరాజు అద్దంకి ఆసుపత్రికి, అనంతరం ఒంగోలు వైద్యశాలకు, అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందడంతో అక్కడ నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం వచ్చింది. అంకమ్మరాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## ఒకరికి గాయాలు

బల్లికురవ, జూలై 31 : ద్విచ క్రవాహనం బోల్తా పడి ఒకరికి గాయాలు అయ్యాయి. కొమ్మినేనివారిపాలెం వద్ద బుధవారం వలపర్లకు చెందిన ఆవుల శ్రీను వైదన వెళ్లి వస్తుండగా మోటార్ సైకిల్ అదుపు తప్పి పడిపోయింది. తీవ్రగాయాలైన శ్రీనును వలపర్లలో ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

# పాదర్తి కేజీబీవీలో ఇంటర్ విద్యార్థిని ప్రసవం

**బాత్‌రూమ్‌లో శిశువు మరణం**

**బాలికను రిమ్స్‌కు తరలించిన పోలీసులు**

కొత్తపట్నం(ఒంగోలు నగరం)జూలై 31 : చదువుకుంటున్న బాలిక గర్భం దాల్చి పాఠశాలలోనే ప్రసవించిన ఘటన కొత్తపట్నం మండలం పాదర్తి కేజీబీవీ పాఠశాలలో బుధవారం జరిగింది. ఈ వ్యవహారంపై అధికారులు సీరియస్‌గా స్పందించారు. వెంటనే బాలికను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న 16ఏళ్ల బాలిక క్యాంపస్‌లోని బాత్‌రూమ్‌లోనే ప్రసవించింది. ఆ తర్వాత దాదాపు రెండు మూడు గంటలపాటు అందులోనే ఉండిపోయింది. దీంతో ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు బాత్‌రూమ్‌లోకి తొంగిచూడటంతో ప్రసవించిన విషయం బయటకు తెలిసింది. బాలికను బయటకు రప్పించి విచారించారు. చీమకుర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక జూన్ 19వతేదీన పాదర్తి వద్ద ఉన్న కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరింది. చేరిన తర్వాత వారంరోజుల పాటు హోమ్‌సిక్ పేరుతో ఇంటికి పోయి తిరిగి పాఠశాలకు వచ్చింది. రోజూ తరగతులకు హాజరవుతూనే ఉంది. బుధవారం ఉదయం 11గంటల సమయంలో బాత్‌రూమ్‌లోకి పోయి ప్రసవించిందని కళాశాల ప్రిన్సిపాల్, ఇతర ఉపాధ్యాయులు చెబుతున్నారు. స్థానిక మహిళా పోలీసు ద్వారా విషయం తెలుసుకున్న కొత్తపట్నం ఎస్‌ఐ సాంబశివరావు కేజీబీవీకి వెళ్లి విచారణ జరిపారు. కొత్తపట్నం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వైష్ణవి పాఠశాలకు వెళ్లి బాలికకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర, రిమ్స్ వైద్యశాల సిబ్బంది అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. కాగా బాలిక తొమ్మిది నెలల గర్భవతిగా కళాశాలలోనే రెండు నెలల పాటు చదువు కొనసాగిస్తుండగా ఆ విషయాన్ని పాఠశాల సిబ్బంది ఎందుకు గుర్తించలేకపోయారు అనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రసవానికి ముందు పడే వేదన అంతా ఇంతా కాదు. ఆ సమయంలో కూడా బాలిక నొప్పులు పడుతున్న విషయం కూడా తమకు తెలియదని పాఠశాల సిబ్బంది చెబుతున్నారు. బాలిక బాత్‌రూమ్‌కు పోయి గంటల తరబడి రాకపోయేసరికి వెళ్లిచూడగా అసలు విషయం తెలిసిందని కళాశాల ప్రిన్సిపాల్ అంటున్నారు. అప్పటి వరకు తమకు ఆ బాలిక గర్భవతి అని తెలియదని అంటున్నారు. కాగా బాలికకు జన్మించిన శిశువు మృతి చెందింది. బాధితురాలిని వైద్యం కోసం రిమ్స్‌కు తరలించిన అధికారులు పూర్తి వివరాలు తెలుసుకుంటున్నారు. కాగా బాలిక చీమకుర్తి మండలానికి చెందిన కారణంగా చీమకుర్తి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

# గంజాయి ముఠా గుట్టురట్టు

**ఎనిమిది మంది అరెస్టు**

**40 కిలోల గంజాయి స్వాధీనం**

**వివరాలను వెల్లడించిన ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు**



గంజాయిని పరిశీలిస్తున్న డీఎస్పీ కిషోర్‌బాబు, సీఐ రంగనాథ్, ఎస్సై శ్రీరామ్

సింగరాయకొండ, జూలై 31: గంజాయి విక్రయిస్తున్న ముఠా గుట్టును సింగరాయకొండ పోలీసులు రట్టుచేశారు. ఎనిమిది మందిని అరెస్టు చేశారు. 40కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలను సింగరాయకొండ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. కర్నూలు జిల్లా డోన్ గ్రామానికి చెందిన కోల వినోద్‌కుమార్, నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం రాంపల్లికి చెందిన గోగుల రాజశేఖర్, తమిళనాడు రాష్ట్రంలోని తిరువన్నామలైకు చెందిన అర్జున్ జెమిని సులువుగా డబ్బు సంపాదించుకునేందుకు గంజాయి రవాణా, విక్రయాలను ఎంచుకున్నారు. వీరు ముగ్గురూ విశాఖపట్నంకు చెందిన దినేష్ అనేవ్యక్తి వద్ద గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి చెన్నై, ఒంగోలు, నెల్లూరు ప్రాంతాలకు తీసుకొచ్చి విక్రయిస్తూ లక్షలు గడిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ముగ్గురూ విశాఖలో దినేష్ వద్ద 40కిలోల గంజాయిని కొనుగోలు చేసి ఇక్కడికి తెచ్చారు. అందులో 20 కేజీలు ఒంగోలుకు చెందిన షేక్ అజారుద్దీన్, షేక్ అబ్దుల్ సమీర్‌కు, మరో 20 కేజీలను నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలానికి చెందిన మూరం వంశీ, గోపిరెడ్డి మహేష్, మాచునూరి మదన్‌లకు విక్రయించేందుకు సిద్ధమయ్యారు. ఒంగోలులో పోలీసు తనిఖీలు ముమ్మరంగా జరుగుతుండంతో అజారుద్దీన్, సమీర్‌లకు అక్కడ గంజాయి ఇవ్వకుండా వారిని కూడా కారులో ఎక్కించుకొని ఐదుగురూ బయల్దేరారు. బుధవారం సింగరాయకొండ జాతీయదారి పక్కన ఉన్న పోలేరమ్మ గుడి సమీపంలో నెల్లూరు జిల్లాకు చెందిన వంశీ, మహేష్, మదన్‌లకు 20 కేజీల గంజాయిని అందజేశారు. అప్పటికే అందిన సమాచారం మేరకు సీఐ రంగనాథ్, ఎస్సై శ్రీరామ్‌లు దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేశారని డీఎస్పీ చెప్పారు. వారి వద్ద ఉన్న 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతోపాటు కారును సీజ్ చేసినట్లు ఆయన వెల్లడించారు. గంజాయి ముఠాను పట్టుకున్న సీఐ, ఎస్సైతోపాటు ఏఎస్సై శేషారెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీమన్నారాయణ, తిరుపతిస్వామి, కానిస్టేబుళ్లు విజయ్, శ్రీనివాసరావు, శ్యాంసుందర్, సుమన్, బాలరాజు ఎస్పీ దామోదర్ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

# సమృద్ధిగా సాగర్ జలాలు

● మంచినీటి చెరువులకు చేరుతున్న నీరు


సాగర్ కాలువలో పుష్కలంగా ప్రవహిస్తున్న సాగర్ జలాలు


దర్శి ఎన్ఏపీ చెరువుకు సమృద్ధిగా చేరిన నీరు

దర్శి, జూలై 31 : తాగునీటి అవసరాలకోసం విడుదల చేసిన సాగర్ జలాలు సమృద్ధిగా సరఫరా అవుతున్నాయి. రామతీర్థం జలాశయంతో పాటు జిల్లాలోని మంచినీటి చెరువులకు అధికారులు నీరు నింపుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం చెరువులకు 40 శాతం నీరు చేరింది. రామతీర్థం జలాశయానికి 0.9 టీఎంసీల నీరు చేరినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా దర్శి ఎన్ఏపీ చెరువుకు 1050 మిలియన్ లీటర్ల నీరు పంపింగ్ చేశారు. దర్శి చెరువు పూర్తి సామర్థ్యం 2,540 మిలియన్ లీటర్లు. చెరువులకు గత పది రోజులుగా నీరు నింపుతున్న విషయం తెలిసిందే. మరో రెండు రోజుల పాటు సాగర్ జలాలు సరఫరా అవుతాయని అధికారులు తెలిపారు. ఆ తర్వాత మరో నాలుగు రోజులు కాలువల్లోని నీటిని షట్టర్లు బిగించి నిల్వచేసి మరో నాలుగు రోజులు పంపింగ్ చేసే అవకాశం ఉంది. ఈ దఫా మంచినీటి చెరువులకు 60 శాతం వరకు నీరు నింపుతాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. ఈ ఏడాది సాగుకు సాగర్ జాలాలు విడుదల చేసే అవకాశం ఉండటంతో వచ్చే నెలలో మళ్లీ నీరు విడుదల చేసే అవకాశం ఉంది. ఆ సమయంలో అన్నీ చెరువులకు నిండుగా నీరు నింపుతామని అధికారులు తెలిపారు.

# షుగర్ చిదిమేసింది!

**సకాలంలో గుర్తించకపోవడంతో 12 ఏళ్ల బాలిక మృతి**

**తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు**


కదిరి మోక్ష (ఫైల్)

కొండపి, జూలై 31 : ఆ బాలికకు 12 సంవత్సరాలు. ఆమె చక్కెర వ్యాధి (షుగర్) బారిన పడ్డారు. తల్లిదండ్రులు సకాలంలో గుర్తించకపోవడంతో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన కొండపి మండలంలోని తాటాకులపాలెంలో చోటుచేసుకుంది. బాలిక తల్లిదండ్రులు, బంధువులు సమాచారం మేరకు.. తాటాకులపాలెం గ్రామానికి చెందిన కదిరి శ్రీనివాసరెడ్డి, జ్యోతి దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. శ్రీనివాసరెడ్డి హైదరాబాద్‌లో బేల్దారి పనులు చేసుకుంటూ అక్కడే ఉండి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆయన పెద్ద కుమార్తె కదిరి మోక్ష (12) హైదరాబాద్‌లోనే 8వ తరగతి చదువుతోంది. పదేపదే నీరసం అని మోక్ష అంటుండటంతో ఇటీవల హైదరాబాద్‌లో ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు షుగర్ ఉన్నట్లు గుర్తించలేకపోయారు. నీరసం తగ్గడానికి మాత్రమే మందులిచ్చి పంపారు. అయినప్పటికీ ఆ బాలిక ఆరోగ్యం కుదుటపడకపోడంతో తల్లిదండ్రులు మోక్షను తీసుకుని గత ఆదివారం స్వగ్రామానికి వచ్చారు. సోమవారం మోక్ష మరింత నీరసించడంతో కొండపిలోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. ఆమె పరిస్థితిని గుర్తించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం ఒంగోలు తీసుకెళ్లాలని సూచించారు. దీంతో 108లో మోక్షను ఒంగోలులోని జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ పరీక్షలు చేయగా ఆ చిన్నారికి షుగర్ 700 పాయింట్లు ఉన్నట్లు తేలింది. వెంటనే తల్లితండ్రులు మోక్షను నగరంలోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. మంగళవారం సాయంత్రం షుగర్ అధికమై బ్రెయిన్‌డెడ్ కావడంతో చిన్నారి మోక్ష మరణించింది. దీంతో తల్లితండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# వైసీపీలో భగ్గుమన్న విభేదాలు

- చైర్మన్ గిరిపై వీడని 'పీఠ'ముడి
- ప్రస్తుత చైర్మన్ తీరుకు నిరసనగా సమావేశానికి కౌన్సిలర్ల డుమ్మా



ఖాళీగా ఉన్న చైర్మన్ కుర్చీ

మార్కాపురం, జూలై 31: మున్సిపల్ చైర్మన్ పీఠం బదిలీ వ్యవహారం వైసీపీలో విభేదాలకు కారణమైంది. మున్సిపల్ చైర్మన్ ఒకవైపు కౌన్సిలర్లంతా మరోవైపు అన్నట్లు పరిస్థితి తయారైంది. అవినీతి అక్రమాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న చైర్మన్ వ్యవహార శైలి నచ్చక పోయినా ఇప్పటి వరకు కౌన్సిలర్లు మిన్నకున్నారు. వైసీపీ అధిష్ఠానం కూడా ఈ వ్యవహారాన్ని పట్టించుకోలేదు. గతంలో చేసుకున్న ఒప్పందం మేరకు తాను గద్దె దిగుతానని చైర్మన్ చెబుతూ కాలయాపన చేస్తున్నారు. ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు ఉన్నా చైర్మన్ పీఠం వ్యవహారంపై ఎటూ తేల్చలేకపోవడం కూడా కౌన్సిలర్ల అసహనానికి కారణమైంది. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పొందినప్పటి నుంచి ఆ పార్టీ కౌన్సిలర్లు అయోమయ స్థితిలో ఉన్నారు. ప్రస్తుత చైర్మన్ గత ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే పక్షాన చేరినట్లు తెలుస్తోంది. దీంతో అప్పట్లో కౌన్సిలర్లందరినీ దగ్గరుండి గెలిపించిన మార్కాపురం మాజీ ఎమ్మెల్యే సోదరుడు అగ్గిమీద గుగ్గిలమవుతున్నాడు. ఈ నేపథ్యంలోనే ప్రతి నెల జరిగే మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని వేదికగా చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సోదరుడి ఆదేశాల మేరకు బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి చైర్మన్, 9వ వార్డు కౌన్సిలర్ సిరాజుల్లాబేగ్ మినహా మిగిలిన 27 మంది కౌన్సిలర్లు డుమ్మా కొట్టారు. దీంతో కోరంలేక కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేయాల్సి వచ్చింది.

**పీఠం బదిలీ వ్యవహారంలో విభేదాలకు కారణం**

మార్కాపురం మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని వైసీపీ 2021 లో దక్కించుకుంది. అప్పటి పరిస్థితుల నేపథ్యంలో మొత్తం 35 స్థానాలకుగాను 30 మంది ఆ పార్టీ తరఫున కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. అప్పట్లో చైర్మన్ గిరీ కోసం ప్రధానంగా ఇద్దరు పోటీపడ్డారు. ఒకరు ఆర్యవైశ్య సామాజిక వర్గం నుంచి మరొకరు రెడ్డి సామాజిక వర్గాని కి చెందిన వాళ్లు. ఎన్నికలు ఏకపక్షంగా జరిగినా అప్పట్లో సుమారు రూ.5 కోట్ల మేర ఖర్చయింది. అందులో సింహ భాగం ఖర్చు పెట్టిన రెడ్డి సామాజికవర్గం నాయకురాలికి నచ్చజెప్పి తొలుత ఆర్యవైశ్య సామాజిక వర్గం నాయకునికి చైర్మన్ పీఠం అప్పజెప్పారు. రెండున్నర సంవత్సరాల తర్వాత ఆమెకు అవకాశం కల్పించాల్సి ఉంటుందని అప్పట్లోనే ఒప్పందం చేసుకున్నారు. అంతేకాక ఆమెకు ఇవ్వాల్సిన డబ్బుల విషయం కూడా చాలా స్పష్టంగా ఒప్పందంలో పేర్కొన్నారు. పీఠం ఆమెకు అప్పజెప్పని పక్షంలో సుమారు రూ.2.5 కోట్లు ఇవ్వాలనేది కూడా ఒప్పందంలో ఒక భాగం.

2023లోనే పీఠాన్ని ఆమెకు అప్పజెప్పాల్సివున్నా చైర్మన్ ససేమిరా అన్నాడు. అంతేకాక సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సామాజిక వర్గ ఓట్లకు గండి పడుతుందనే భయంతో అధిష్ఠానం కూడా కాలయాపన చేసింది. ఈ విషయమై ఆమె గట్టిగా నిలదీయడంతో సార్వత్రిక ఎన్నికల అనంతరం పీఠం బదిలీ ఉంటుందని నచ్చజెప్పారు. ఈ క్రమంలో మార్కాపురం అభ్యర్థిని గిద్దలూరుకు, అక్కడి అభ్యర్థిని మార్కాపురం మార్చడం చైర్మన్‌కు కలిసొచ్చింది. వైసీపీ పరాజయం పాలవడంతో ఎన్నికల అనంతరం చైర్మన్ పీఠం ఆశించిన ఆమె తన డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడిని పెంచింది. దీంతో దిగివచ్చిన చైర్మన్ ప్రస్తుతం తాను డబ్బులు ఇవ్వలేనని రాజీనామా చేసి దిగిపోతానని ఆమెకు చెప్పాడు. ఈ విషయంలో వైసీపీకి చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు సక్రమంగా జోక్యం చేసుకోకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటి కొచ్చింది. ప్రస్తుత చైర్మన్‌తోపాటు ఇప్పటివరకు పీఠం ఆశించిన ఆమె కూడా గత ఎన్నికల్లో ఇక్కడ పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యేతో దగ్గరగా ఉండడం ప్రస్తుత గిద్దలూరు వైసీపీ ఇన్‌చార్జ్‌కు నచ్చలేదు. తాను అప్పట్లో అన్నీ దగ్గరుండి వ్యవహారం నడిపితే ఇప్పుడు తనను పట్టించుకోకపోవడాన్ని జీర్ణించుకోలేక పోవడంతోనే కౌన్సిలర్లంతా బుధవారం జరిగిన మున్సిపల్ సమావేశానికి గైర్హాజరు కావాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా చైర్మన్ పీఠం వ్యవహారం వైసీపీలో అన్నిస్థాయి నాయకుల మధ్య విభేదాలకు కారణమైనట్లు తెలుస్తోంది.

## మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా



సభ్యులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 31: మార్కాపురం మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం బుధవారం వాయిదాపడింది. కౌన్సిల్ సమావేశానికి 33వ వార్డుకు చెందిన టీడీపీ కౌన్సిలర్ నాలి కొండయ్య, 9వ వార్డుకు చెందిన వైసీపీ సిరాజుల్లా బేగ్‌లు మాత్రమే హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ తన ఛాంబర్‌కే పరిమితమయ్యారు. వైసీపీకి చెందిన 29 మంది కౌన్సిలర్లు మూకుమ్మడిగా గైర్హాజరు కావడంతో కోరంలేక మున్సిపల్ సమావేశాన్ని అధికారులు వాయిదా వేశారు.

## అవీ..ఇవీ..

## పింఛన్ల పంపిణీని విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూలై 31 : ఇచ్చిన మాట ప్రకారం వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, దివ్యాంగు లకు ఫించన్లను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడికే దక్కుతుందని, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆగస్టు 1న గురువారం ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని కూటమి కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేయాలన్నారు. గురువారం ఉదయం 6 గంటలకు అన్ని గ్రామాలలో ఫించన్ల పంపిణీ ప్రారంభం అవుతుందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలందరూ ఎన్‌టీఆర్ భరోసా ఫించన్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గత వైసీపీ పాలకులు ప్రజలను నయవంచనచేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం ఫించన్లను ఒకే దఫాలో రూ. 1000 రూపాయలు పెంచి 4వేలు అందిస్తున్నారన్నారు. దివ్యాంగులకు రూ.3వేలు పెంచి రూ.6వేలు అందజేస్తున్న ఘనత టీడీపీ కూటమి ప్రభుత్వానిదే అని అన్నారు.

## కందిపైరులో సస్యరక్షణపై రైతులకు అవగాహన



రైతులతో మాట్లాడుతున్న ఏవో స్వరూప

కంభం, జూలై 31 : కందిపైరు సాగు చేసే రైతులు విత్తనశుద్ధి చేయడం వలన ఎండుతెగులు నుండి ఉపశమనం పొందవచ్చని మండల వ్యవసాయాధి కారిణి స్వరూప తెలిపారు. బుధవారం మండలంలోని యర్రబాలెం, లింగాపురం గ్రామాలలో పొలంబడి గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరూప మాట్లాడుతూ కందిలో యాజమాన్య పద్ధతులు తెలిపారు. విత్తనశుద్ధి, విత్తనశాతం పరీక్షల గురించి రైతులకు అవగాహన కల్పించారు. రబీలో చెరువులో నీరు తగ్గి పైర్లు తరచుగా ఎండిపోవడం, దిగుబడి తగ్గడంపై తెలుపుగా ఆ పొలాల్లో మట్టిని సేకరించి ఒంగోలు భూసార పరీక్ష కేంద్రానికి పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు హర్షవర్ధన్, వ్యవసాయ విస్తరణాధికారి పాపారావు, రైతులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించకపోతే కఠినచర్యలు

- విత్తనాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన ఏవో



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏవో

పెద్దారవీడు, జూలై 31: రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలకు సంబంధించి నిబంధనలు తప్పకపాటించాలని ఏవో బుజ్జిబాయ్ హెచ్చరించారు. మండలంలోని కుంటలో ఫెర్టిలైజర్ దుకాణాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాయిరాం ఏజెన్సీ దుకాణంలో రిజిస్టర్ తనిఖీచేశారు. నాణ్యత ప్రమాణాలను పరీక్షించడానికి శాంపుల్స్ సేకరించారు. ఈ సందర్భంగా డీలర్లతో ఏవో బుజ్జిబాయ్ మాట్లాడుతూ అనుమతిలేని కంపెనీల విత్తనాలు, ఎరువులు విక్రయించినట్లుయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. షాపులలో కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో దుకాణాల డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

## వెలగని వీధి దీపాలు

గిద్దలూరు, జూలై 31 : పట్టణ శివార్లలోని పలు ప్రాంతాలలో వీధి దీపాలు సక్రమంగా వెలుగడం లేదు. దాంతో రాత్రి వేళలో చిమ్మచీకటిలో నడువలేక వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. దానికితోడు చిన్నపాటి వర్షం కురిసినా మట్టిరోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. దీంతో వీధిదీపాలులేక బురదలో జారిపడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కొండపేట రైల్వేఅండర్‌పాస్ నుంచి పాములపల్లి వెళ్లే రహదారిలో, జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వెనుక ప్రాంతంలో, కోరేవారివీధి, బ్రిటన్ రోడ్డు తదితర ప్రాంతాలలో తరచూ వీధిలైట్లు వెలుగడం లేదని ఆప్రాంతవాసులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని వీధిలైట్లను వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఆప్రాంతవాసులు కోరుతున్నారు.

## పాఠశాల తనిఖీ

త్రిపురాంతకం, జూలై 31: మండలంలోని మేడపి ప్రాథమిక పాఠశాలను ఎంఈవో కేటీ.మల్లిఖార్జుననాయక్ బుధవారం తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా పాఠశాలలో రిజిస్టర్లు రికార్డులు పరిశీలించి, విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పోస్టల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న పోస్టుమాస్టర్

కొమరోలు, జులై31: కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన పోస్టాఫీసుల్లో తక్కువ ఖర్చుతో పోస్టల్ బీమా పథకాలు ప్రతి ఒక్కరూ తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని పోస్టుమాస్టర్ జేవీ.నారాయణ సూచించారు. కొమరోలు బ్రాంచి పోస్టాఫీస్‌లో మంగళవారం బీమా సదస్సును వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ పోస్టల్ శాఖ ద్వారా రూ.355లకు రూ. 5లక్షలు, రూ.555లకు రూ.10లక్షలు, రూ.755లకు రూ.15లక్షల ప్రమాదబీమా అందిస్తున్నామన్నారు. వీటిని చిరు వ్యాపారులు, కూలీలు, ఎలక్ట్రీషన్లు, డిష్ ఆపరేటర్లు, ఉపాధి కూలీలు, పొదుపు గ్రుపు సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, విద్యుత్ ప్రమాదాలు, వంటి పకృతి ప్రమాదాలు జరిగితే తక్కువ ఖర్చుతో బీమా ఇవ్వాలంటే పోస్టల్‌శాఖకే సాధ్యమన్నారు. పోస్టాఫీస్‌లో బీమానే కాకుండా పొదుపు పథకాల ద్వారా కూడా పేద, మధ్యతరగతి వారికి మంచి లాభాలను తెచ్చి పెడతాయన్నారు. పోస్టాఫీసుల్లో ఖాతాలు తెరిచి నగదు లావాదేవీలు ఆన్‌లైన్ ద్వారా కూడా చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో గోపానిపల్లి, ఇడమకల్లు, బాదినేనిపల్లి పోస్టుమాస్టర్లు వి.కృష్ణారెడ్డి, ఎం.కిరణ్‌కుమార్, షాలిసా, సిబ్బంది పాండురంగస్వామి, తాన్‌షన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## సుబ్బారావు సేవలు అభినందనీయం



డిటీని సన్మానిస్తున్న సిబ్బంది

గిద్దలూరు టౌన్, జూలై 31 : డిప్యూటి తహసీల్దార్‌గా గిద్దలూరు తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న ఏఎంవీవీ.సుబ్బారావు సేవలు అభినందనీయమని బుధవారం పదవీ విరమణ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయం నందు రెవిన్యూ అధికారులు సన్మాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ షేక్ ముస్తాక్, రీసర్వే డిప్యూటి తహసీల్దార్ జె.వెంకటయ్య, ఎలక్షన్ సీనియర్ సహాయకులు జి.భాస్కర్, వీఆర్‌వోల సంఘం జిల్లా అధ్యక్షులు వై.పి.రంగయ్యయాదవ్, మండలాధ్యక్షులు సూరా ఈశ్వర్‌రెడ్డి, అచ్చయ్య, వీరనారాయణ, బొర్రా వెంకటేశ్వర్లు, పప్పుల కొండయ్య, స్వర్ణ, పద్మ, విఆర్ఎల జిల్లా అధ్యక్షులు ఓ.అంజి, శ్రీను, అల్లూరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇరువురికి రక్తదానం

గిద్దలూరు, జూలై 31 : అత్యవసర పరిస్థితిలో ఉన్న ఇరువురికి పట్టణానికి చెందిన నంద్యాల పూర్ణారెడ్డి, గిరిప్రసాద్‌లు రక్తదానం చేసి ఆదుకున్నట్లు మేమున్నాము సేవాసమితి అధ్యక్షులు చల్లా అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి, మరో మహిళకు రక్తం అవసరం కావడంతో ఈ ఇరువురు దాతలు రక్తదానం చేశారు. గిరిప్రసాద్ ఇప్పటివరకు 21 పర్యాయాలు రక్తదానం చేయడంతో ఆయనను అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో గిరిజన యువకుడు మృతి

- బైకును లారీ ఢీకొనడంతో ఘటన

పెద్ద దోర్నాల, జూలై 31: రోడ్డు ప్రమాదంలో గిరిజన యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని గంటవానిపల్లె చెరువు వద్ద బుధవారం చోటుచేసుకొంది. ఈ ఘటకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బంధంబావిగూడేనికి చెందిన కుడుముల రాజుకొండయ్య బైకుపై స్వగ్రామం నుంచి దోర్నాల వస్తున్నాడు. కర్నూలు వైపు వెళుతున్న లారీ అదుపుతప్పి బైకును ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని 108 దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతిచెందాడు. ఎస్సై అంకమ్మరావు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించి, కేసున మోదు చేశారు.

## దొంగతనం కేసులో ఇద్దరు యువకులు అరెస్ట్

మార్కాపురం, జూలై 31: స్థానిక గడియార స్తంభం కూడలి సమీపంలోని పూల దుకాణంలో జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు యువకులను మార్కాపురం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.35,480ల నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ కథనం మేరకు పట్టణానికి చెందిన షేక్ ఖాజావలికి గడియారస్తంభం కూడలి వద్ద పూలదుకాణం ఉంది. జూలై 25న రాత్రి షెట్టర్ తాళాలు పగులకొట్టి దుకాణంలో ఉన్న రూ.లక్ష నగదును దొంగిలించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలించారు. ఈ క్రమంలో సమీపంలోని సీసీ కెమెరాల్లో నమోదైన రికార్డులను పరిశీలించి నిందితులను గుర్తించారు. స్థానిక భగత్‌సింగ్ కాలనీ సమీపంలో అనుమానస్పదంగా తిరుగుతున్న జగదీశ్వరి థియేటర్ ప్రాంతానికి చెందిన షేక్ ఇనాయక్ అలి, రాజ్యలక్ష్మి కాలనీకి చెందిన జెల్లి సాయికుమార్‌లను స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. తామే దొంగతనం చేసినట్లు నిందితులిద్దరూ ఒప్పుకోవడంతో వారి వద్దవున్న నగదును స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి బుధవారం కోర్టులో హాజరుపర్చారు. న్యాయాధికారి వారికి రిమాండ్ విధించారు.

## సబ్ జైలులో న్యాయాధికారి తనిఖీ



మాట్లాడుతున్న న్యాయాధికారి మేరీసారాదానమ్మ

గిద్దలూరు టౌన్, జూలై 31 : పట్టణంలోని సబ్ జైలును బుధవారం గిద్దలూరు అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.మేరీసారాదానమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌జైలులోని ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, భోజన, మెడికల్ వసతులు, మంచినీటి సౌకర్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఖైదీలపై ఉన్న కేసుల వివరాలను పరిశీలించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సెషన్స్ కేసుల్లో విచారణ జరుగుతున్న కేసులకు సంబంధించి బెయిల్‌కు అర్జీలు పెట్టుకోవాల్సిందిగా ఆమె సూచించారు. అనంతరం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన తప్పిదాలే నేరాలకు దారితీస్తామయన్నారు. సమస్యలు ఉంటే ప్రశాంతంగా ఆలోచించి నిర్ణయా లు తీసుకోవాలన్నారు. ఉద్రేకంలో ఆలోచన లేకుండా నిర్ణయాలు తీసుకోకూడ దన్నారు. కార్యక్రమంలో సబ్‌జైలు వార్డెన్ పి.రవీంద్రనాథ్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కె.ప్రకాశ్‌బాబు, పారాలీగల్ వలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

## పలు దుకాణాల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ



తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ సిబ్బంది

మార్కాపురం వన్‌టౌన్, జూలై 31: పట్టణంలోని పలు దుకాణాల్లో ఫుడ్‌సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నరసింహులు మాట్లాడుతూ ప్రధాన వీధిలోని ఫ్యాన్సీ స్టోర్‌ను తనిఖీ చేయగా దానికి లైసెన్స్ లేదని నోటీసులు జారీ చేశామన్నారు. నెహ్రూబజార్‌లోని ఒక మెస్‌పై వచ్చిన ఆరోపణలపై కూడా విచారించి శాంపిల్స్ సేకరించామన్నారు. రాజాజీ వీధిలోని ఒక ఫ్యాన్సీ స్టోర్‌లో కూడా శాంపిల్స్ తీశామన్నారు. కాల పరిమితి ముగిసిన వస్తువులు అమ్మినా, దుకాణాలకు లైసెన్స్‌లు లేకపోయినా, ఎంఆర్‌పీ కంటే అధికంగా అమ్మినా తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## షిఫ్ట్ ఆపరేటర్లే బాధ్యులు

- స్తంభాల చోరీపై వివరాలు వెల్లడించిన డీఈ
- నలుగురు ఆపరేటర్లను తొలగిస్తూ ఉత్తర్వులు

ఎర్రగొండపాలెం, జూలై 31: మండలంలోని అమానిగుడిపాడు విద్యుత్తు ఉపకేంద్రంలో పాతవిద్యుత్తు స్తంభాల చోరి సిఫ్ట ఆపరేటర్ల పర్యవేక్షణలో జరిగిందని , నలుగురు సిఫ్ట ఆపరేటర్లను విధులనుంచి తొలగించినట్లు మార్కాపురం ఏపీసీపీడీసీఎల్ ఆపరేషన్ డీఈ నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. ఉపకేంద్రంలో బుధవారం పరిశీలించగా 105 పాతవిద్యుత్తు స్తంభాలు కంట్రాక్టరు షిఫ్ట్ ఆపరేటర్లకు అప్పగించారని తెలిపారు. స్తంభాలు బయటకు వెళ్లడానికి షిఫ్ట్ ఆపరేటర్లే సహకరించినట్లు సమాచారం ఉందన్నారు. ధర్యాప్తు పూర్తి అయ్యే వరకు నలుగురు షిఫ్ట్ ఆపరేటర్లను విధుల నుంచి తొలగిరచామని తెలిపారు. లైన్ ఇన్‌స్పెక్టర్ సంజాయిషీ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. 105 స్తంబాలు విలువ డిపార్టుమెంటుకు చెల్లించాలని నోటీసు సర్వు చేస్తామని తెలిపారు. ఒక్కొక్క స్తంభం విలువ రూ.1000 ఉంటుందన్నారు. స్తంబాలచోరీ విషయం ధర్యాప్తు అధికారిగా మార్కాపురం ఏడీఈ సియనాయక్‌ను నియమించినట్లు తెలిపారు.

## గుండెపోటుతో ఏఆర్ కానిస్టేబుల్ మృతి



రవి (ఫైల్)

గిద్దలూరు టౌన్, జూలై 31 : గుండెపోటుతో ఏఆర్ కానిస్టేబుల్ మృతిచెందాడు. రాచర్ల మండలం అనంపల్లె గ్రామానికి చెందిన శిరిగిరి రవి (37) ఏఆర్ కానిస్టేబుల్‌గా 15 సంవత్సరాల నుంచి పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి ఒంగోలులో విధి నిర్వహణలో రవి గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రవి మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. రవికి భార్య ఇరువురు కుమార్తెలు ఉన్నారు. బుధవారం సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించగా పోలీసుశాఖ అధికాంరులు, సిబ్బంది రవికి వీడ్కోలు పలికారు. రవి మృతితో అనంపల్లెలో విషాధచాయలు అలుముకున్నాయి.

# విద్యార్థులను చైతన్యవంతులుగా తీర్చిదిద్దాలి

**విశ్రాంత ఉపాధ్యాయుడు రాంభూపాల్‌రెడ్డి**



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న రాంభూపాల్‌రెడ్డి

కొమరోలు, జులై31: ప్రభుత్వ పాఠశాలల్లోని పేదవిద్యార్థుల్లో చైతన్యం నింపేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషిచేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో విశిష్ట వ్యక్తిగా ప్రసంసలందుకున్న విశాంత ఉపాధ్యాయులు రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాజుపాలెం-ద్వారకచర్ల మార్గంలోని కస్తురిబాగాంధీ విద్యాలయంలో గత సంవత్సరం చదివిన పదవ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితియ సంవత్సరంల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను మంగళవారం రాంభూపాల్‌రెడ్డి అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలల్లో విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసి వారిలోని నైపుణ్యాలను గుర్తించినప్పుడే ఉపాధ్యాయులు విజయాన్ని సాధించినవారవుతారన్నారు. జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో మంచి మార్కులు సాధించిన తొలి ఇద్దరికి ప్రశంసాపత్రం, జ్ఞాపికలు అందిస్తున్నామన్నారు. అందులో భాగంగానే రాజుపాలెం కస్తురిబాగాంధీ విద్యాలయానికి వచ్చామన్నారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన కార్పొరేట్ విద్యను ఇక్కడ అందిస్తుదని వీటిని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ మందా రోజ్‌సులోచన మాట్లాడుతూ రాచర్ల మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన మార్కాపురం వెంటకరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడైన రాంభూపాల్‌రెడ్డి విద్యార్థుకు చేస్తున్న కార్యాక్రమాలు అభినందనీయమన్నారు. వారి అడుగుజాడలో ప్రతి విద్యార్థి పయనించాలన్నారు. కార్యాక్రమంలో ఎంఈవో కావడి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో విద్యార్థిని ప్రసవం

- బాత్‌రూంలో శిశువు మరణం
- బాలికను రిమ్స్‌కు తరలించిన పోలీసులు

కొత్తపట్నం(ఒంగోలు నగరం)జూలై 31 : చదువుకుంటున్న బాలిక గర్భం దాల్చి పాఠశాలలోనే ప్రసవమైన ఘటన కొత్తపట్నం మండలం పాదర్తి కేజీబీవీ పాఠశాలలో బుధవారం చోటుచేసుకొంది. ఈ వ్యవహారంపై అధికారులు సీరియస్‌గా స్పందించారు. బాలికను వెంటనే ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న 16ఏళ్ల బాలిక క్యాంపస్‌లోని బాత్‌రూమ్‌లోనే ప్రసవించింది. ఆ తర్వాత దాదాపు రెండు మూడు గంటలపాటు అందులోనే ఉండిపోయింది. దీంతో ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు బాత్‌రూమ్‌లోకి తొంగి చూడటంతో ప్రసవించిన విషయం బయటకు తెలిసింది. బాలికను బయటకు రప్పించి విచారించారు. చీమకుర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక జూన్ 19వ తేదీన పాదర్తి వద్ద ఉన్న కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరింది. చేరిన తర్వాత వారంరోజుల పాటు హోమ్‌సిక్ పేరుతో ఇంటికి పోయి తిరిగి పాఠశాలకు వచ్చింది. రోజూ తరగతులకు హాజరవుతూనే ఉంది. బుధవారం ఉదయం 11గంటల సమయంలో బాత్‌రూమ్‌లోకి పోయి ప్రసవించిందని కళాశాల ప్రిన్సిపాల్, ఇతర ఉపాధ్యాయులు చెబుతున్నారు. స్థానిక మహిళా పోలీసు ద్వారా విషయం తెలుసుకున్న కొత్తపట్నం ఎస్‌ఐ సాంబశివరావు కేజీబీవీకి వెళ్లి విచారణ జరిపారు. కొత్తపట్నం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వైష్ణవి పాఠశాలకు వెళ్లి బాలికకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర, రిమ్స్ వైద్యశాల సిబ్బంది అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. కాగా బాలిక తొమ్మిది నెలల గర్భవతిగా కళాశాలలోనే రెండు నెలల పాటు చదువు కొనసాగిస్తుండగా ఆ విషయాన్ని పాఠశాల సిబ్బంది ఎందుకు గుర్తించలేక పోయారు అనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రసవానికి ముందు ఎడే వేదన అంతా ఇంతా కాదు. ఆ సమయంలో కూడా బాలిక నొప్పులు పడుతున్న విషయం కూడా తమకు తెలియదని పాఠశాల సిబ్బంది చెబుతున్నారు. బాలిక బాత్‌రూమ్‌కు పోయి గంటల తరబడి రాకపోయేసరికి వెళ్లిచూడగా అసలు విషయం తెలిసిందని కళాశాల ప్రిన్సిపాల్ అంటున్నారు. అప్పటి వరకు తమకు ఆ బాలిక గర్భవతి అని తెలియదని అంటున్నారు. కాగా బాలికను వైద్యం కోసం రిమ్స్ వైద్యశాలకు తరలించిన అధికారులు పూర్తి వివరాలు తెలుసుకుంటున్నారు. బాలిక చీమ కుర్తి మండలానికి చెందడంతో చీమకుర్తి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

## మైనార్టీలలో మంచి నాయకున్ని కోల్పోయాం

**టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు**



నివాళి అర్పిస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జూలై 31 : టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎండీ యూసఫ్ మృతి తీరని లోటని, మంచి సీనియర్ నాయకున్ని కోల్పోయామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. బుధవారం యూసఫ్ ఇంటికి వెళ్లి పార్థీవ దేహం వద్ద నివాళి అర్పించి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, చిట్యాల వెంగళరెడ్డి, వేగినాటి శ్రీను, తోటమహేష్, మంత్రునాయక్, చేదూరి కిశోర్, షేక్ రఫీకొత్త భాస్కర్ ఉన్నారు.

**సంతాపం తెలిపిన టీడీపీ నాయకులు**

జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు డాక్టరు మన్నె రవీంద్ర, ఏఎంసీ మాజీ చైర్మన్ చేకూరి ఆంజనేయులు, రాష్ట్ర మైనార్టీసెల్ కార్యదర్శి షేక్ జిలానీ, మండల టీడీపీ మాజీ అధ్యక్షులు వడ్లమూడి లింగయ్య, టీడీపీ కార్యకర్తలు యూసఫ్ పార్థీవ దేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించి, సంతాపం తెలిపారు.

## పాఠశాలలో ఎంఈవో తనిఖీ



మొక్కనాటుతున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

మార్కాపురం రూరల్, జులై 31: మండలంలోని బోడపాడు గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవోలు రాందాస్ నాయక్, వెంకటేశ్వర్లు బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో ఆవరణను విద్యార్థులు ఉపయోగిస్తున్న మరుగుదొడ్లు, తాగునీరు, పరిసరాలను పరిశీలించారు. అలాగే తరగతి గదులలోని పాఠశాల రికార్డులను, విద్యార్థులకు బోధిస్తున్న తీరును పరిశీలించారు. తరగతి గదులలో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధిస్తున్న తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కను నాటారు. పాఠశాలలో విద్యార్థుల కోసం దాతల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న ఉపాధ్యాయులు పి.శ్రీనివాసులను అభినందించారు. మధ్యాహ్నం విద్యార్థులకు పాఠశాలలో వడ్డిస్తున్న భోజనం రుచిచూసి వంట నిర్వాహకులకు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీలో ఎంఈవోలతో పాటు సీఆర్‌పీ శివశంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సురేఖ, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, విజయలక్ష్మీ ఉన్నారు.

# మంత్రి లోకేష్ ఓఎస్‌డీగా మార్కాపురం వాసి

**రైతు కుటుంబం నుంచి ఉన్నత శిఖరాలకు వెంకటరమణ ప్రస్థానం**



వెంకట రమణ

మార్కాపురం, జూలై 31: రాష్ట్ర మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేష్ ఓఎస్‌డీగా మార్కాపురం పట్టణానికి చెందిన ఆకుల వెంకటరమణ నియమితులయ్యారు. ఈయన గతంలో తూర్పు గోదావరి జిల్లా చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేశారు. అక్కడ గిరిజనులతో మమేకమై వారికి ప్రభుత్వ పథకాలను అందించడంలో, జీవన ప్రమాణాలను మెంపొందించడంలో సఫలీకృతులయ్యారు. అక్కడ నుంచి కడప జిల్లా బద్వేలు ఆర్డీవోగా బదిలీ అయ్యారు. అక్కడకూడా సమర్థవంతమైన అధికారిగా ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందారు. ప్రస్తుతం వెంకటరమణ అత్యంత కీలకమైన మానవ వనరులశాఖలో మంత్రి నారా లోకేష్ ఓఎస్‌డీగా నియమితులు కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**గ్రూప్-1 ఫలితాల్లో ప్రథమ స్థానం**

మార్కాపురం పట్టణానికి చెందిన ఆకుల శ్రీరాములు, లక్ష్మీనరసమ్మల కుమారుడు వెంకటరమణ. సాధారణ రైతు కుటుంబంలో పుట్టాడు. ప్రభుత్వ కొలువు సాధించాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాడు. ఆ దిశగా శ్రమించి అనుకున్న లక్ష్యాన్ని సాధించాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2012లో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలు రాశారు. కానీ ఆ నోటిఫికేషన్‌కు సంబంధించి ఫలితాలు మాత్రం 2016లో విడుదలయ్యాయి. వెంకటరమణ కృషి, పట్టుదల, శ్రమలకు ప్రతిఫలంగా అప్పట్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారు. అంతేకాక అత్యంత వెనుకబడిన మార్కాపురం ప్రాంతంలోని విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఆయన తల్లి దండ్రుల పేరున సొంతంగా గ్రంథాలయాన్ని నడుపుతున్నాడు. తనలాగా ఎవరూ ఇబ్బందులు పడకూడదని ఈ నిర్ణయం తీసుకున్నారు. వందలాది మంది పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ఆ గ్రంథాలయాన్ని ఉపయోగించు కుంటున్నారు. అంతేకాక మార్కాపురం వచ్చిన ప్రతిసారీ గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి వారిలో స్ఫూర్తిని నింపుతున్నారు. మోటివేషనల్ తరగతులు కూడా తీసుకుంటున్నారు. పేద విద్యార్థులెవరైనా ఉంటే వారికి ఉచితంగా స్టడీ మెటీరియల్ కూడా అందిస్తున్నాడు. తద్వారా ఈ ప్రాంతం పట్ల ఆయనకున్న అభిమానాన్ని చాటుకుంటున్నాడు.



100 రోజుల యాక్షన్ ప్లాన్ ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న సీడీపీవో సరోజినీదేవి

# అంగన్వాడీ కేంద్రాలు సమయపాలన పాటించాలి

● ఐసీడీఎస్ సీడీపీవో సరోజినిదేవి

కనిగిరి, జూలై 31: అంగన్వాడీ కేంద్రాలు ఉదయం 9గంటలకే తెరవాలని, సమయ పాలన పాటించాలని ఐసీడీఎస్ సీడీపీవో సరోజినీదేవి అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం గురవాజీపేట, వగ్గంపల్లి సెక్టార్ సమావేశం సూపర్వైజర్ ఎంవీఎస్ పార్వతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ సమయపాలన పాటించని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ఉదయం 9గంటలకే కేంద్రాలను తెరచి సాయంత్ర 4గంటల వరకు నిర్వహించాలన్నారు. ప్రీస్కూల్‌ను సక్రమంగా నిర్వహించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు టీహెచ్ఆర్ ఫేస్ యాప్ ద్వారా గుడ్లు, పాలు, కిడ్స్, బియ్యం, కందిపప్పు, నూనె, బాలామృతం అందజేయాలన్నారు. వాటిని వెంటనే యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి కార్యకర్త తమ కేంద్రానికి సంబంధించిన నెల వారీ నివేదిక అందజేయాలన్నారు. అనంతరం ప్రభుత్వం అమలు చేయనున్న 100 రోజుల నిర్వహణ ప్లాన్ గురించి అంగన్వాడీ కార్యకర్తలకు, ఆయాలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



టీడీపీ పట్టణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న పువ్వాడి

## కష్టించి పనిచేసిన వారికే గుర్తింపు

పామూరు, జూలై 31 : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయానికి కష్టపడి పని చేసిన వారికే తగిన గుర్తింపు ఉంటుందని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో అడుసుమల్లి ప్రభాకర్ అధ్యక్షతన బుధవారం పట్టణ టీడీపీ శ్రేణులతో ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశాలతో సమావేశం నిర్వహించారు. కష్టించి పనిచేసిన నాయకులకు కార్యకర్తలకు నామినెట్ పోస్టులు మంజూరు చేస్తారని తెలిపారు. ముఖ్యంగా రేషన్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు , మద్యం షాపుల్లోని సూపర్‌వైజర్, సేల్‌మ్యాన్‌లకు సంబంధించిన వివిధ సామాజిక వర్గాల వారిగా ముఖ్యుల పేర్లను సేకరించి నమోదు చేశారు. నాయకులు, కార్యకర్తలు సూచించిన పేర్లను ఎమ్మెల్యే ఉగ్ర దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా, ఫోర్‌మెన్ కమిటీ సభ్యులు ఉప్పలపాటి హరిబాబు, షేక్ గౌస్‌బాష, ఇర్రి కోటిరెడ్డి, పందిటి హరీష్, ఆర్ఆర్ రఫి, ఎన్. సాంబయ్య, పత్తు మస్తాన్, పిడుగు శ్రీను, చిన హజరత్, మెంటా నరసింహారావు, ఎన్. నాగేంద్రచారి, పాలపర్తి రమణయ్య షేక్ నాయబ్ రసూల్, బీజేపీ నాయకులు కేవీ రమణయ్య, చిన సుబ్బయ్య, జనసేన నాయకులు వై. రహీముల్లా, షేక్ సందాని బాష రమాదేవి, పాల్గొన్నారు.

## 8న పాఠశాల కమిటీ ఎన్నికలు

సీఎస్‌పురం(పామూరు) జూలై 31 : పాఠశాల యాజమాన్య కమిటీలకు ఈ నెల 8న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో రాజాల కొండారెడ్డి తెలిపారు. ఎన్నికలకు సంబంధించి 1న నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసామని ఓటరు జాబితాను కూడా గురువారం పాఠశాలల నోటీసుబోర్డులో ప్రచురితం చేస్తామన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీలు రెండేళ్లు ఉంటాయని, గతంలో ఉన్న ఎన్నికల కమిటీల గడువు ముగిసినందున నూతన పాఠశాల యాజమాన్య కమిటీలను ఏర్పాట్లు చేస్తున్నామని ఎంఈవో తెలిపారు.



# విద్యుత్ బాధిత కుటుంబాలకు అండ

ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

ఒక్కొక్కరికి రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందజేత



మృతుడు కామినేని బాలాజి, దేశబోయిన నజీర్,వీరమాచనేని గౌతమ్ తల్లిదండ్రులకు బాండ్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర, విద్యుత్ అధికారులు

కనిగిరి, జూలై 31: విద్యుత్ ప్రమాదంలో మరిణించిన వారిని తెచ్చివ్వలేను కానీ మీ కుటుంబ సభ్యుడిగా అండగా ఉంటానని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. గతనెల 23న మండలంలోని పునుగోడు గ్రామంలో విద్యుత్ హైటెన్షన్ వైరు తగిలి ముగ్గురు యువకులు సజీవ దహనమైన విషయం విదితమే. మృతి చెందిన యువకుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా నగదు బాండ్‌ను బుధవారం వారి నివాసాలకు ఎమ్మెల్యే విద్యుత్ అధికారులతో కలసి స్వయంగా వెళ్ళి అందజేశారు. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువకులు విద్యుత్ ప్రమాదంలో మరణించిన విషయం తననెంతో కలచి వేసిందన్నారు. పరిహారం నగదు బాండు వచ్చిన తర్వాతే మిమ్మల్ని కలవాలని అనుకున్నానని, బాధిత కుటుంబ సభ్యులతో అన్నారు. మీరు ధైర్యంగా ఉండాలని, మీకు అండగా ఉంటానని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర వారిని ఓదార్చారు. అనంతరం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రమాదం జరిగిన విషయం తెలిసి తాను విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకుపోయి ఆయన ద్వారా సీఎం దృష్టికి తీసుకవెళ్లానని చెప్పారు. దీంతో సీఎం వెంటనే ప్రమాదంలో మరణించిన కుటుంబానికి రూ. 5లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు తెలిపారు. అసెంబ్లీ జరుగుతున్న సమయంలో తనకు విద్యుత్ షాక్ ఘటన విషయం తెలిసిందన్నారు. ఈ ఘటనలో ముగ్గురు స్నేహితులు దహనమైన విషయం తనను గుండె పిండి చేసిందన్నారు. ఆ సమయంలో వారి ప్రాణాలు ఎంత విలవిలలాడాయో ఆ బాధ చెప్పేది కాదన్నారు. ఆ ముగ్గురు మరణాలు ఆ కుటుంబాల్ని దిక్కుతోచని స్థితిలో పడేశాయన్నారు. ఈ సమయంలో వారికి ప్రతి ఒక్కరూ ఓదార్పుగా నిలవాలన్నారు. విద్యుత్ ప్రమాదంలో మృతి చెం దిన ఇందిరాకాలనీకి చెం దిన కామినేని బాలాజి, దేశబోయిన నజీర్, కాశిరెడ్డి కాలనీకి చెందిన వీరమాచనేని గౌతమ్ కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా బాండ్‌లు అందించినట్లు తెలిపారు. ఆయా నగదు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమౌతాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యన్నారాయణ, ఈఈ హరిబాబు, డీఈ ఉమాకాంత్, ఏఈలు పవన్‌కుమార్, టీడీపీ నాయకులు తమ్మినేని వెంకటరెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు, ఫిరోజ్ పాల్గొన్నారు.

# సమృద్ధిగా సాగర్ జలాలు

మంచినీటి చెరువులకు చేరుతున్న నీరు



సాగర్ కాలువలో పుష్కలంగా ప్రవహిస్తున్న సాగర్ జలాలు



దర్శి ఎన్ఏపీ చెరువుకు సమృద్ధిగా చేరిన నీరు

దర్శి, జూలై 31 : తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన సాగర్ జలాలు సమృద్ధిగా సరఫరా అవుతున్నాయి. రామతీర్థం జలాశయంతో పాటు జిల్లాలోని మంచినీటి చెరువులకు అధికారులు నీరు నింపుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం చెరువులకు 40 శాతం నీరు చేరింది. రామతీర్థం జలాశయానికి 0.9 టీఎంసీల నీరు చేరినట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా దర్శి ఎన్ఏపీ చెరువుకు 1050 మిలియన్ లీటర్ల నీరు పంపింగ్ చేశారు. దర్శి చెరువు పూర్తి సామర్థ్యం 2,540 మిలియన్ లీటర్లు. చెరువులకు గత పది రోజులుగా నీరు నింపుతున్న విషయం తెలిసిందే. మరో రెండు రోజుల పాటు సాగర్ జలాలు సరఫరా అవుతాయని అధికారులు తెలిపారు. ఆ తర్వాత మరో నాలుగు రోజులు కాలువల్లోని నీటిని షట్టర్లు బిగించి నిల్వచేసి మరో నాలుగు రోజులు పంపింగ్ చేసే అవకాశం ఉంది. ఈ దఫా మంచినీటి చెరువులకు 60 శాతం వరకు నీరు నింపుతాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. ఈ ఏడాది సాగుకు సాగర్ జాలాలు విడుదల చేసే అవకాశం ఉండటంతో వచ్చే నెలలో మళ్లీ నీరు విడుదల చేసే అవకాశం ఉంది. ఆ సమయంలో అన్నీ చెరువులకు నిండుగా నీరు నింపుతామని అధికారులు తెలిపారు.

## డ్రగ్స్‌ను పూర్తిగా నిషేధించాలి

దర్శి, జూలై 31 : గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా సరఫరా అయిన డ్రగ్స్‌ను పూర్తిగా నివారించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి. రామన్న కోరారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలికలపై దాడులు అధికమయ్యామన్నారు. యువత మత్తుకు అలవాటు పడి అకృత్యాలకు పాల్పడుతున్నదని చెప్పారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మహిళపై దాడులు అరికట్టేందుకు, డ్రగ్స్ నిషేధానికి పటిష్ట చర్యలు తీసకోవాలని సూచించారు. యువతకు ఉద్యోగ అవకాశాలు లేక ఖాళీగా ఉండటంతో చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దొనకొండలో కారిడార్ అభివృద్ధి చేసి ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై. రాము, రైతు సంఘం నాయకుడు సందు వెంకటేశ్వర రావు, డీవైఎఫ్ఐ నాయకుడు కె. వెంకటరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న



రైల్వేలైన్ రహదారిని పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

## రహదారిని పరిశీలించిన జేసీ

దర్శి, జూలై 31 : దర్శి - అద్దంకి రోడ్డులోని రైల్వే లైన్ కిందిగా వెళ్లే రహదారిని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. రహదారిని వెడల్పు తక్కువగా నిర్మించినందువల్ల ధాన్యం తరలించే వాహనాలు వెళ్లే వీలు లేకుండా రైతులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు కొద్ది రోజుల కిందట కలెక్టర్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆ రహదారిని జేసీ పరిశీలించరు. రైతులతో మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కనిగిరి ఆర్డీవో జాన్ఇర్విన్, ఇన్‌చార్జి తహసీల్దార్ ఏ రవిశంకరర్ పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

## పాఠశాలలో మొక్కలు పంపిణీ

కురిచేడు, జూలై 31: కురిచేడు మండలం బోదనంపాడు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు టీడీపీ దర్శి నియోజక వర్గ నాయకులు, జిల్లా లీగల్ సెల్ మాజీ అధ్యక్షులు పరిటాల సురేష్ మొక్కలు పంపిణీ చేశారు. మొక్కల నాటడం, వాటి ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాపారావు మాట్లాడుతూ చెట్లు ప్రగతికి మెట్లు అన్నారు. చెట్ల పెంపకం వలన కాలుష్య నివారణ జరుగుతుందన్నారు. వర్షాలు సకాలంలో కురవాలంటే మొక్కలు విరివిగా పెంచాలని సూచించారు. విద్యార్థులకు ఇచ్చిన మొక్కలను నాటి జాగ్రత్తగా పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శీలా వాణి, సత్యవతి, వసంత, రెడ్డి మొదలగు వారు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

40 సవర్ల బంగారం, రూ. 35 వేలు నగదు అపహరణ

పామూరు, జూలై 31 : ఇంట్లో ఎవరు లేని సమయంలో పట్టపగలే దొంగలు తెగబడి 40 సవర్ల బంగారం, రూ. 35 వేలు నగదును దోచుకొని వెళ్లిన సంఘటన బుధవారం పామూరు పట్టణంలో జరిగింది. పట్టణంలోని విరువూరు రోడ్‌లోని ముండ్లపాటి ప్రేమ్‌కుమార్ ఇంటి బయట డోరుకు తాళం వేసి ఉదయం 10:30 నిమిషాల సమయంలో బయటకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరన్న విషయాన్ని పసిగట్టిన దుండగులు ఇంటి మెయిన్ డోరు తాళాన్ని పగులకొట్టి ఇంట్లోకి జొర పడ్డారు. బీరువాకు తాళం లేక పోవడంతో బీరువాలోని 40 సవర్ల బంగారం రూ. 35 వేల నగదును అపహరించుకు పోయారని బాధితుడు ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఒంగోలు నుంచి క్లూస్ టీం ఎస్ఐ శరత్‌బాబు బృందం చోరీ జరిగిన ఇంటికి చేరుకొని వేలి ముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం. సైదుబాబు, తెలిపారు.

## వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం

ముండ్లమూరు, జూలై 31 : మండలంలోని పెద ఉల్లగల్లులో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి 16వ వార్షికోత్సవం జరిగి 16 రోజులు కావటంతో భక్తులు బుధవారం అత్యంత వైభవంగా 16 రోజుల పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూజారి నరసింహమూర్తి, భక్తులు పాల్గొన్నారు.



డీఎస్పీ లక్ష్మీనారాయణ

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి

ముండ్లమూరు, జూలై 31 : మండలంలోని శంకరాపురం గ్రామంలో ఇటీవల గొడవ పడి కేసులు పెట్టుకొని జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చిన వారితో పాటు ఇరు వర్గాలను దర్శి డీఎస్పీ జీ అశోక్ వర్ధన్‌రెడ్డి బుధవారం స్థానిక స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ వారితో మాట్లాడుతూ అనవసరంగా గొడవలకు పాల్పడి శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దన్నారు. గొడవలకు దూరంగా ఉండి అందరూ కలసి మెలసి జీవించాలన్నారు. గ్రామంలో ప్రశాంతమైన వాతావరణానికి భంగం కలిగించే వ్యక్తులను గుర్తించి వారిపై రోజూ నిఘా పెడతామన్నారు. అవసరమైతే ఇరు వర్గాలపై రౌడీ షీట్లు కూడా ఓపెన్ చేయటం జరుగుతుందన్నారు. సీఐ షేక్ షమీముల్లా, ముండ్లమూరు, తాళ్ళూరు ఎస్ఐలు వీ నాగమల్లేశ్వరరావు, విజయ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.



డీఎస్పీ లక్ష్మీనారాయణ

## పింఛన్లకు రూ, 3,50,78,000 మంజూరు

పామూరు, జూలై 31 : మండలంలో 8,191 వివిధ సామాజిక పింఛన్లకు గాను రూ.3,50,78,000 లు విడుదల అయినట్లు ఎంపీడీవో పి. పుట్టారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 1న ఉదయం 6 గంటల నుంచి లబ్ధిదారుని ఇంటి వద్దనే పంపిణీ చేస్తామని తెలిపారు.



బైపాస్ జంక్షన్ వద్ద తీసిన పెద్ద గుంత

# గుంత తీశారు.. వదిలేశారు..

● పొంచిఉన్న పెను ప్రమాదం

● వాహనదారుల భయాందోళన

పామూరు, జూలై 31 : పామూరు తూర్పు బైపాస్ జాతీయ రహదారికి ఆనుకొని సుమారు 10 అడుగుల గొయ్యి తీసి ఉండటంతో వాహనదారులకు పెను ప్రమాదం పొంచిఉన్నది. పట్టణంలోని 30 పడకల వైద్యశాల జాతీయ రహదారి కూడలి వద్ద రోడ్డుకు సుమారుగా 10 అడుగుల లోతులో ఉన్న సాగర్ పైప్‌లైన్ మరమ్మతుల కోసం ఎక్స్‌కవేటర్‌తో గుంతను సంవత్సరం క్రితం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తీయించారు. మరమ్మతుల అనంతరం నిర్లక్ష్యంగా వదిలివేయడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. నిత్యం వందలాది వాహనాలతో రాకపోకలు జరిగే జాతీయ రహదారికి నాలుగు రోడ్లకు ములుపు జంక్షన్ వద్ద బాహుబలి లాంటి గుంతను తీసి నిర్లక్ష్యంగా వదిలివేయడాన్ని వాహనదారులు ఆక్షేపిస్తున్నారు.ఎదైనా అనుకోని ప్రమాదం జరిగితే గాని స్పందించరా అంటూ వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇటివల కురిసిన వర్షాలకు రోడ్డు మార్జిన్ కోతకు గరి కావడంతో గుంత అంచులు ప్రమాదకరంగా తయారయ్యాయి. రోడ్డు మార్జినే కదా అంటు ఆదమరిస్తే ప్రాణాలు గల్లంతేనని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి వాహనదారులకు ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



శివనగర్ కాలనీలో పర్యటనలో డామెజ్ పోల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

## శివారు కాలనీల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూలై 31: శివారు కాలనీల్లో ప్రజా సమస్యలు పరిష్కరించటమే లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక రెండో వార్డులో బుధవారం ఎమ్మెల్యే విద్యుత్ అధికారులతో కలసి పర్యటించారు. కాలనీల్లోని నివాసాలకు ఆనుకొని వెళ్తున్న విద్యుత్ వైర్లను మార్చాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా లో ఓల్టేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాల్లో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి వాటి స్థానంలో నూతనివి అమర్చాలని సూచించారు. రోడ్లను క్రాస్ చేసే సమయంలో వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలన్నారు. అదేవిధంగా నెట్, డిష్ వైర్లు అమర్చేటప్పుడు తగిన జాగ్రత్తలు, నిబంధనలను పాటించేలా వారికి సూచనలు చేయాలని ఎమ్మెల్యే విద్యుత్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఐరన్ స్తంభాలు ఉండటం వలన వర్షాలు పడే సమయంలో ఎర్త్ అవుతాయని, వాటికి కూడా తీసి కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. రెండో వార్డు బీసీ కాలనీలో మంచినీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. శివారు కాలనీల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ డీఈ ఉమాకాంత్, ఏఈ పవన్ కుమార్, కమిషనర్ టీవీ రంగారావు, ఎస్ఐ త్యాగరాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## అందరికీ పెన్షన్లు అందేలా చూడాలి


● డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



దర్శి, జూలై 31 : పెన్షన్ల పంపిణీలో టీడీపీ కూటమి నాయకులు భాగస్వాములు కావాలని, అందరికీ పెన్షన్లు సక్రమంగా అందేలా చూడాలని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పెన్షన్‌దారులకు సచివాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఒకే రోజు నూరుశాతం పంపిణీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. పెన్షన్‌దారుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు పెద్దన్నగా, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిన్నన్నగా వారి హృదయాల్లో నిలిచి పోయాన్నారు, గురువారం నుంచి పెన్షన్ దారులకు నగదు పంపిణీ జరుగుతున్నందున ఈనెలలో కూడా అవ్వ,తాతలకు ఒకరోజులోనే పెన్షన్ అందించేలా అధికారులు ప్రణాళికలతో ముందుకు సాగాలన్నారు. పెన్షన్ల పంపిణీలో అవకతవకలు జరిగితే సహించేది లేదన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా అమలు చేస్తుండటం పట్ల అన్ని వర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు.

## విద్యార్థులకు వాటర్ బాటిళ్లు అందజేత

పామూరు, జూలై 31 :మండలంలోని వీరభద్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పామూరుకు చెందిన రియల్టర్ పువ్వాడి వెంకటేశ్వర్లు కుమార్తె స్వర్గీయ డాక్టర్ పువ్వాడి బాల సరస్వతి ప్రథమ వర్థంతి సందర్భంగా విద్యార్థులకు వాటర్ బాటిళ్లను మాజీ ఎంపీపీ పువ్వాడి తిరుపతమ్మ, టీడీపీ మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వరు బుధవారం అందజేశారు. హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ముందుగా బాల సరస్వతి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శుబ్‌దిన్ భోజన్ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే తరుపున నరసారెడ్డి, గ్రామ సర్పంచ్ పువ్వాడి జయమ్మ, పువ్వాడి వెంకటలక్ష్మమ్మ, అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, మాజీ సర్పంచ్ జి మహాలక్ష్మయ్య, మాజీ ఉప సర్పంచ్ పి. చిన లక్ష్మయ్య, ముసలయ్య పాల్గొన్నారు.





# సర్పంచ్‌లకు.. పూర్వవైభవం





- వలంటీర్ల రాజ్యంలో చిన్నబోయిన గ్రామ పెద్ద
- నిధులు, విధులు మీవేనంటూ పంచాయతీ కమిషనర్ స్పష్టీకరణ
- ఉమ్మడి జిల్లా లోని 1172 ప్రెసిడెంట్‌లకు పూర్వ వైభవం
- గ్రామ స్వపరిపాలన కు ప్రాణం పోసిన కూటమి ప్రభుత్వం

గుంటూరు సిటీ, జూలై 31 : ఒకప్పుడు గ్రామ సర్పంచ్ అంటే మకుటం లేని మహారాజు. ఊర్లో అన్ని పనులు ఆయన చేతుల మీద గానే జరిగేవి . విద్యుత్ దీపం దగ్గర నుండి విందు, వినోదం వరకు సర్పంచ్ అన్నీతానై నిర్వహించేవారు. ఆ హోదా ఆ దర్పం ఒక రేంజ్‌లో ఉండేది. జగన్ ప్రభుత్వం స్థానిక స్వపరిపాలన సంస్థలను నిర్వీర్యం చేసింది. సర్పంచ్ అనే మాటకు అర్థాన్ని మార్చివేసింది. వలంటీర్ల రాజ్యంలో ప్రజలు ఎన్నుకున్న గ్రామ పెద్ద చిన్నబోయాడు. కేవలం ఉత్సవ విగ్రహం గానే మిగిలి పోయాడు . విధులు లేవు. నిధులు లేవు. ఏదో పేరుకే అలా పదవిలో ఉన్నారు. ఊరికి ఏదో చేద్దామన్న ఆశతో కోట్లు ఖర్చుపెట్టి మరీ కొంతమంది ఉన్నత విద్యావంతులు కూడా సర్పంచులుగా పదవులు చేపట్టారు. జగన్ ప్రభుత్వంలో అసలేమీ చేయలేమని అర్థం అయిపోయి ఎంతగానో కృంగిపోయారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మళ్లీ సర్పంచులకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తుంది. కేవలం ఉత్సవ విగ్రహాలుగా మాత్రమే మిగిలిపోయిన వారికి ప్రాణం పోసేందుకు నడుంకట్టింది. గ్రామ స్వపరిపాలన సంస్థ పూర్తిగా సర్పంచ్ కనుసనల్లోనే నడిచే విధంగా చర్యలకు ఉపక్రమించింది. ఈ పరిణామం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 1172 మంది సర్పంచులకు ఆనందాన్ని కలిగిస్తున్నది . గుంటూరు జిల్లాలో 227, పల్నాడు జిల్లాలో 519,బాపట్ల జిల్లా లో 426 మంది సర్పంచులకు ఇది ఆనందం కలిగించే విషయం.

### అసలు సర్పంచు అంటే ఎవరు ...

సర్పంచి అంటే అధికారులకు, గ్రామీణ సమాజానికి మధ్య వారధి లాంటి వారు.స్థానిక స్వపరిపాలన సంస్థ భారత రాజ్యాంగ బద్ధంగా రూపుదిద్దుకున్న చట్టబద్ధత కలిగిన సంస్థ. గ్రామానికి సర్పంచి ప్రథమ పౌరుడు. అక్కడ ఆయన చెప్పిందే వేదం. అంతటి ప్రాధాన్యం , చట్టబద్ధత కలిగిన పదవిని జగన్ తీసుకువచ్చిన సచివాలయ సమాంతర వ్యవస్థ పూచిక పుల్లతో సమానంగా చేసింది. సచివాలయం ఏర్పడి వలంటీర్లు వచ్చాక ప్రజలకు సర్పంచ్‌తో పెద్దగా పనిలేకుండా పోయింది. గ్రామ కార్యదర్శి, వలంటీర్లు ఊరిలో నిర్ణయాత్మక శక్తిగా మారిపోయారు. ఏదో ఉన్నారంటే వున్నారు అన్న విధంగా ఆ పదవిని దిగదార్చారు.

### బాధలన్నీ పోయినట్లే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం తో సర్పంచ్ లు ఊపిరి పీల్చుకున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ సమీక్ష లో భాగంగా 15వ ఆర్థిక సంఘం నిధులను పాత ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్న విషయాన్ని అధి కారులు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లారు. వెంటనే ఆ విషయం పై దృష్టి సారించాలని ఆయ న ఆదేశించటంతో నిధులు పంచాయతీల ఖాతాల్లో జమ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

### పంచాయతీ సొమ్ము పక్కదారి

జగన్ ప్రభుత్వం సర్పంచ్ లను ఉత్సవ విగ్రహాలుగా మార్చటమే కాకుండా ,పంచాయతీ నిధులను పక్కదారి పట్టించింది.గడచిన ఐదేళ్ళ కాలంలో గ్రామీణ ప్రాంతాలకు కొద్ది పాటి నిధు లు కూడా విదల్చలేదు.కేంద్రం ఇచ్చిన 15 ఆర్థిక సంఘం నిధులు రూ .42 కోట్ల ను పక్కదారి పట్టించింది. చాలా మంది సర్పంచ్‌లు కరోనా సమయంలో అప్పులు చేసి మరీ పారి శుధ్య కార్యక్రమాలు చేపట్టారు. వాటిని కూ డా ప్రభుత్వం విడుదల చేయలేదు. కరెంటు బిల్లులు చెల్లించేందుకు, ఇతర కార్యక్రమాలు నిర్వహించేం దుకు సర్పంచ్‌లు తలలు పట్టుకోవాలిసిన పరిస్థితిని కలిగించింది.

### సర్పంచ్‌లతో కమీషనర్ భేటీ

ప్రభుత్వ ఆదేశాలతో పంచాయతీ రాజ్, గ్రామీణా భివృద్ధి శాఖ డైరెక్టర్ కృష్ణ తేజ రాష్ట్రంలోని సర్పంచుల సంక్షేమ సంఘం ప్రతినిధులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో తమ ఇబ్బందులను సర్పంచుల సంక్షేమ సంఘం నేతలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇక మీదట గ్రామాల్లో అన్ని కార్యక్రమాలు కేవలం సర్పంచి చేతుల మీద గానే జరుగుతాయని డైరెక్టర్ హామీ ఇచ్చారు. నిధులు, విధులు అన్నీ మీవే అని స్పష్టం చేశారు. స్థానిక స్వపరిపాలన చట్టానికి లోబడి సర్పంచి పూర్వ వైభవానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే రాష్ట్రం ఏర్పాటు చేయాల్సిన 5 వ ఆర్థిక సంఘం కూడా ఏర్పాటు చేసి నిధులు విడుదల చేస్తామని చెప్పటం తో సర్పంచు ల్లో ఆనందం వెల్లువెత్తుతుంది.

### తలెత్తుకొని ఊరిలో తిరుగుతాం..



గత ప్రభుత్వం వల్ల గ్రామానికి ఏమి చేయలేక తలదిం చుకొనే పరిస్థితి. ఇప్పుడు మాకు భరోసా వచ్చింది. ఊరికి ఏదో ఒకటి చేసే అవకాశం వచ్చింది. ఇంక తలెత్తుకొని ఊరిలో తిరుగుతాం.మా విధులు నిర్వర్తించి ఊరికి ఉపకారిగా మారుతాం. పంచాయతీలకు, సర్పంచులకు పూర్వ వైభవం వచ్చినట్లే.

**- చిలకలపూడి పాపారావు**
**అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం**

### మా ఊరు.. మేము..



మాకు ప్రజలు ఓట్లేసి గెలిపించింది ఏదో ఒకటి చేస్తామని. ఐదేళ్లు ఏమి చేయలేదు. కేవలం ఉత్సవ విగ్రహాల మాదిరిగా మాత్రమే ఉన్నాం .ఇప్పుడు మా ఊరికి మేలు చేసే అవకాశం ఉంటుంది.

**- పూల నాగమణి,మేడికొండూరు పంచాయతీ సర్పంచ్**

# సర్వం సిద్ధం

- పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి
- 7.78 లక్షల మందికి రూ.316.84 కోట్లు విడుదల
- లబ్ధిదారుల మ్యాపింగ్ ప్రక్రియ నూరుశాతం పూర్తి
- ఈ నెలలోనూ సచివాలయ సిబ్బంది ద్వారానే పంపిణీ
- కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

**అవ్వాతాతలు.. దివ్యాంగులకు గురువారం ఉదయం ఆరు గంటలకే పింఛన్ అందచేసేందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. గత నెలలో ఎదురైన సమస్యలు ఈ సారి పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. మూడు రోజుల ముందుగానే నగదును ప్రభుత్వం విడుదల చేసింది. లబ్ధిదారుల ప్రక్రియను సచివాలయ సిబ్బంది బుధవారం సాయంత్రానికే నూరు శాతం పూర్తి చేశారు. గురువారం తెల్లవారగానే లబ్ధిదారుల ఇంటికెళ్లి సచివాలయ సిబ్బంది నగదు అందచేయనున్నారు. సర్వర్ సమస్య రాకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల నేపథ్యంలో కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నారు.**

గుంటూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధమయింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 7 లక్షల మందికి పింఛన్లు అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఉన్న సచివాలయ ఉద్యోగులే ఈసారి కూడా లబ్ధిదారులకు పింఛన్లు అందజేయను న్నారు. గురువారం ఉదయం 6 గంటలకే పింఛను పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది. మూడు జిల్లాల్లోని 7.78 లక్షల మంది లబ్ధిదారులకు సంబంధించి రూ.316.84 కోట్లు ఇప్పటికే బ్యాంకు ఖాతాల్లో జమయ్యా యి. మూడు రోజుల ముందుగానే నగదు జమ కావడంతో బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకుని ఉద్యోగులు పంపిణీకి సిద్ధమయ్యారు.

### ఉదయం 6 గంటల నుంచే..

పింఛన్ పంపిణీ కార్యక్రమం గురువారం ఉదయం 6 గంటలకల్లా ప్రారంభం కావాలని అధికారులు ఇప్పటికే సచివాలయ సిబ్బందికి స్పష్టం చేశారు. గత నెల ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యక్రమాన్ని లాంఛ నంగా ప్రారంభించడంతో పంపిణీ కొంచెం ఆలస్యమైం దని, ఈసారి అలాంటి జాప్యం జరగడానికి వీలులేదని అధికారులకు తేల్చి చెప్పారు. గత నెలలో తలెత్తిన సర్వర్ సమస్యలు కూడా రాకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి తెలిపారు. ఒక్కో సచివాలయ ఉద్యోగి 50 నుంచి 100 మందికి పింఛన్లు ఇచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. కిందటి నెలలో వచ్చిన చిన్నపాటి సమస్యలు కూడా రాకుండా ముందుగానే లబ్ధిదారుల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఉన్న 7లక్షల 78 వేల మంది లబ్ధిదారులకు ఒక్కరోజులోనే పింఛన్ అందజేయాలని అధికారులు టార్గెట్ పెట్టుకున్నారు. గుంటూరు జిల్లాలో సాధారణ పింఛనుదారులు 2 లక్షల 58 వేల 768 మంది ఉండగా, దివ్యాంగులు 2,802 మంది ఉన్నారు. వారికి రూ.110.69 కోట్ల నిధులు విడుదలయ్యాయి. పల్నాడు జిల్లాలో 2 లక్షల 79 వేల 975 మంది సాధారణ పింఛనుదారులు, 3వేల మంది దివ్యాంగులకు రూ.112 కోట్లు విడుదలయ్యాయి. బాపట్ల జిల్లాలో సాధారణ పింఛనుదారులు 2 లక్షల 33వేల 102 మంది, దివ్యాంగులు 2,300 మంది ఉండ గా వారికి రూ.94 కోట్లు విడుదల య్యాయి. మొత్తంగా మూడు జిల్లాల్లో 7లక్షల 78 వేల మందికి రూ.316.84 కోట్లు విడుదలయ్యాయి.

### పాల్గొననున్న ప్రజా ప్రతినిధులు

జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో జరిగే పింఛను పంపిణీ కార్యక్రమాల్లో కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన నున్నారు. వారి ద్వారానే లబ్ధిదారులకు పింఛను అందజేయనున్నారు. ఎన్ని ముఖ్యమైన పనులు ఉన్నా వాటిని వాయిదా వేసుకుని విధిగా ప్రతి నెలా పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేలు వారివారి నియోజకవర్గాల్లో జరిగే పింఛను పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

# బియ్యంతో సరి



- రెండో నెలలోనూ రేషన్ అంతే
- కార్డుదారులకు కందిపప్పు, పంచదార లేనట్లే
- ప్రైవేట్ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.180

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
రూ.లక్షల విలువైన వాహనం.. ఓ డ్రైవర్, ఓ సహాయకుడు.. సైరన్ మోగించుకుంటూ వచ్చి ఇచ్చేది.. బియ్యం మాత్రమే. ఇంటి వద్దకే రేషన్ సరుకులు అంటూ వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించి చివరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఉచిత బియ్యంతో సరిపెట్టింది. కూటమి ప్రభుత్వంలోనూ ఇదే పంథా రెండు నెలలుగా కొనసాగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి రేషన్ దుకాణాల్లో కందిపప్పు పంపిణీని నిలిపివేశారు. అయితే ప్రభుత్వం మారిన వెంటనే రేషన్‌లో కందిపప్పు, పంచదార పంపిణీ చేస్తామని కూటమి నేతలు ప్రకటించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే వాటిని సరఫరా చేస్తారని లబ్ధిదారులు ఆశగా ఎదురు చూశారు. అయితే జూలైలో మాదిరిగానే ఆగస్టులో కూడా కందిపప్పు పంపిణీ జరగదని తెలిసి పేదలు ఉసూరుమంటున్నారు. అక్కడక్కడ ఏదో కొంతమందికి మాత్రం గత నెలలో సరఫరా జరిగినట్లు తెలుస్తోంది. కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.175 నుంచి రూ.180 వరకు ఉంది. ప్రభుత్వం కిలో కందిపప్పు రాయితీపై రూ.67 ఇవ్వాల్సి ఉంది. ప్రైవేట్ మార్కెట్‌లో కిలోకు రూ.100 నుంచి రూ.110 వరకు అధికంగా ఉంది. ఈ పరిస్థితుల్లో రాయితీ పై కందిపప్పు పంపిణీ చేయాలని కార్డుదారులు కోరుతున్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో కందిపప్పు, పంచదార పంపిణీని ప్రభుత్వం దాదాపుగా నిలిపివేసింది. పల్నాడు జిల్లాలో 6,45,110 తెల్ల కార్డులు ఉన్నాయి. ఒక్కోక్క కార్డు దారునికి కనీసం కిలో కందిపప్పు అందజేయాలి. అయితే 1.35 శాతం కార్డుదారుల కు మాత్రమే సరఫరా చేసినట్టు పౌరసరఫరాల శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. బాపట్ల జిల్లాలో 4,86,029 కార్డుదారులకు కందిపప్పు సరఫరా చేయలేదు. ఏడు ప్యాకెట్లు మాత్రమే అందజేయడం గమనార్హం. గుంటూరు జిల్లాలో 5,99,511 కార్డుదారులెవ్వరికూ కూడా కందిపప్పు సరఫరా కాలేదు.

# బాలల చట్టాలు సమర్థంగా అమలు చేయాలి


**ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి**

బాపట్ల, జూలై 31: బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేలా రూపొందించిన చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. బాలల హక్కుల సంరక్షణపై అనుబంధశాఖల అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. బాలకార్మిక రహిత సమాజం నిర్మాణం కోసం, వారి హక్కులు పరిరక్షించటంకోసం ప్రతి ఒక్కరు కార్యోన్ముఖులు కావాలన్నారు. నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదగడానికి మంచి అవకాశాలు కల్పించాలన్నారు. జిల్లాలోని కొందరు బాలలు, యువత గంజాయికి బానిసలు కావడం బాధాకరమన్నారు. మందుల షాపుల్లో మత్తు మందులు పిల్లలకు విక్రయించకుండా చర్యలు చేపట్టాలన్నారు. మాదకద్రవ్యాల రహిత జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దడానికి అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. బాలలకు మంచి భవిష్యత్తు ఏర్పడేలా విద్యాబుద్ధులు నేర్పి మంచి మార్గంలో నడిపించాలన్నారు. ఫోక్సో చట్టం కింద నమోదైన కేసుల్లో బాధితులకు తక్షణమే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, వసతిగృహాలలో ఫిర్యాదుబాక్స్‌లు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. జిల్లాలో డి-ఎడిక్షన్ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జేసీ బి.సుబ్బారావు, ఏఎస్పీ విఠలేశ్వర్ మాట్లాడుతూ బాలల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. బాలల హక్కుల పరిరక్షణ యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ కె.ఉమ, సీడబ్ల్యూసీ నీలిమా వంశీలత, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, డీఈవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల పద్మావతి



హనుమాజీ పాలెంలో కంప చెట్లతో నిండిపోయిన లే అవుట్

# నాడు కక్ష పూరితం నేడు ఉదారత

- వైసీపీ అధికారంలోకి రాగానే
- ఎన్టీఆర్ గృహాల బిల్లుల నిలిపివేత రూ.18 కోట్లు నేటికీ
- పెండింగే, పది వేల మంది లబ్ధిదారుల ఇక్కట్లు
- నెలన్నరలో జగన్ స్కీమ్‌ల బిల్లులు రూ.33 లక్షలు చెల్లించిన కూటమి ప్రభుత్వం

బాపట్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారం చేపట్టగానే పేదింటిపై కక్షపూరితంగా వ్యవహరించింది. 2019లో గద్దెనెక్కగానే ఎన్టీఆర్ హౌసింగ్ స్కీంను అటకెక్కించింది. లబ్ధిదారులకు బిల్లులను సైతం చెల్లించలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పేదల ఇళ్లపై గత ప్రభుత్వంలా కక్షపూరితంగా వ్యవహరించకుండా ఉదారంగా ఉంటోంది. జగనన్న కాలనీల బిల్లుల చెల్లింపు విషయంలో ఉదారతతో వ్యవహరిస్తూ పేదల పక్షాన ఉంది. నెలన్నర వ్యవధిలోనే జగనన్న ఇళ్ల తాలూకా దాదాపు రూ.33 లక్షలను లబ్ధిదారులకు చెల్లించడమే కాకుండా, వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను సైతం త్వరితగతిన పూర్తి చేస్తే వాటికి కూడా బిల్లులు చెల్లిస్తామనే భరోసాను ఇచ్చింది. వైసీపీ ప్రభుత్వం నిలిపేసిన ఎన్టీఆర్ గృహాలకు సంబంధించి పెండింగ్ ఉన్న బిల్లులపై ప్రస్తుతం గృహనిర్మాణ శాఖ కసరత్తు చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు పదివేల మందికి రూ.18 కోట్లు పెండింగ్ పెట్టినట్లు గృహ నిర్మాణ శాఖ తేల్చింది.

### జగనన్న కాలనీలపై ప్రచారానికే పెద్దపీట..

జగనన్న కాలనీల పేరిట వైసీపీ ప్రభుత్వం చేపట్టిన గృహనిర్మాణాల విషయంలో పేదలకు న్యాయం చేయడంపై కాక ఆర్భాటపు ప్రచారంపైనే దృష్టి పెట్టింది. జిల్లాలో 120 లే అవుట్‌లకు జగనన్న కాలనీల పేరిట ఆర్చ్ నిర్మాణానికి రూ.6 లక్షల అంచనాతో ప్రతిపాదనలు ప్రభుత్వపు చివరిరోజుల్లో రూపొందించింది. కూటమి ప్రభుత్వం రావడంతో అది అంతటితోనే ఆగిపోయింది. జగనన్న కాలనీలకు స్థలాల సేకరణ మొదలుకుని లబ్ధిదారుల ఎంపిక వరకు అన్నీ వైసీపీ నేతల కనుసన్నల్లోనే జరగడంతో అర్హులైన ఎంతోమంది సొంతింటి కలకు దూరమయ్యారు. ప్రస్తుత ప్రభుత్వం పేదలకు ఇళ్ల నిర్మాణంపై నూతన పాలసీని ఇటీవలే ప్రకటించిన సంగతి తెలిసిందే. అందుకు సంబంధించి విధివిధానాల జారీకి ముందే గత ప్రభుత్వంలో వేసిన లే అవుట్లలో ఎన్ని ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి అనే అంశంతో పాటు ప్రారంభించిన ఇళ్లు ఏ దశలో ఉన్నాయి అనే అంశాలపై గృహనిర్మాణ శాఖ కసరత్తు చేస్తోంది. ఇంటి నిర్మాణ దారులకు బిల్లుల విషయంలో ఏమైనా అపోహలు ఉన్నా నివృత్తి చేయాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగానిదేనని కూటమి ప్రభుత్వం మార్గనిర్దేశనం చేసింది.

### 336 లే అవుట్లు ఖాళీగానే..

జిల్లాలో జగనన్న కాలనీల నిర్మాణం పేరిట గత ప్రభుత్వం చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. మొత్తం 694 లే అవుట్లకు 336 చోట్ల ఒక్క ఇంటి నిర్మాణానికి కూడా ప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరు కాలేదు. స్థలం పొందిన 22,000 మంది సొంతగూడు విషయంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. 358 లే అవుట్లలో 25,000 మంది లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ అనుతులను గత ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో ఇప్పటి వరకు పూర్తయిన ఇళ్లు కేవలం 12,000 మాత్రమే. వీటి బిల్లుల చెల్లింపులో లబ్ధి దారులకు చుక్కలు చూపించింది. ప్రస్తుత ప్రభుత్వం ప్లాట్లు ఇచ్చి నిర్మాణం మొదలు వారికి నూతన స్కీంలో ఎలా న్యాయం చేయా లనే దానిపై కసరత్తు చేస్తోంది. లే అవుట్లలో ఎవరికీ కేటాయించని ప్లాట్లు దాదాపు 5,500 వరకు ఉన్నట్లు గుర్తించారు. వీటి విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే అంశంతో పాటు ఇప్ప టికే నిర్మాణం ప్రారంభించిన లబ్ధిదారుల ఇళ్లను డిసెంబరులోపు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.



బాపట్ల పరిధిలోని మూలపాలెం జగనన్న కాలనీ

# డీఎస్పీలకు స్థానచలనం

- తొలి జాబితాలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొమ్మిది మంది బదిలీ

గుంటూరు, జూలై 31: ఎట్టకేలకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా భారీగా డీఎస్పీల బదిలీలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు బుధవారం 96 మందితో తొలి జాబితా విడుదల చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో పలువురికి స్థానచలనం కలిగింది. గత సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల కమిషన్ నిబంధనలకనుగుణంగా అప్పటి వైసీపీ ప్రభుత్వం డీ ఎస్పీలను నియమించుకుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడుస్తున్నా గత ప్రభుత్వ హయాంలో నియమితులైన వారే కొనసాగుతుండటంపై పార్టీ శ్రేణుల నుంచే కాక పోలీసు వర్గాల నుంచి కూడా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ పరిస్థి తుల్లో ఎట్టకేలకు డీఎస్పీల బదిలీలపై రాష్ట్ర ప్రభు త్వం దృష్టి పెట్టింది.

| పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| వీవీ నాయుడు | ట్రాఫిక్, గుంటూరు | ఏసీపీ ట్రాఫిక్ , విజయవాడ |
| బీ జనార్థనరావు | ఏసీపీ ట్రాఫిక్, విజయవాడ | తెనాలి |
| ఎం రమేష్ | తెనాలి | డీజీపీ కార్యాలయం |
| పత్రిని శ్రీనివాసరావు | డీసీఆర్‌బీ, గుంటూరు | కాశీబుగ్గ |
| పీ మల్లికార్జునరావు | సీఐడీ గుంటూరు | దిశ, ఉమెన్ పీఎస్, విజయవాడ |
| సీహెచ్ రవికాంత్ | నార్త్, గుంటూరు | డీజీపీ కార్యాలయం |
| ఎండీ మహబూబ్‌బాషా | సౌత్, గుంటూరు | డీజీపీ కార్యాలయం |
| సీహెచ్ శ్రీనివాసరావు | గురజాల | డీజీపీ కార్యాలయం |
| బీ ప్రసాద్ | వెయిటింగ్ | దిశ, ఉమెన్ పీఎస్, పల్నాడు |



పోటీలో తలపడుతున్న ఎడ్లు

## హోరాహోరీగా ఎడ్ల పందేలు

చినగంజాం, జూలై 31 :ఎడ్ల పందేలు హోరాహోరీగా ప్రారంభమయ్యాయి. మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం గ్రామంలో అవనిగడ్డ కుటుంబీకుల ఇలవేల్పు శ్రీపల్నాటి ఈర్లంకమ్మ అమ్మవారి 16వ రోజు పండుగ సందర్భంగా రాష్ట్ర స్థాయి జూనియర్స్ ఒంగోలు జాతి నాటు బండి పోలు రాధ బల ప్రదర్శన పోటీలలో సత్తా చాటేందుకు తలపడ్డాయి. రాష్ట్ర స్థాయి నాటు బండి పోలురాధ పోటీలను బుధవారం గ్రామ సర్పంచ్ నక్కల కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పోటీలు నిర్వహించడం వలన ప్రజల మధ్య స్నేహ సంబంధాలు పెంపొందుతాయని అన్నారు. ఈ పోటీలకు వేటపాలెం, పాతచీరాల, పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డి కొత్తగొల్లపాలెం, బాపట్ల పోతురాజు కొత్తపాలెం, సోపిరాల, నెల్లూరు జిల్లా తూర్పుగోనాల, జొన్నవాడ, తూర్పుగోసలపల్లె, కడవకుదురు, రాజుబంగారుపాలెం తదితర ప్రాంతాల నుంచి 12 జతల ఎడ్లు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రేక్షకుల ఈలలు, కేరింతలతో పల్లెపాలెం గ్రామంలో తిరునాళ్ల వాతావరణం నెలకొంది. పోటీలను తిలకించేందుకు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ పోటీలలో విజేతలైన ఎడ్ల జతల యజమానులకు గురువారం బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలకు న్యాయ నిర్ణీతగా తంగడ హసన్ వ్యవహరించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు కే.విష్ణు, నిర్వహణ కమిటీ సభ్యులు వల్లభని శేషయ్య, అవనిగడ్డ వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు, యువత ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు.



సమావేశానికి హాజరైన రెండు పార్టీల కౌన్సిలర్‌లు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

## కౌన్సిల్‌లో అంతా గప్‌చుప్

● నోరు విప్పని రెండు పార్టీల కౌన్సిలర్లు

● మంత్రి గొట్టిపాటి ఆదేశాలతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

● కమిషనర్ సత్యనారాయణ

అద్దంకి, జూలై 31 : అద్దంకి మున్సిపల్ సమావేశం తీరు అందరినీ వి స్మయానికి గురి చేసింది. అద్దంకి పట్టణంలోని సమస్యలపై అటు వైసీపీ, ఇటు టీడీపీ కౌన్సిలర్‌లు ప్రస్తావించకపోవడం పట్ల పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మూడు సంవత్సరాలు మున్సిపల్ సమావేశం జరుగుతుందంటే రెండు పార్టీల కౌన్సిలర్ మధ్య మాటల యుద్ధమే సాగేది. అయితే టీడీపీ కూటమి అధికారం చేపట్టినప్పటి నుంచి కౌన్సిల్ సమావేశం తీరు పూర్తిగా మారిపోయింది. గతంలో సమస్యలపై ప్రశ్నించే టీడీపీ కౌన్సిలర్‌లు మిన్నకుండుండగా, వైసీపీ కౌన్సిలర్లు కూడా అంతకంటే మరింత మౌన వ్రతం పాటిస్తున్నారు. దీంతో అజెండాలోని అంశాలు చదవడానికి మాత్రమే పరిమితమవుతున్నారు. పట్టణంలో పలు సమస్యలు ఉన్నా సమావేశంలో ప్రస్తావించకుండా ఉండడం పట్ల ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. టీడీపీతో టచ్‌లో ఉన్న వైస్ చైర్మన్ 1 దేసు పద్మేష్ మున్సిపల్ సమావేశానికి హాజరుకాకపోవటం చర్చనీయాంశంగా మారింది. హాజరైతే ఏ పక్షం వైపు కూర్చుంటే ఏ సమస్య వస్తుందోనన్న ఆలోచనతో సమావేశానికి డుమ్మా కొట్టిఉంటారనే అభి ప్రాయం వ్యక్తం అవుతుంది. 13వ వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

### అద్దంకి పట్టణంలో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో అద్దంకి పట్టణంలో సైడ్ డ్రైన్‌లు, విద్యుత్‌లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. అజెండాలోని అన్ని అంశాలను ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ ప్రకటించారు. అజెండాలో వివాదా స్పద అంశాలు ఉన్నప్పటికీ చర్చ జరగకపోవడం విమర్శలకు తావిస్తుంది. సమావేశం బయట చెవులు కొరుక్కున్న ఇరు పార్టీల కౌన్సిలర్‌లు సమావేశంలో మాత్రం నోరు విప్పకపోవడం అనుమానాలకు తావిస్తుంది.



మహిళ మెడలో గొలుసు లాక్కెకుతున్న దుండగుడు (ఫైల్)

## చైన్ స్నాచర్ అరెస్ట్

చీరాలటౌన్, జూలై 31 : ఇటీవల చీరాల మండల పరిధిలోని రామకృష్ణాపురం గుంట మార్కెట్ సమీపంలో మహిళ మెడలో పట్టపగలే బంగారు గొలుసును తెంపుకుని వెళ్లిన నిందితుడిని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే చినగంజాం మండలపరిధిలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన కుప్పాల బాలమురళీకృష్ణా రెడ్డి చీరాల రైల్వే స్టేషన్‌లో గూడ్స్ షెడ్డులో ఎరువులు బస్తాలు మోసేందుకు రోజువారి కూలీగా వెళ్తున్నాడు. ఈక్రమంలో జూలై 19వ తేదీన మద్యం సేవించి చీరాలకు వస్తున్నాడు. గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన చీదెళ్ల హేమసాయి లత స్వగ్రామం చీరాల రామకృష్ణాపురం. కాగా తిరునాళ్ల సందర్భంగా తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. ఈక్రమంలో ఉదయం సుమారు 10 గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తుండగా ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న బాల మురళీకృష్ణారెడ్డి ఆమె మెడలో బంగారు చైన్, నల్లపూసల బంగారు గొలుసులు అపహరించేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆమె కూడా ఎదురు తిరిగేందుకు యత్నించగా ఫలితం లేకపోయింది. దీంతో పెనుగులాటలో చైన్ తెగింది. సుమారు 10 గ్రాముల వరకు బంగారం అపహరించి పరారయ్యాడు. బాధితురాలు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించగా పోలీసులు సీసీ కెమెరా ఆధారాలు సేకరించి మంగళవారం రాత్రి అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచారు.

## మందను ఢీకొన్న బైకు

● నాలుగు గొర్రెలు మృతి మరికొన్నింటికి గాయాలు

మార్టూరు, జూలై 31 : జాతీయ రహదారిపై కోలలపూడి రోడ్డు నుంచి కోనంకి సెంటర్ మధ్యలో రోడ్డు దాటుతున్న గొర్రెల మందను ద్విచక్రవాహనదారుడు ఢీకొనడంతో నాలుగు గొర్రెలు చనిపోగా, మరి కొన్ని గాయపడ్డాయి. ఈసంఘటన బుధవారం రాత్రి 10 గంటల సమయంలో జరిగింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట కు చెందిన ఇద్దరు యువకులు బుల్లెట్‌పై వ్యక్తిగత పనులు నిమిత్తం అద్దంకికి వెళుతున్నారు. కోలలపూడి రోడ్డు వద్ద జె.పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన ఎస్కే బాబావలి తన గొర్రెలను యద్దనపూడి పొలాలకు తీసుకొచ్చి వాటిని మేపుకొని తిరిగి రామకూరు గ్రామానికి వెళ్తూ కోలలపూడి వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో బుల్లెట్‌పై వేగంగా వస్తున్న యువకులు సయ్యద్ అబ్దుల్లా, ఎస్కే అబ్దుల్ రహమాన్‌ల గొర్రెల మందను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నాలుగు గొర్రెలు చనిపోయాయి. మరి కొన్ని గొర్రెలకు గాయాలయ్యాయి. రూ.లక్ష దాకా నష్టం జరిగినట్లు బాధితుడు బాబావలి విలపిస్తున్నారు. సంఘటనా స్థలానికి సీఐ రాజశేఖర్‌రెడ్డి వెళ్లి పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# వైసీపీ నాయకుల అక్రమ అంతస్థులు

అనుమతులు లేకుండానే నిర్మాణాలు

పన్ను వేసేందుకు కూడా సాహసించని అధికారులు

రూ.50 కోట్ల మేర మున్సిపాలిటీ ఆదాయానికి గండి

కూటమి ప్రభుత్వం రావడంతో యంత్రాంగంలో కదలిక

దాదాపు 50 భవనాలకు నోటీసులు

**మార్కాపురం పట్టణంలో గత ఐదేళ్ల కాలంలో వైసీపీ నాయకులు, అనుచరులు సాగించిన దురాగతాలు అన్నీఇన్నీ కావు. అక్కడా ఇక్కడా అని కాకుండా ఎలాంటి అనుమతులు లేకుండా పట్టణమంతా బహుళ అంతస్థుల భవనాలు ఇష్టారీతిన నిర్మించారు. ఈ క్రమంలో నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారు. నియోజకవర్గ స్థాయి నాయకులు, మున్సిపాలిటీలోని ముఖ్యనాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతో యథేచ్ఛగా నిర్మాణాలు సాగాయి. ఇంత జరుగుతున్నా రాజకీయ వత్తిళ్ల నేపథ్యంలో ఇచ్చింది పుచ్చుకొని అధికారులు కూడా చోద్యం చూశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రస్తుతం అధికారుల్లో చలనం మొదలైంది. గతంలో చూసీచూడనట్లు వ్యవహరించిన వాళ్లు నేడు నోటీసులు ఇస్తున్నారు. ప్రస్తుతం మార్కాపురం పట్టణంలో సుమారు 50కిపైగా అక్రమ నిర్మాణాలకు మున్సిపాలిటీ అధికారులు నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేసిన వాటిని ప్రస్తుతం తొలగించే కార్యక్రమానికి కూడా శ్రీకారం చుట్టారు.**



ఈ చిత్రంలోని షోరూమ్ స్థానిక కళాశాల రోడ్డులోనిది. ఇది ఏఎంసీ మాజీ చైర్మన్ అయిన వైసీపీ ముఖ్య నాయకునిది. ఆయన కుమారుని పేరున షోరూమ్ ఉంది. సంవత్సరం క్రితం ఈ షోరూం ప్రారంభమైంది. ఇంతటి షోరూంకు ఏడాదికి ఎంతలేదన్నా సుమారు రూ.2లక్షల వరకు మున్సిపాలిటీ పన్ను ఉంటుంది. కానీ అధికారం అండతో పన్ను కట్టడం లేదు. షోరూమ్ నిర్మించకముందు ఉన్న రెండు చిన్నపాటి భవనాలకు విధిస్తున్న రూ.21వేల పన్ను మాత్రమే నేటికి మున్సిపాలిటీ రెవెన్యూ విభాగం వసూలు చేస్తోంది. ఈ షోరూమ్ ద్వారా సదరు నాయకుడు నెలకు రూ.2.5లక్షలు అద్దె వసూలు చేస్తున్నాడు. వాస్తవానికి షోరూం కమర్షియల్ నిర్మాణం. కానీ ఆ నాయకుడు రెసిడెన్షియల్ ప్లాన్ మాత్రమే తీసుకున్నాడు. జీప్లస్ టూకు మాత్రమే అనుమతులు తీసుకున్నా అదనంగా మరో రెండు అంతస్థులు నిర్మించాడు. అంతేకాక 256 సర్వేనంబరులో ఈ షోరూమ్ నిర్మించినా దానికి సంబంధించిన డాక్యుమెంట్లు మాత్రం 258 సర్వేనంబర్‌లోనివి. నిబంధనలను కాలరాసి ప్రధాన రహదారిపై బరితెగించి వైసీపీ నాయకుడు నిర్మిస్తున్నా, మున్సిపల్ అధికారులు మాతం మిన్నకుండిపోయారు.





ఈ చిత్రంలోని ఈ భవనం ఓ ఉపాధ్యాయునిది. గతంలో రెండు సాధారణ ఇళ్లు ఉండేవి. వీటిని నాలుగేళ్ల క్రితం కూలగొట్టి ఎలాంటి అనుమతులు లేకుండా నాలుగు అంతస్థుల భవనం నిర్మించారు. వైసీపీ నాయకుల అండతో దానిని నిర్మించాడు. అద్దెల రూపంలో రూ.లక్షలు వసూలు చేస్తున్నా మున్సిపాలిటీకి పన్ను మాత్రం రూ.6,860 మాత్రమే చెల్లిస్తున్నాడు. ఈ భవనానికి కొలతల ప్రకారం పన్ను వేస్తే ఏడాదికి రూ.1.50 లక్షల మేర ఉంటుంది. ఈ నాలుగేళ్ల కాలంలో సుమారు రూ.6లక్షల మేర మున్సిపాలిటీ ఆదాయాన్ని కోల్పోయింది. ప్రభుత్వ ఆదాయానికి ఈ మేర గండిపడుతున్నా మున్సిపాలిటీ రెవెన్యూ విభాగం మాత్రం చోద్యం చూస్తోంది.

మార్కాపురం, జూలై 31: మున్సిపాలిటీల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలన్నా ముందుగా మున్సిపాలిటీలోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను కలవాలి. నిర్మాణదారుడు అన్ని రకాలైన స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు కలిగి ఉండాలి. నిర్మాణానికి ముందే ఖాళీస్థలం పన్ను కూడా రెవెన్యూ విభాగానికి కట్టేయాలి. అంతేకాక మున్సిపాలిటీ అనుమతిపొందిన ప్లానర్ వద్ద ఎంత విస్తీర్ణంలో, ఎన్ని అంతస్థుల్లో నిర్మాణం చేస్తారో ప్లాన్ అప్రూవల్ తీసుకోవాలి. అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నిర్మాణాలకు అనుమతులు ఇస్తారు. నిర్మాణం అనంతరం పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత మున్సిపల్ రెవెన్యూ అధికారులు పన్ను వేస్తారు. కానీ ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇలాంటి నిబంధనలు అన్నింటికీ నాయకులు తిలోదకాలు ఇచ్చారు. మున్సిపాలిటీని సంప్రదించకుండానే ఇష్టారీతిన నిర్మాణాలు పూర్తిచేశారు. బ్యాంకుల్లో రుణం పొందాలనుకునే వాళ్లు మాత్రం ఏదో మొక్కుబడిగా ప్లాన్ వరకు తీసుకున్నారు. జీప్లస్‌టూకు అనుమతులు తీసుకొని అదనంగా మరో రెండు మూడు అంతస్థులు యథేచ్ఛగా నిర్మించారు. ఈ ఐదేళ్లలో నిర్మాణాలు పూర్తిచేసిన భవనాలు, వాణిజ్య సముదాయాల్లో 80శాతం ఇలా నిబంధనలు పాటించలేదని తెలుస్తోంది. ఈ విధంగా మార్కాపురం మున్సిపాలిటీ ఎంతలేదన్నా సుమారు రూ.50 కోట్ల వరకు ఆదాయం కోల్పోయినట్లు అంచనా.

### కూటమి ప్రభుత్వం రాగానే అధికారుల్లో కదలిక

మార్కాపురం పట్టణంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమ నిర్మాణాల విషయంలో తొంగి చూసేందుకు కూడా మున్సిపాలిటీ అధికారులు భయపడ్డారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారిలో కదలిక మొదలైంది. అక్రమ నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చారు. అలాంటివి దాదాపు వంద వరకు ఉన్నట్లు సమాచారం. అలాగే పక్కాగా మున్సిపాలిటీ స్థలంలో నిర్మించిన బహుళ అంతస్థుల భవనాన్ని ఇటీవల కూల్చేశారు. అన్నా క్యాంటిన్ పక్కన వైసీపీ ముఖ్యనాయకుడి అనుచరుడు దానిని కట్టాడు. వైసీపీ పాలనలో టీడీపీకి చెందిన వాళ్లు నిర్మాణాలు చేసుకోవాలంటే పలు రకాల కొర్రీలతో అధికారుల ద్వారా ఇబ్బందులకు గురిచేశారు. ఇలాంటి ఫిర్యాదులు పదులసంఖ్యలో అప్పట్లో టీడీపీ నేత, ప్రస్తుత ఎమ్మెల్యే నారాయణరెడ్డి వద్దకు వెళ్లాయి. కాగా ముందుగా ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన వాటిని కూల్చేస్తున్నారు. ఎలాంటి కనీస అనుమతులు లేనివాళ్లకు, ప్లాన్ తీసుకున్నా నిర్మాణాల్లో తేడాలు ఉన్నవి, పన్నులు వేయని వాటికి ఇప్పటికే మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చారు. నిర్మాణదారులు నోటీసులకు సమాధానం ఇచ్చిన తర్వాత వాటిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు.

### అక్రమ నిర్మాణాలు, పన్నులు చెల్లించని వారికి నోటీసులు ఇచ్చాం

మార్కాపురం పట్టణంలో అక్రమంగా నిర్మాణాలు చేసేవారికి, నిర్మాణాలు పూర్తిచేసి పన్నులు చెల్లించని వారికి నోటీసులు ఇచ్చాం. 10 రోజులవుతున్నా నోటీసులకు ఇప్పటికీ సమాధానాలు రాలేదు. ప్రధానంగా సెల్లార్లకు ఎవరూ అనుమతులు తీసుకోకుండానే ఇష్టారీతిన భవనాలు నిర్మించారు. అక్రమ నిర్మాణాలు చేసేవారిని ఎవరినీ ఉపేక్షించేది లేదు.

- ఇ.కిరణ్, మున్సిపల్ కమిషనర్, మార్కాపురం

# ప్రజలకు జవాబుదారీగా పనిచేద్దాం

ఎమ్మెల్యే కొండయ్య ఎక్స్‌అఫిషియో మెంబరుగా ప్రమాణ స్వీకారం

చీరాల, జూలై 31 : ఎన్నికలు, రాజకీయాలు వేరని, గెలుపు, ఓటములు సహజమని, ప్రజాతీర్పుకు అందరూ కట్టుబడి ప్రజలకు జవాబుదారీగా కలిసి సేవలందిద్దామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్లో బుధవారం చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య ఎక్స్ అఫిషియో మెంబరుగా ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్ జంజనం సభా కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ముందస్తుగా తను, తమతో పాటు ఉన్న కౌన్సిలర్లు మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ను కలిశామన్నారు. ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా సమిష్టిగా పట్టాభివృద్ధికి పరస్పర సహకారంతో ముందుకు సాగాలని వారు దిశానిర్దేశం చేసినట్లు చెప్పారు. గతంలో కరణం బలరామకృష్ణమూర్తి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో టీడీపీ బాధ్యతలు నిర్వహించే సమయంలో తనకు, ప్రస్తుత ఎమ్మెల్యే కొండయ్య మధ్య ఉన్న అవినాభావ సంబంధాలను వివరించారు. తాము పూర్తి స్థాయిలో ఎమ్మెల్యే కొండయ్యకు సహకరిస్తామని, అదే విధంగా ప్రభుత్వ పరంగా పట్టణ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ సమిష్టిగా చీరాలను స్మార్ట్ టౌన్‌గా రూపొందిద్దామని అన్నారు.



మున్సిపల్ ఎక్స్ అఫిషియో మెంబరుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

### సంప్రదాయబద్ధంగా ప్రమాణ స్వీకారం

కౌన్సిల్ అత్యవసర సమావేశానికి ఎమ్మెల్యే కొండయ్య హాజరయ్యే సమయంలో మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి, చైర్మన్ జంజనం తదితరులు పుష్పగుచ్ఛం ఇచ్చి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే కొండయ్యతో ఎక్స్ అఫిషియో మెంబరుగా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం బాధ్యతలు స్వీకరిస్తూ కొండయ్య రిజిస్టర్‌లో సంతకం చేశారు. అజెండాలోని అంశాల చర్చ అనంతరం ఎమ్మెల్యే కొండయ్యకు హుందాగా పౌరసన్మానం నిర్వహించారు. అజెండాలో మొత్తం 68 అంశాలు కాగా అందులో 8వ అంశాన్ని రద్దు చేశారు. ఆ అంశంలో పెట్రోల్ బంకు ఏర్పాటుకు సంబంధించి ఏఏ పత్రాలు అందజేశారో తెలిపాలని, అప్పటి వరకు ఆ అంశాన్ని రద్దు చేయాలని పలువురు కౌన్సిలర్లు సూచించడంతో రద్దు చేశారు. కొన్ని అంశాలలో కాంట్రాక్టర్లు నిర్ణీత ధర కన్నా ఎక్కువకు కోట్ చేయడం, బాగా తక్కువకు కోట్ చేయటంపై ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడారు. అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలలో 9, 67వ అంశాలను కొద్ది సవరణలతో ఆమోదించారు. మిగిలిన 65 అంశాలను కొద్దిపాటి చర్చతో ఆమోదించారు.

### భారీగా పోలీస్ బందోబస్తు

కౌన్సిల్ అత్యవసర సమావేశం నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు భారీగా పోలీసులు మోహరించారు. బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఇంత బందోబస్తు అవసరమా అని పలువురు వ్యాఖ్యానించారు.



వృద్ధురాలి నివాసం వద్ద విచారిస్తున్న చీరాల ఇన్‌చార్జి డీఎస్పీ నాయక్, సీఐ శ్రీనివాసరావు

## అమ్మమ్మపై మనవడి దాడి

● అక్కడికక్కడే మృతి ● కేసు నమోదు

పర్చూరు, జూలై 31 : క్షణికావేశంలో వృద్ధురాలిపై మనవుడు దాడిచేసి గాయపరచడంతో ఆమె అక్కడి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన కారంచేడులో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు కారంచేడు పాత మాలపల్లిలో షేక్ రాజాంబీ భర్త చనిపోవడంతో ఒంటరిగా నివాసం ఉంటుంది. ఆమె కుమార్తె, అల్లుడు కూడా చనిపోవడంతో మనవుడు షేక్ బాజీ అమ్మమ్మతో కలసి కారంచేడులోనే ఉంటున్నారు. మంగళవారం రాత్రి అన్నం తినే విషయంలో గొడవ పడి అమ్మమ్మపై దాడిచేయడంతో ఆమె మృతి చెందారు. బుధవారం చుట్టుపక్కలవారు గుర్తించి బంధువులకు సమాచారమిచ్చారు. చీరాల ఇన్‌చార్జి డీఎస్పీ నాయక్, ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, చినగంజాం ఎస్సై ఎం.శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి స్థానికుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఆమె బంధువుల ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేశారు. బాజీ మానసిక పరిస్థితి సక్రంగా లేదని స్థానికులు అంటున్నారు.

# అంటకాగిన వారు ఔట్!

వైసీపీ ప్రభుత్వ బాధితులకు ప్రాధాన్యం

పోలీసు బదిలీల్లో కూటమి ప్రభుత్వం మార్క్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలతో అంటకాగి విధి నిర్వహణలో అడ్డగోలుగా వ్యవహరించిన పోలీసు అధికారులపై కూటమి సర్కారు వేటు వేస్తోంది. అదేసమయంలో ఎన్ని అర్హతలు ఉన్నా పోస్టింగ్‌లు ఇవ్వకుండా వేధించిన, లూప్‌లైన్‌లో ఉంచిన వారికి ప్రాధాన్యం ఇస్తోంది. పోలీసు శాఖలో ఉన్నతాధికారుల నుంచి సీఐల వరకూ జరిగిన బదిలీలను పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం జరిగిన డీఎస్పీలు, సీఐల బదిలీల్లో గత ప్రభుత్వంతో అంటకాగిన వారిని పక్కనపెట్టి అర్హత ఉండీ ఇప్పటివరకూ అప్రధాన్య పోస్టుల్లో ఉన్న వారిని నియమించింది. సీఐల విషయంలోనూ అదేపంథాను అనుసరిస్తున్నట్లు ప్రాథమికంగా జరిగిన కొన్ని బదిలీల్లోనే తేటతెల్లమవుతోంది. దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డిని బదిలీ చేసి పోలీసు హెడ్‌క్వార్టర్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. అలాగే ఒంగోలు డీఎస్పీ కిషోర్‌ను బదిలీ చేసి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. వీరిలో అశోక్‌వర్ధన్‌రెడ్డి అందరితో సమన్వయంగా ఉంటారన్న పేరున్నప్పటికీ ఎన్నికల పోలింగ్ రోజు దర్శి నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థికి మద్దతుగా వ్యవహరించారన్న ఆరోపణను ఎదుర్కొన్నారు. ఒంగోలులోని రిమ్స్ ఆవరణలో జరిగిన రాజకీయ ఘర్షణలో, వెంగముక్కలపాలెంలో పోలింగ్ కేంద్రం వద్ద జరిగిన ఘర్షణలోనూ పోలీసుశాఖ అప్పటి అధికారపార్టీకి అనుకూలంగా వ్యవహరించిందన్న అపవాదును మూటగట్టుకుంది. తాలూకా సీఐపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు తీసుకున్నప్పటికీ, ప్రస్తుతం డీఎస్పీని బదిలీ చేసి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడం గమనార్హం. దర్శి డీఎస్పీగా కర్నూలు జిల్లాలో సీఐడీలో ఉన్న లక్ష్మీనారాయణకు అవకాశం ఇవ్వడంలో కూడా ఆంతర్యం లేకపోలేదు. వైసీపీ ప్రభుత్వం ఉన్నంత కాలం పక్కనపెట్టిన రాయపాటి శ్రీనివాసరావుకు ఒంగోలు డీఎస్పీగా అవకాశం ఇవ్వాలని భావించగా, గుంటూరు జిల్లాలో ఆయన అవసరం ఉందన్న కారణంతో తాత్కాలికంగా పోస్టింగ్ ఇవ్వలేదని తెలిసింది. మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావును కూడా హెడ్‌క్వార్టర్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కువకాలం పనిచేసి గత వైసీపీ ప్రభుత్వంలో అప్రధాన్య పోస్టులో ఉన్న ఘట్టమనేని శ్రీనివాసరావును మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే అభ్యంతరం చెప్పినా నెల్లూరు రూరల్‌కు డీఎస్పీగా నియమించారు. బుధవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత వచ్చిన కొన్ని సీఐల పోస్టింగ్‌ల విషయంలోనూ అదే పంథా కనిపించింది. ఒంగోలు తాలూకాకు నియమించిన సీఐ అజయ్‌కుమార్, వన్‌టౌన్‌కు నియమితులైన వై.నాగరాజు, సింగరాయకొండ సీఐగా నియమితులైన హజరత్తయ్య, మార్టూరు సీఐగా నియమితులైన ఎన్.శేషగిరిరావు, చీరాల వన్‌టౌన్‌కు బదిలీ అయిన మారేడు శ్రీనివాసరావు, సంతమాగులూరు సీఐగా నియమితులైన కాకుమాను వెంకట్రావు కూడా ఇప్పటివరకూ వీఆర్‌లోనూ, ప్రాధాన్యం లేని పోస్టుల్లో ఉన్నవారే. గత ప్రభుత్వం వారిని కావాలని పక్కనపెట్టింది. కూటమి ప్రభుత్వం గుర్తించి వారికి కీలక సర్కిళ్లను అప్పగించింది. స్థానికంగా మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫార్సు చేసినా సదరు అధికారుల గత పనితీరును పరిశీలించిన తర్వాతే పోస్టింగ్‌లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. అందువలన కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు చేసిన సిఫార్సులు కూడా చెల్లడం లేదని సమాచారం. చీమకుర్తి సీఐగా గతంలో ప్రచారం జరిగినట్లు హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ సిఫారసు చేసిన సుబ్బారావుకే దక్కింది.

## దర్శి డీఎస్పీగా లక్ష్మీనారాయణ

● ముగ్గురు డీఎస్పీలు హెడ్‌క్వార్టర్‌కు అటాచ్‌మెంట్



ఒంగోలు(క్రైం), జూలై 31: రాష్ట్రంలో భారీగా డీఎస్పీ బదిలీలు జరిగాయి. జిల్లాలో దర్శి డీఎస్పీగా ప్రస్తుతం సీఐడీలో పనిచేస్తున్న డి.లక్ష్మీనారాయణను నియమిస్తూ బుధవారం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దర్శిలో పనిచేస్తున్న పి.అశోక్‌వర్ధన్, మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు, ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబులను హెడ్‌క్వార్టర్‌లో అటాచ్‌మెంట్ చేయాల్సిందిగా ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. కనిగిరి డీఎస్పీగా పనిచేస్తున్న రామరాజు రిటైర్‌మెంట్ గడువు కేవలం నెలరోజులు మాత్రమే ఉండటంతో ఆయన్ని ప్రస్తుతానికి బదిలీ చేయలేదు. ఒంగోలు, మార్కాపురం డీఎస్పీలను ఇంకా నియమించాల్సి ఉంది.

## కేజీబీవీలో విద్యార్థిని ప్రసవం

● బాత్‌రూంలో శిశువు మరణం

● బాలికను రిమ్స్‌కు తరలించిన పోలీసులు

కొత్తపట్నం(ఒంగోలు నగరం)జూలై 31 : చదువుకుంటున్న బాలిక గర్భం దాల్చి పాఠశాలలోనే ప్రసవమైన ఘటన ప్రకాశం కొత్తపట్నం మండలం పాదర్తి కేజీబీవీ పాఠశాలలో బుధవారం జరిగింది. ఈ వ్యవహారంపై అధికారులు సీరియస్‌గా స్పందించారు. బాలికను వెంటనే ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న 16ఏళ్ల బాలిక క్యాంపస్‌లోని బాత్‌రూమ్‌లోనే ప్రసవించింది. ఆ తర్వాత దాదాపు రెండు మూడు గంటలపాటు అందులోనే ఉండిపోయింది. దీంతో ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు బాత్‌రూమ్‌లోకి తొంగిచూడటంతో ప్రసవించిన విషయం బయటకు తెలిసింది. బాలికను బయటకు రప్పించి విచారించారు. చీమకుర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక జూన్ 19వతేదీన పాదర్తి వద్ద ఉన్న కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరింది. చేరిన తర్వాత వారంరోజుల పాటు హోమ్‌సిక్ పేరుతో ఇంటికి పోయి తిరిగి పాఠశాలకు వచ్చింది. రోజూ తరగతులకు హాజరవుతూనే ఉంది. బుధవారం ఉదయం 11గంటల సమయంలో బాత్‌రూమ్‌లోకి పోయి ప్రసవించిందని కళాశాల ప్రిన్సిపాల్, ఇతర ఉపాధ్యాయులు చెబుతున్నారు. స్థానిక మహిళా పోలీసు ద్వారా విషయం తెలుసుకున్న కొత్తపట్నం ఎస్ఐ సాంబశివరావు కేజీబీవీకి వెళ్లి విచారణ జరిపారు. కొత్తపట్నం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వైష్ణవి పాఠశాలకు వెళ్లి బాలికకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర, రిమ్స్ వైద్యశాల సిబ్బంది అక్కడకు చేరుకుని వి వరాలు సేకరించారు. కాగా బాలిక తొమ్మిది నెలల గర్భవతిగా కళాశాలలోనే రెండు నెలల పాటు చదువు కొనసాగిస్తుండగా ఆ విషయాన్ని పాఠశాల సిబ్బంది ఎందుకు గుర్తించలేకపోయారు అనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రసవానికి ముందు పడే వేదన అంతా ఇంతా కాదు. ఆ సమయంలో కూడా బాలిక నొప్పులు పడుతున్న విషయం కూడా తమకు తెలియదని పాఠశాల సిబ్బంది చెబుతున్నారు. బాలిక బాత్‌రూమ్‌కు పోయి గంటల తరబడి రాకపోయేసరికి వెళ్లిచూడగా అసలు విషయం తెలిసిందని కళాశాల ప్రిన్సిపాల్ అంటున్నారు. అప్పటి వరకు తమకు ఆ బాలిక గర్భవతి అని తెలియదని అంటున్నారు. కాగా బాలికను వైద్యం కోసం రిమ్స్ వైద్యశాలకు తరలించిన అధికారులు పూర్తి వివరాలు తెలుసుకుంటున్నారు. బాలిక చీమకుర్తి మండలానికి చెందిన కారణంగా చీమకుర్తి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.



వివరాలు సేకరిస్తున్న అధికారులు

## కాపు, బలిజ సంక్షేమ సేన పార్లమెంట్ అధ్యక్షుడిగా కోటయ్య



చినగంజాం, జూలై 31 : మండలంలోని సోపిరాల గ్రామానికి చెందిన శిఖరం కోటయ్య కాపు, బలిజ సంక్షేమ సేన బాపట్ల జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. కాపు, బలిజ సంక్షేమ సేన సంఘం జిల్లా అధ్యక్షుడు తరణి గోపాలకృష్ణ బుధవారం కోటయ్యకు నియామకపత్రం అందజేశారు. కాపు, బలిజ సంక్షేమ సేన ఎగ్జిక్యూటివ్ కమిటీ తీర్మానం ప్రకారం కోటయ్యను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కోటయ్య మాట్లాడు తూ కాపు, బలిజ సంక్షేమ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. కోటయ్యను సోపిరాల గ్రామ పెద్దలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అభినందనలు తెలిపారు.

## ఇంటర్ పాఠ్యపుస్తకాలు సిద్ధం

ఇంకొల్లు, జూలై 31 : ఇంకొల్లు మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం అందజేయనున్న పాఠ్యపుస్తకాలు సిద్ధంగా ఉన్నట్లు ఎంఈవో అజయ్‌బాబు తెలిపారు. అందరికీ పుస్త కాలు అందేలా చూడాలని సూచించారు.

# మొరాయిస్తున్న బస్సులు

- కాలంచెల్లిన ఆర్టీసీ వాహనాలు
- ప్రయాణికులకు అవస్థలు



అద్దంకి బస్టాండ్‌లో వినుకొండ డిపోకు చెందిన బస్సును నెడుతున్న ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులు

అద్దంకి, జూలై 31 : కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వినుకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు ఇటీవల తరచూ మొరాయిస్తున్నాయి. పక్షం రోజుల వ్యవధిలోనే అద్దంకి పట్టణంలో రెండు సార్లు వినుకొండ డిపో బస్సులు మొరాయించాయి. అంబేడ్కర్ బొమ్మ సెంటర్‌లో రోడ్డు మధ్యలో బస్సు నిలిచిపోగా, షాపుల నిర్వాహకులు దానిని పక్కకు నెట్టారు. బుధవారం మధ్యాహ్నం వినుకొండ డిపోకు చెందిన బస్ అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో మొరాయించడంతో ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులు బస్సును నెట్టారు. దూరప్రాంతం రూట్‌లలో సైతం కాలం చెల్లిన బస్సులనే నడుపుతుండడంతో మార్గమధ్యంలో ఎక్కడా నిలిచిపోతాయోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. వినుకొండ నుంచి ఒంగోలుకు సుమారు 80 కి.మీ దూరం ఉండగా వినుకొండ డిపో నుంచి నడిపేవాటిలో అత్యధిక శాతం కాలం చెల్లిన బస్సులు ఉన్నాయని, ప్రయాణం కూడా నరకప్రాయంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి కాలం చెల్లిన వాహనాల నిలిపివేసి వాటి స్థానంలో కొత్త బస్సులను ఆయా రూట్లలో నడపాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న సిబ్బంది

## చినగంజాం తహసీల్దార్‌గా ప్రభాకరరావు

చినగంజాం, జూలై 31 : చినగంజాం తహసీల్దార్‌గా జీవిగుంట ప్రభాకరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్ర బాబు బదిలీపై గుంటూరు పశ్చిమకు బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గుంటూరు జిల్లా నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ప్రభాకరరావు పనిచేశారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ ప్రభాకరారావుకు కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ దాసరి శ్రీకాంత్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కే.నాగకుమార్, గ్రామ రెవెన్యూ అధికారులు నాగిరెడ్డి నాగరాజు, షేక్ మున్నీర్, బండారు దానియల్, పి.నాగరాజురెడ్డి, ఆమంచి సత్యనారాయణ, శ్రీదేవి, షేక్. బాషా, మోహన్‌రావు, పీతా ఏడుకొండలు, చెంచుపున్నమ్మ, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

### యద్దనపూడి తహసీల్దార్‌గా రవికుమార్



రవికుమార్‌ను అభినందిస్తున్న ఉద్యోగులు

యద్దనపూడి, (మార్టూరు) జూలై 31 : యద్దనపూడి తహసీల్దార్‌గా కే రవికుమార్ బుధవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన తహసీల్దారు వై.నాగరాజు బదిలీ కాగా అతని స్థానంలో రవికుమార్ వచ్చారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్‌కు డీటీ మస్తానరావు, ఆర్‌ఐ విష్ణు, రెవెన్యూ ఉద్యోగులు పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అదేవిధంగా మార్టూరు మండల తహసీల్దారు సంధ్యశ్రీ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ కాగా వారి స్థానంలో సంతమాగులూరు మండలం నుంచి టీ ప్రశాంతి మార్టూరుకు బదిలీ అయ్యారు. ఆమె గురువారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

### చీరాల తహసీల్దార్‌గా గోపీకృష్ణ



చీరాలటౌన్, జూలై 31 : చీరాల తహసీల్దార్‌గా కె. గోపీకృష్ణ నియామకమయ్యారు. ఈమేరకు మంగళవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. గతంలో గోపీ కృష్ణ బాపట్ల కలెక్టరేట్‌లో ఏవోగా పని చేస్తున్నారు. అయితే ఎన్నికల విధుల్లో భాగంగా నెల్లూరు జిల్లా చేజెర్ల మండల తహసీల్దార్‌గా వెళ్లారు. అలాగే ఎన్నికల విధులకు పురమాయించిన అధికారులను తిరిగి పాత జిల్లాలకే పిలవడంతో చీరాలకు నియామకమయ్యారు. మరికొద్ది రోజులలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

## బాధ్యతగా పనిచేయండి : ఎమ్మెల్యే కొండయ్య



ఎమ్మెల్యేకు మొక్కను అందజేస్తున్న తహసీల్దార్ పార్వతి

వేటపాలెం(చీరాల), జూలై 31 : ప్రజలతో మర్యాదగా నడుచుకోండి. బాధ్యతగా పనిచేయండని ఎమ్మెల్యే కొండయ్య తహసీల్దార్ పార్వతికి చెప్పారు. వేటపాలెం మండల నూతన తహసీల్దార్‌గా నియమితులైన పార్వతి బుధవారం ఎమ్మెల్యే కొండయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కను అందజేశారు. కొండయ్య మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరైనా ప్రజా ప్రయోజనాలే అంతిమ లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు.

## ఎస్‌ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రదర్శించాలి

అద్దంకిటౌన్, జూలై 31 : అద్దంకి మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులందరూ గురువారం 10 గంటలకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ బోర్డులో ప్రదర్శించాలని ఎంఈవోలు డి. గంగాధరరావు, బి. సుధాకరరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఓటరు జాబితాలను తయారుచేసి నోటీసు బోర్డులో ప్రదర్శించాలని సూచించారు.

## పింఛన్ల పంపిణీకి 250 మంది సిబ్బంది

పంగులూరు, జూలై 31 : మండలంలోని 14 సచివాలయాల పరిధిలోని 21 గ్రామ పంచాయతీలలో గురువారం నూరు శాతం పింఛన్‌లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో మాధ్యూబాబు తెలిపారు. ఇందుకోసం 250 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. మొత్తం 7,984 మందికి 3 కోట్ల 24 లక్షల, 94 వేల 500 రూపాయలను వివిధ క్యాటగిరీలవారీ పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

## తహసీల్దార్ మెహర్‌బాబుకు సత్కారం



మెహర్ బాబును సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కారంచేడు(పర్చూరు), జూలై 31 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కారంచేడు మండలంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహించి బదిలీపై తన సొంత జిల్లాకు వెళుతున్న మెహర్‌బాబును బుధవారం రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్వీ రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెహర్‌బాబు మాట్లాడుతూ సిబ్బంది సహకారంతోనే తాను ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించానని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుశీలాదేవి సిబ్బంది పాల్గొన్నారు.

## ద్విచ క్రవాహనం బోల్తా - ఒకరికి గాయాలు

బల్లికురవ, జూలై 31 : ద్విచ క్రవాహనం బోల్తా పడి ఒకరికి గాయాలు అయ్యాయి. అందిన వివరాల మేరకు మండలంలోని కొమ్మినేనివారిపాలెం వద్ద అద్దంకి బ్రాంచి కాలువ సమీపంలో బుధవారం వలపర్లకు చెందిన ఆవుల శ్రీను వైదన వెళ్లి వస్తుండగా మోటార్ సైకిల్ అదుపు తప్పి పడిపోయింది. తీవ్రగాయాలైన శ్రీనును వలపర్లలో ప్రవేట్ వైద్యశాలకు తరలించారు.

## చికిత్స పొందుతున్న యువకుడు మృతి

అద్దంకి, జూలై 31 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు అంకరాజు(28) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. ముండ్లమూరు మండలం పోలవరానికి చెందిన అంకరాజు అద్దంకిలో చెల్లెలు వద్ద వైద్య చికిత్స కోసం ఉన్న తండ్రి వద్దకు వచ్చి సోమవారం రాత్రి అద్దంకి నుంచి పోలవరం మోటార్ సైకిల్ పై వెళ్తూ తిమ్మాయపాలెం సమీపంలో ముందు వెళ్తున్న మోపెడ్‌ను ఢీకొట్టాడు. తీవ్రగాయాలైన అంకరాజు అద్దంకి ఆసుపత్రికి, అనంతరం ఒంగోలు వైద్యశాలకు, అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రా త్రి మృతి చెందడంతో అక్కడ నుంచి స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం వచ్చింది. అంకమ్మరాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

## శ్రీనివాసరావు సేవలు అభినందనీయం

బల్లికురవ, జూలై 31 : ఉపాధ్యాయ వృత్తిలో 35 ఏళ్ల పనిచేసి ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన యద్దనపూడి శ్రీనివాసరావు సేవలు అభినందనీయం అని బల్లికురవ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతురావు అన్నారు. పాఠశాలలో పనిచేస్తున్న సోషల్ టీచర్ యద్దనపూడి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ వీడ్కోలు సభ బుధవారం పాఠశాలలో జరిగింది. ఈసందర్భంగా శ్రీనివాసరావుకు తోటి ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఆయన సేవలు, మంచితనాన్ని గుర్తుచేశారు. ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఇష్టంతో క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని సూచించారు.

## అంగన్‌వాడీ కేంద్రంలోకి పాములు

భయాందోళన చెందుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



పాములు రాకుండా కాపలాగా కూర్చున్న ఆయా



దట్టంగా ఉన్న పిచ్చిచెట్లు

బల్లికురవ, జూలై 31 : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో ఉన్న అంగన్ వాడీ కేంద్రంలోకి మంగళవారం నాలుగు పాములు వచ్చాయి. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళనకు గురయ్యారు. బుధవారం అంగన్ వాడీ కేంద్రానికి వచ్చిన విద్యార్థులను లోపల కుర్చోబెట్టి పాములు రాకుండా తలుపుల వద్ద ఆయా కాపాలాగా కూర్చున్నారు. కేంద్రం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఉందని ఆ స్థలంలో పెద్ద పెద్ద తుమ్మ పొదలు, గడ్డి ఉండడంతో పాములు తిరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. అంగన్‌వాడీ బడిలోకి నాలుగు పాము పిల్లలు రాగా, మూడింటిని ప్రజలు చంపి వేశారని ఒకటి తప్పించుకు పోయిందని, ఇలా అయితే కేంద్రానికి చి న్నారులను పంపాలంటే భయమేస్తుందని తెలిపారు. వెంటనే గ్రామ పంచాయతీ, పాఠశాల పేరెంట్స్ కమిటీ వారు పొదలను తొలగించి గడ్డి మందు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## అంగన్‌వాడీకి స్టీల్ ప్లేట్లు, గ్లాసుల అందజేత



స్టీల్ ప్లేట్లను అందజేసిన సభ్యులు

అద్దంకిటౌన్, జూలై 31 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రానికి స్టీల్ ప్లేట్లు, గ్లాసులను అందజేశారు. ఈక్రమంలో ఆళహరి వెంకట సుబ్బయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఆళహరి హరి ప్రసాద్ సౌజన్యంతో అద్దంకి పట్టణంలోని ఇందిరానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి విద్యార్థులు, తల్లులు, గర్భిణులకు భోజనం చేసుందుకు 30 స్టీల్ ప్లేట్లు, 30 స్టీల్ వాటర్ గ్లాసులు, నాలుగు కుర్చీలను అందజేయడం అభినందనీయమని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. ఈ సందర్భంగా దాత ఆళహరి హరిప్రసాద్‌ను రోటరీ క్లబ్ సభ్యులు అంగన్‌వాడీ కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి చుండూరి మురళిసుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, చిన్ని మురళీకృష్ణ, జ్యోతి చంద్రమౌళి, శ్రీనివాసరావు, ఊటుకూరి రామకోటేశ్వరరావు, పి.ఆంజనేయులు, నర్రా శ్రీలక్ష్మి, కార్తీక్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోటేరియన్, పురావస్తు పరిశోధకులు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి 74వ పుట్టిన రోజును రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి వేడుకలు జరుపుకోవడంతో పాటు చంద్రమౌళి ఉపాధ్యాయుడుగా, పురావస్తు పరిశోధకుడుగా, రచయితగా అందించిన సేవలను సభ్యులు కొనియాడారు.

## లక్ష్మికి మంత్రి గొట్టిపాటి నివాళి

ఇంకొల్లు, జూలై 31 : మండలంలోని నాగండ్ల గ్రామానికి చెందిన సినీ నిర్మాత చెరుకూరి సుధాకర్, ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ మాతృమూర్తి లక్ష్మికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నివాళులర్పించారు.నాగండ్లలో బుధవారం సుధాకర్ ఇంట్లో జరిగిన లక్ష్మీ మొదటి వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లక్ష్మి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట జడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరగంధం ఆంజనేయులు, నాగండ్ల టీడీపీ నాయకులు ఉన్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి రవికుమార్

# మోడల్ స్కూల్ ఆకస్మిక తనిఖీ

- హాస్టల్‌లో సౌకర్యాలపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆగ్రహం
- విశ్రాంతి గదుల్లోకి సైతం వ్యర్థ జలాలు
- పేరుకున్న చెత్త, విష సర్పాల భయాందోళనలో విద్యార్థులు
- తీరు మార్చుకోవాలంటూ హెచ్చరిక



హాస్టల్ చుట్టూ పిచ్చిచెట్లు



విశ్రాంతి గదిలోకి చేరిన వ్యర్థ జలాలు

చీరాలటౌన్, జూలై 31 : చీరాల మండల పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్‌ను బుధవారం బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బి.పద్మావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా అపరిశుభ్రంగా ఉన్న వంట గది, ఇతర గదులు, పరిసరాలను నిశితంగా పరిశీలించారు. ప్రిన్సిపాల్ సరళ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యానేకథల సామర్థ్యానికి సరిపడా తాగునీరు లేకపోవడంపై అసహనం చెందారు. అలాగే కంప్లైంట్ బాక్స్ ఇసుకలో కూరుకుపోయి ఉన్నట్లు గుర్తించారు. హాస్టల్ ఆవరణలో చిల్ల చెట్లు పేరుకుపోవడం తీరును గమనించి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై సమస్యలను అడిగి తెసుకున్నారు. వారి సమస్యలను విని ఆమె నివ్వెరపోయారు. అనంతరం మాట్లాడుతూ స్కూల్ సౌకర్యాలపై అందిన ఫిర్యాదుల మేరకే ఆకస్మికంగా తనిఖీ జరిగినట్లు తెలిపారు. స్కూల్ పరిసరాల్లో విష సర్పాల కదలికలు ఉన్నట్లు విద్యార్థులు చెప్పినట్లు పేర్కొన్నారు. పిల్లల ఆరోగ్యంతో చెలగాట మాడరాదన్నారు. వేగవంతంగా వారి సమస్యల పరిష్కార దిశగా సిబ్బంది అడుగులు వేయాలని లేకుంటే ఉపేక్షించేదని సూచించినట్లు చెప్పారు. ఆమె వెంట ఎమ్‌ఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు, జిల్లా బాలల సంక్షేమ కమిటీ విభాగం సభ్యురాలు నీలిమ, పరిరక్షణ విభాగం అధికారిణి స్వప్నప్రియ స్కూల్ సిబ్బంది ఉన్నారు.



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పద్మావతి



గోడౌన్‌లో స్టాక్‌ను పరిశీలిస్తున్న డీఎస్‌వో విలియమ్స్

## రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా

డీఎస్‌వో విలియమ్స్

అద్దంకి, జూలై 31 : పేద ప్రజలకు చేరాల్సిన రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు రాత్రి సమయాలలో ప్రత్యేక నిఘా పెట్టినట్లు డీఎస్‌వో విలియమ్స్ తెలిపారు. అద్దంకి పట్టణంలోని మార్కెట్ యార్డులో ఉన్న సివిల్ సప్లయిస్ గోడౌన్‌ను బుధవారం విలియమ్స్ పరిశీలించారు. స్టాక్‌నును పరిశీలించారు. ఈ సందర్భంగా విలియమ్స్ మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన బియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. బియ్యం సరఫరా లో తూకాలలో వ్యత్యాసం లేకుండా ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రేషన్ దుకాణాలను ప్రతి మూడు రోజులకు ఒక సారి వీఆర్‌వోలు తనిఖీ చేసి తహసీల్దార్లకు నివేదిక ఇవ్వాల్సి ఉంటుందన్నారు. రేషన్ సరుకుల పంపిణీలో ఎలాంటి లోపాలు లేకుండా కార్డుదారులకు అందించడమే లక్ష్యం పనిచేస్తున్నామన్నారు.

## వేటపాలెం పీహెచ్‌సీకి వైద్యుల నియామకం

వేటపాలెం(చీరాల), జూలై 31 : వేటపాలెం పీహెచ్‌సీలో వైద్యుడు డాక్టర్ బాలరాజు, ఫార్మసిస్టు వెంకట ప్రసాద్, ఇతర సిబ్బంది మధ్య నెల కొన్న వరుస వివాదాల నేపథ్యంలో వారిని అక్కడి నుంచి బదిలీ చేస్తూ డీఎంహెచ్‌వో డాక్టరు విజయమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. వారి స్థానంలో చీరాల పీపీ యూనిట్‌లో పనిచేస్తున్న డాక్టర్ స్వాతి కిరణ్, డాక్టర్ సాయి వైష్ణవి, స్టాఫ్ నర్స్ నాగమణిలను వేటపాలె పీహెచ్‌సీకి తాత్కాలికంగా బదిలీ చేశారు. ఇప్పటి వరకు వేటపాలెం పీహెచ్‌సీ ఇన్ చార్జి డీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఈపురుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ శ్రీదేవిని ఆ బాధ్యతలను డాక్టర్ స్వాతికిరణ్‌కు అప్పగించాలని ఉత్తర్వులు ఇచ్చారు.

## సభ్యత్వాల నమోదుకు 5వరకు గడువు

చీరాల, జూలై 31 : జనసేన పార్టీ సభ్యత్వాల నమోదుకు ఈ నెల 5వ తేదీ వరకు గడువును పొడిగించారని ఆ పార్టీ సెంట్రల్ ఆంధ్ర ప్రోగ్రామ్ కన్వీనర్, చీరాల నియోజకవర్గ సభ్యత నమోదు కార్యక్రమ పరిశీలకుడు ఆల అనిల్ బుధవారం తెలిపారు. ఈ క్రమంలో పార్టీ శ్రేణులు క్రియాశీలకంగా పనిచేస్తూ సభ్యత్వాల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. 4వ విడత సభ్యత్వ నమోదులో చీరాల నియోజకవర్గాన్ని బాపట్ల జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్ కార్యాచరణపై సమిష్టిగా అడుగులు వేద్దామని అనిల్ పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

## రామాయణగాథ అంటే ఇష్టం

అద్దంకిటౌన్, జూలై 31: తెలుగు కవులకు రామాయణగాథ అంటే ఇష్టం అని శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం స్థానిక కమలేశ్వరస్వామి ఆలయంలో సృజన సాహిత్య సమావేశం ఇలపావులూరి శేషతల్పసాయి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మహాకవి ఎర్రన రచించిన రంగనాథ రామాయణ కావ్యం రచించారని, అలాంటి మహా భాస్కర రామాయణం, రంగనాథ రామాయణం, తిక్కన నిర్వచనోత్తర రామాయణం, కంకంటి పాపరాజు ఉత్తర రామాయణం, మొల్ల రామాయణం కల్పవృక్షం వంటి కావ్యాలు తెలుగువారు భక్తి ప్రపత్తులతో చదువుతారని వక్తలు గుర్తు చేశారు. రంగనాథ రామాయణం జన సామాన్యంలో ప్రచారంలో ఉన్న గ్రంథం అన్నారు. ఈ కార్యక్రమంలో లక్కరాజు శ్రీనివాసరావు, డాక్టర్ యు.దేవపాలన, డీవీఎం సత్యనారాయణ, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, గాడేపల్లి దివాకర్ దత్తు, పాలపర్తి జ్యోతిష్మతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల పదివి విరమణ చేసిన ఆర్‌వీ రాఘవరావును వీరవల్లి సుబ్బారావు(రుద్రయ్య) నేతృత్వంలో ఘనంగా సన్మానించారు.

## ట్రాక్టర్ పైకి ఎక్కిన లారీ



ట్రాక్టర్ పైకి ఎక్కిన లారీ


మేదరమెట్ల, జూలై 31 : జాతీయ రహదారిలో మేదరమెట్ల బైపాస్‌లో పొగాకు చెక్కుల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను లారీ టాలర్ ఢీకొట్టింది. బుధవారం అ ద్దంకి మండలం వెంకటాపురానికి చెందని బీ శేషారెడ్డి మధ్యాహ్నం పోగాకు బోర్డు నుంచి ట్రాక్టర్‌పై చెక్కులను ట్రాక్టర్‌పై వేసుకుని వెళ్తుండగా హైవే నుంచి హైదరబాద్ వెళ్లడానికి సర్వీస్ రోడ్డులో వెళ్తూన్న లారీ టాలర్ డ్రైవర్ నిద్రమత్తు కారణంగా హైవేలో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. రెండు రోడ్డుల మధ్యలో ఉన్న కాలువలోకి ట్రాక్టర్ పూర్తిగా ఎక్కి పోయింది. ట్రాలర్ ట్రాక్టర్ పైకి ఎక్కంది. ఈ ప్రమదంలో శేషారెడ్డి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయా లయ్యాయి. 108 అంబులెన్స్‌లో శేషారెడ్డిని ఒంగోలు తరలించారు. సంఘటన స్థలాని పోలీసులు పరిశీలించారు.

# సంఘటితంతోనే చేనేత రంగం అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

చీరాలటౌన్, జూలై 31 : చేనేతలంతా సంఘటితంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని పలువురు చేనేత నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర చేనేత జన సమైక్య ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గడియార స్థంభం కూడలిలో బహిరంగ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ చేనేత పరిశ్రమను రక్షించుకోవాలని, వారు ఎదుర్కొనే సమస్యల నుంచి నివృత్తి పొందాలనే లక్ష్యంతో కార్యక్రమం తలపెట్టినట్లు వివరించారు. జూలై 31వ తేదీని జాతీయ చేనేత పరిరక్షణ దినంగా పాటించాలని వివరించారు. పవర్ లూమ్స్ విధానంతో తయారు చేస్తున్న చీరలను చేనేత చీరలుగా విక్రయిస్తున్న నేపథ్యంలో చేనేత రంగం దెబ్బతింటున్నట్లు పేర్కొన్నారు. ఈక్రమంలోనే మాస్టర్ వీవర్స్, సహకార సంఘాల ప్రతినిధులు కార్మికులకు ఉపాధి కల్పించలేక పోతున్నట్లు చెప్పారు. ఇలానే అనేక విధాలుగా వ్యవస్థ పరిస్థితి దయనీయంగా ఉందని అన్నారు. కావున ప్రతి ఒక్కరూ కలసి కట్టుగా ముందుగా సాగి విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు మాచర్ల మోహన్‌రావు, సజ్జా హేమలత, బీరక సురేంద్ర, దామర్ల శ్రీకృష్ణ, చుండూరి వాసు, కాటూరి వెంకటేశ్వర్లు, కర్ణ లక్ష్మారావు, వీర నాగేశ్వరరావు, శీలం రవి తదితరులు పాల్గొన్నారు.




## 'కామధేను'లో 115 పశువుల వేలం



**కొండాపురం, జూలై 31 :** చింతలదీవి కామధేను పునరుత్పత్తి కేంద్రంలో బుధవారం పశువుల వేలం జరిగింది. మొత్తం 182 పశువులకు వేలం నిర్వహించగా 66 ఆవులు, 49 గేదెలను రైతులు దక్కించుకున్నారు. సమయాభావం కావడంతో మరోసారి వేలం నిర్వహిస్తామని ఆ కేంద్రం జేడీ వెంకటేష్ తెలిపారు. ఈ వేలంలో పశుసంవర్ధక శాఖ కావలి డివిజన్ అసిస్టెంటు డైరెక్టర్ మంగేశ్వరరావు, సీఎల్ఎఫ్ డీడీ పెద్దస్వామి, ఏడీలు రామన్, దేవరాజ్, శైలజ పాల్గొన్నారు.






## సరస్వతీ నిలయాల్లో

# పదవుల పోరు

- నేటి నుంచి ఎస్ఎంసీ ఎన్నికల ప్రక్రియ
- నేడు నోటిఫికేషన్ విడుదల, 8న ఓటింగ్
- వైసీపీ హయాంలో ఏకపక్ష ధోరణి
- అనుచరులనే చైర్మన్ చేయాలని ఆదేశాలు
- 2,295 పాఠశాలలో కమిటీల ఏకగ్రీవం
- ఎన్డీయే హయాంలోనైనా సజావుగా సాగేనా!?

**పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాములను చేయడానికి ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించింది. గత వైసీపీ ప్రభుత్వం పేరెంట్ మానటరింగ్ కమిటీ పేరుతో నిర్వహించిన ఎన్నికలను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలుగా మార్పు చేసింది. ఈ మేరకు ఎస్ఎంసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి నాడు-నేడు, తల్లికి వందనం, విద్యాకానుకలతోపాటు తదితర అంశాలను ఈ కమిటీ పర్యవేక్షించేలా ఆదేశాలు జారీచేసింది. గురువారం నోటిఫికేషన్ విడుదల చేసి, ఓటర్ల జాబితాలను ప్రకటించనున్నారు. అయితే గత ప్రభుత్వంలో ఈ ఎన్నికలు ఏకపక్షంగా వైసీపీ నేతల కనుసన్నల్లో జరగ్గా ఎన్డీఏ ప్రభుత్వంలోనైనా ఈ ఎన్నికలు సజావుగా జరుగుతాయా లేదా పాత పద్ధతిలోనే జరుగుతాయా అన్న సందిగ్ధత అందరిలో నెలకొంది.**

**నెల్లూరు (విద్య), జూలై 31 :** జిల్లాలో గతంలో 2,688 ప్రాథమిక, 361 ప్రాథమికోన్నత, 418 ఉన్నత పాఠశాలలు మొత్తం 3,467 బడులు ఉండగా వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెం 117తో పలు పాఠశాలలు మూతపడ్డాయి. దీంతో ఈ విద్యాసంవత్సరంలో జిల్లాలో 2,595 పాఠశాలలు నడుస్తున్నాయి. గతంలో జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో వైసీపీ నేతల ప్రోద్బలం, తమకు నచ్చిన వారిని ఎంపిక చేసుకోవడంతో 2,295 పాఠశాలల్లో కమిటీలు ఏకగ్రీవంగా ఎంపికయ్యాయి. ప్రస్తుతం గడువు ముగియడంతో ఈ విద్యా సంవత్సరం నుంచి రెండేళ్ల కాలపరిమితికి జరిగే ఎన్నికలకు ఎస్ఎస్ఏ, జిల్లా విద్యాశాఖలు కలిసి సంయుక్తంగా ఏర్పాట్లు చేస్తున్నాయి. ప్రతి పాఠశాలలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు. వారి వివరాలతో కూడిన జాబితాను పాఠశాలతోపాటు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనూ ప్రదర్శిస్తారు. విడులైన షెడ్యూల్ ప్రకారం తల్లిదండ్రుల అభ్యంతరాలను కూడా స్వీకరించి చేతులెత్తే పద్ధతి ద్వారా ఎన్నికలు జరపనున్నారు.

**● ఎన్నికల షెడ్యూలు ఇలా..**

విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఆగస్టు 1వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసి ఓటర్ల జాబితాలను ప్రకటిస్తారు. 5వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటర్ల జాబి తాలపై అభ్యంతరా లను స్వీకరిస్తారు. అదే రోజు సాయం త్రం 3 నుంచి 4 గంటల మధ్య తుది ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు పరిష్క రించి ఫైనల్ జాబితా విడుదల చేస్తారు. 8వ తేదీ ఉదయం 7 నుంచి 1 గంట వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. 3 నుంచి 4 గంటల సమయంలో ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి తొలి సమావేశం నిర్వహిస్తారు.

**సజావుగా నిర్వహిస్తాం**

ఎస్ఎంసీ ఎన్నికలను జిల్లాలో సజావుగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఎన్నికల్లో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా తల్లి దండ్రులే ఎన్నికల్లో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నాము. పునర్నిర్మాణ ప్రక్రియలో అంతరాయం కలిగినా, కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాము. అవసరమైన ప్రాంతాల్లో కలెక్టర్ అనుమతితో పోలీసుల పర్యవేక్షణలో ఎన్నికలు జరుపుతాము.

**- ఉషారాణి, ఎస్ఎస్ఏ ఏపీసీ**

**● సజావుగా జరిగేనా!?**

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఈసారైనా సజావుగా జరిగేనా అన్న సందేహాలు అందరిలో నెలకొన్నాయి. గతంలో పాఠశాలల తల్లిదండ్రుల కమిటీ పాలకవర్గాల గడువు ముగియడంతో ఎన్నికలు నిర్వహించ కుండా పాతవారి పదవీకాలనే పొడగించారు. వైసీపీ హయంలో అధికార పార్టీకి చెందిన నేతలు తమ వర్గానికి చెందిన వారే చైర్మన్, సభ్యులుగా ఉండేందుకు పోటీపడ్డారు. పాఠశాలల్లో అభివృద్ధి పనులకు రూ.లక్షల్లో నిధులు మంజూరు కావడం, వీటిని కమిటీల ఆధ్వర్యంలోనే నిర్వహిస్తుండటంతో నాడు అందరి దృష్టి ఈ ఎన్నికలపై పడింది. దీంతో స్కూళ్లపై ఆధిపత్యం చెలాయిం చేందుకు రాజకీయ నేతలు సన్నద్ధమ య్యారు. ఎన్నికకు సంబంధించిన ఓటర్ల జాబితాను తమకు అంద చేయాలని, తాము కూడా కోఆప్షన్ సభ్యులే నంటూ హెచ్ఎంలతో వాగ్వి వాదాలకు దిగారు. తమ అనుచరులనే చైర్మన్‌లుగా చేయాలన్న లక్ష్యంతో చేసిన ప్రయత్నాలు పలు ప్రాంతాల్లో వివాదాలకు దారి తీశాయి. దీంతో గతంలో 2,295 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. వెయ్యి పాఠశాలల్లో మాత్రం ఎన్ని కలు నిర్వహించి సభ్యులను ఎన్నుకున్నారు. వివాదాలు, ఆరోపణల నేపథ్యంలో మరో 172 పాఠశాలల్లో ఎన్నికలు నిలిచిపోయాయి. ఏకగ్రీవమైన పాఠశాలల్లో తమకు నచ్చిన వారిని తరగతికి ముగ్గురు చొప్పున గరిష్ఠంగా 23 మందిని ఎంపిక చేసి మరో ఐదుగురు కోఆప్షన్ సభ్యులను నియమించారు. ప్రస్తుతం మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఎన్నికల్లో కూడా మార్పులు వస్తాయని తల్లిదండ్రులు, ఉపాధ్యాయు లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### విధుల నుంచి టీచరు తొలగింపు

**మర్రిపాడు :** ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్ర భుత్వ ఉపాధ్యాయుడిని శాశ్వతంగా విధుల నుంచి తొలగిస్తూ డీఈవో రామారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మర్రిపాడు మండలం పల్లిపాడు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు పెమ్మసాని శ్రీనివాసులు ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి వెంట తిరుగుతూ ఆత్మకూరు మండలం రావులకొళ్లు గ్రామంలో ప్రచారంలో పాల్గొన్నారు. అంతేగాక పోలింగ్ రోజున ఏజెంట్‌గా కూడా వ్యవహరించ డంతో టీడీపీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారించి ఆయన్ను శాశ్వతంగా విధుల నుంచి తొలగించారు.

## ఆలయాలకు ఇన్‌-చార్జి ఈవోల నియామకం

**నెల్లూరు (సాంస్కృతికం), జూలై 31 :** ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సస్పెండ్ అయిన ఐదుగురు ఈవోల స్థానంలో ఆయా ఆలయాలకు ఇన్‌చార్జి ఈవోలుగా ఇన్‌స్పెక్టర్లను నియమిస్తూ దేవదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వింజమూరు మండలం నల్లగొండ, గృహమల్లేశ్వర స్వామి ఆలయం, నగరంలోని ఇరుకళల పరమేశ్వరి ఆలయం, నార్తుమోపూరు గ్రూపు దేవాలయాలకు ఇన్‌చార్జి ఈవోగా ఆర్కే చైతన్యను నియమించారు. వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, దేవరపాలెం ఆలయాలను నెల్లూరు ఇన్‌స్పెక్టర్ సుధీర్, తమ్మినపట్నం కోదండరామస్వామి ఆలయం, సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయాలకు గూడూరు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులును నియమించారు.

**● యథాస్థానాలకు ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్లు**

**నెల్లూరు (హరనాథపురం) :** జిల్లాలో ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్లుగా పనిచేస్తున్న కొందరు సబ్ రిజిస్ట్రార్లను యథాస్థానాల్లో నియమిస్తూ జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు ఉత్తర్వులు జారీ చేశారు. కోవూరులో ఉన్న చంద్రశేఖర్‌రెడ్డిని యథాస్థానం బుచ్చిరెడ్డిపాళెంకు, బుచ్చిలో ఉన్న కోటేశ్వరమ్మను ఆమె యథాస్థానం ఆత్మకూరుకు బదిలీ చేశారు. అక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జీవీఎస్ ప్రసాద్‌ను కోవూరు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న మిల్కి రోషన్‌ను స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇన్‌చార్జిగా నియమించారు. ఇక్కడున్న ఉన్నం శ్రీనివాసులును ఈయన యథాస్థానం వెంకటగిరికి బదిలీ చేశారు.

**● విద్యుత్ శాఖ ఈఈల బదిలీ**

**నెల్లూరు (జడ్పీ) :** విద్యుత్ శాఖ నగర ఈఈ సోమశేఖర్‌రెడ్డిని రూరల్ డివిజన్ ఈఈగా బదిలీ చేస్తూ సీఎండీ ఉత్వర్వులను జారీ చేశారు. దీంతో ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. అలాగే నగర డీఈగా పని చేస్తున్న శ్రీధర్‌కు ఈఈగా పదోన్నతి కల్పించారు.

## మున్సిపాలిటీలకు మంచిరోజులు!

- రూ.1.7 కోట్ల బీపీఎస్ నిధులు విడుదల
- ఎన్డీయే ప్రభుత్వంలో దక్కిన వాటా
- కాలువల్లో పూడికతీతకు వాడాలని ఆదేశాలు



**నెల్లూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) :** మున్సిపాలిటీలకు మంచి రోజులొచ్చాయి. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు అందక కనీసం కాలువల్లో పూడిక కూడా తీసుకోలేని దయనీయస్థితిలోకి మున్సిపాలిటీలు జారుకున్నాయి. అయితే తాజాగా ఎన్డీయే ప్రభుత్వం మున్సిపాలిటీలకు నిధులు విడుదల చేసింది. చాలా కాలం నుంచి బిల్డింగ్ పీనలైజ్ స్కీం (బీపీఎస్) కింద వచ్చిన నిధుల్లో మున్సిపాలిటీలకు వాటా జమ కావడం లేదు. ప్రభుత్వమే ఆ నిధులన్నీ వాడుసుకుంటూ వచ్చింది. ఇటీవల రాష్ట్రస్థాయిలో మున్సిపాలిటీల పనితీరుపై సమీక్షించిన మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ దృష్టికి బీపీఎస్ వాటా విషయాన్ని తీసుకెళ్లారు. రానున్నది వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కాలువల్లో పూడిక తీయాలని ఆ సమావేశంలో నిర్ణయించారు. అయితే, అందుకు నిధుల కొరత ఉందని అధికారులు తెలియజేయడంతో వెంటనే మున్సిపాలిటీలకు అందాల్సిన బీపీఎస్ వాటాను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలోని నెల్లూరు కార్పొరేషన్ మినహా నాలుగు మున్సిపాలిటీలకు రూ.1.7 కోట్ల నిధులు జమ అయ్యాయి. కావలికి రూ.73 లక్షలు, ఆత్మకూరుకు రూ.23 లక్షలు, బుచ్చికి రూ.29 లక్షలు, కందుకూరుకు రూ.45 లక్షల చొప్పున నిధులు ఆయా మున్సిపాలిటీల ఖాతాల్లో చేరాయి. ఈ నిధులతో మొదటి ప్రాధాన్యతగా కాలువల్లో పూడిక తీయనున్నారు. మున్సిపాలిటీల్లో చాలా కాలం నుంచి కాలువల్లో పూడిక తీయకపోవడంతో ఎక్కడికక్కడ బ్లాక్ అయి పోయాయి. దీని మూలంగా వర్షపు నీరు, మురుగు బయటకు వెళ్లడం లేదు. అది ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలగజేస్తోంది. సీజనల్ వ్యాధులకు ఇదే ప్రధాన కారణంగా మారుతోంది. తాజాగా నిధులు రావడంతో ఆయా మున్సిపాలిటీల అధికారులు కాలువల్లో పూడికతీతకు ప్రతిపాదనలు రూపొందిస్తు న్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు మొదలుపెడతామని ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు తెలియజేశారు.

## జిల్లాలో పలువురు డీఎస్పీల బదిలీ

- నెల్లూరు రూరల్‌కు 'ఘటమనేని'
- స్పెషల్ బ్రాంచ్‌కి శ్రీనివాసరావు



ఘటమనేని శ్రీనివాసరావు



అత్తిన శ్రీనివాసరావు

**నెల్లూరు (క్రైం) :** రాష్ట్రవ్యాప్తంగా పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరు మాలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా డీజీ కార్యాలయం అటాచ్‌లో ఉన్న నెల్లూరు రూరల్ డీఎస్పీ పి వీరాంజనేయరెడ్డిని ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని సూచించారు. ఆయన స్థానంలో తిరుపతి పీటీసీలో పనిచేస్తున్న ఘటమనేని శ్రీనివాసరావును నియమించారు. ఈయన గతంలో కృష్ణపట్నం పోర్టు సీఐగా, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. ఇక నెల్లూరు ట్రాఫిక్ డీఎస్పీ అర్ల శ్రీనివాసులును అనంతపురం జిల్లా పెనుకొండకు, నెల్లూరు సీసీఎస్ డీఎస్పీ పి రామకృష్ణాచారిని తిరుపతి ట్రాఫిక్‌కు, నెల్లూరు రైల్వే డీఎస్పీగా ఉన్న సీహెచ్ విజయ భాస్కర్‌రావును పోలీసు ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. నంద్యాల జిల్లా ఆత్మకూరు డీఎస్పీ అత్తిన శ్రీనివాస రావును నెల్లూరు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా నియమితులయ్యారు.

**● పలువురు సీఐలు కూడా..**

జిల్లాలో సీఐల బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు మహిళా పీఎస్-2లో పని చేస్తున్న సుబ్బారావు, అజయ్‌కుమార్‌లను ఒంగోలు తాలూకా పీఎస్‌కు, ఒంగోలు సీసీఎస్‌లో ఉన్న విజయ్‌కృష్ణను రాపూరు సర్కిల్‌కు, నెల్లూరు సీసీఎస్‌లో ఉన్న సీహెచ్ కోటేశ్వరరావును నెల్లూరులోని చిన్నబజారు స్టేషన్‌కు, చిన్నబజారులో ఉన్న అశోక్‌కుమార్‌ను రేంజ్ వీఆర్‌కు, కలిగిరిలో ఉన్న ఎండీ ఫిరోజ్‌ను రేంజ్ వీఆర్‌కు, వేదాయపాళెంలో ఉన్న వెంకటనారాయణను కలిగిరికి బదిలీ చేశారు.



ఆ జీపులోనే పెట్రోలింగ్ విధులు



అరె.. డీజిల్ ట్యాంకుకు మూత ఏది!?



నవాబుపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న జీపు

## దొంగలను పట్టే జీపు ఇదేనా !?

ఈ పోలీస్ జీపును చూశారా!? ఇదేదో మరమ్మతుల కోసం మెకానిక్ షెడ్‌లో ఉందని అనుకుంటే మీరు పొరబడ్డట్టే!. నెల్లూరు నగరంలోని నవాబుపేట స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు వాడుతున్న వాహనం ఇది. జీపు ముందు లైట్లు లేకుండా, అక్కడక్కడా తుప్పపట్టి, విరిగిన కమ్ములకు తాళ్లు కట్టి వాడుతున్నారు. కనీసం డీజిల్ ట్యాంకుకు మూత కూడా లేదు. మొండికే కేరాఫ్‌గా మారుతున్న ఈ జీపును అతికష్టమ్మీద వాడుతున్నట్టు పోలీసులే చెబుతున్నారు.

**- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు**

## ఆర్నెల్లుగా అద్దె లేదు!

- జిల్లాలో 412 హెల్త్‌క్లినిక్‌లు బాడుగ భవనాల్లోనే..
- సుమారు రూ.49.44 లక్షల బకాయిలు
- కొన్నిచోట్ల అద్దెలు చెల్లిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు
- గత 6 నెలలుగా బకాయిల కోసం నిరీక్షణ
- ఎప్పుడు వస్తాయో చెప్పలేని వైద్యాధికారులు

**నెల్లూరు (వైద్యం), జూలై 31 :** వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణ ప్రజానీకానికి మెరుగైన వైద్య సేవలు అందుతాయంటూ గత ప్రభుత్వం ఊదరగొట్టింది. అయితే ఇక్కడ నియమించిన వైద్య ఉద్యోగుల సమస్యలు మాత్రం గాలికి వదిలేసింది. ఫలితంగా ఆయా విలేజ్ క్లినిక్ భవనాల అద్దెలు కూడా కొంతమంది ఉద్యోగులు తమ జీతాల నుంచి చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. 2022, డిసెంబరులో జిల్లా వ్యాప్తంగా 495 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మంజూరవగా, కేవలం 75 ప్రభుత్వ భవనాలు పూర్తయి వాటిని వైద్య ఆరోగ్యశాఖకు అప్పగిం చారు. 412 హెల్త్‌క్లినిక్‌ల భవనాలు ఇంకా నిర్మాణంలోనే ఉండగా, 8 హెల్త్ క్లినిక్‌ల భవనాలు నిర్మాణానికే నోచుకోలేదు. ఈ నేపథ్యంలో 412 క్లినిక్‌లు అద్దె భవనాలలో నడుస్తున్నాయి. మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ) పేరుతో కాంట్రాక్టు ప్రాతిపదికన ఒక్కో క్లినిక్‌కు ఒకరిని నియమించారు. అద్దె భవనాల్లో నడుస్తున్న క్లినిక్‌లకు బాడుగ రూపేణా నెలకు రూ.2వేల నుంచి 3 వేల చెల్లిస్తున్నారు. ఆరంభం నుంచి అడపాదడపా అద్దె సొమ్ము విడుదల చేస్తున్న ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి పూర్తిగా ఆపేసింది. అద్దెలు చెల్లించాలంటూ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోవడంతో ఉద్యోగం ఉంటే చాలన్న భావనతో క్లినిక్‌లో ఉన్న ఎంఎల్‌హెచ్‌పీ అద్దె భారం మోస్తున్నారు. తమకు వచ్చే రూ.25వేల వేతనం లోనే కొంత అద్దె బకాయిలు చెల్లిస్తున్నట్లు వాపోతున్నారు.

**● రూ.49.44 లక్షలు చెల్లించాలి..**

ప్రతి నెల హెల్త్ క్లినిక్‌లకు అద్దెల రూపంలో రూ.8.24 లక్షలు విడుదల చేయాల్సి ఉండగా, ఆరు నెలల బకాయిలు రూ.49.44 లక్షలకుపైగా చెల్లించాల్సి ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి అద్దె నిధులు విడుదల చేయక పోవటంతో ఈ భారం కూడా కొత్తగా ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వంపైనే పడుతుంది.

**● రవాణా చార్జీలూ భరించాల్సిందే**

క్లినిక్‌లో ఉండే ఎంఎల్‌హెచ్‌పీలు ప్రతి నెల ఆరోగ్య శాఖ జిల్లా కార్యాలయానికి వచ్చి 42 రకాల మందులు తీసుకు వెళ్లాల్సి వస్తుంది. సీతారామపురం, దుత్తలూరు, ఉదయగిరి, దుత్తలూరు వంటి దూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి చేరుకుని ఆటోలలో ఈ మందులు తీసుకు వెళ్లాలి. పరిస్థితుల్లో రవాణా చార్జీల రూపేణా దగ్గర ప్రాంతాలకు రూ. 2వేలు, దూర ప్రాంతాలకు రూ.5వేలు ఖర్చవుతోంది. ఈ ఖర్చులు జాతీయ ఆరోగ్య మిషన్ భరించాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు లేవు. అసలు మందులను ఎన్‌హెచ్ఎం ప్రత్యేక వాహనాలలో ఆయా ఆరోగ్య కేంద్రాలకు చేర్చాల్సి ఉన్నా ఎలాంటి నిబంధనలు పాటించడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి క్లినిక్‌ల అద్దెతోపాటు రవాణా చార్జీలు చెల్లించాలని ఎంఎల్‌హెచ్‌పీలు కోరుతున్నారు.



# తీరని ట్రాఫిక్ సమస్య!

- విస్తరణకు నోచుకోని ఆత్మకూరు ప్రధాన రోడ్డు
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు

**ఆత్మకూరు, జూలై 31:** స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి సోమశిల రోడ్డు సెంటర్ వరకు ఉన్న ప్రధానరోడ్డులో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. రోడ్డునకు ఇరువైపులా విస్తరణ పనులు చేపడతామన్న పాలకులు, అధికారుల హామీలు నీటిమూటలే అయ్యాయి. ఏళ్ల తరబడి విస్తరణ పనులు ఆగి పోవడంతో పట్టణంతో పాటు గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. విస్తరణ పనులు ఎప్పటికీ పూర్తి చేస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరుపాలెం సెంటర్ నుంచి మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వరకు నాలుగురోడ్ల రహదారి పనులు పూర్తయ్యాయి. మధ్యలో సెంట్రల్ లైటింగ్, పూలమొక్కలు పెంచేలా ఆధునీకరించాలని గత మున్సిపాలిటీ పాలకవర్గం నిర్ణయించింది. అయితే రోడ్డు విస్తరణ పనులు నెల్లూరుపాలెం సెంటర్ నుంచి ఆర్టీసీ డిపో వరకు పూర్తయ్యాయి. అక్కడి నుంచి సోమశిలరోడ్డు సెంటర్ వరకు రోడ్డు విస్తరణకు అడ్డంకులు ఏర్పడ్డాయి. రోడ్డుకు ఇరువైపులా విస్తరణకు సంబంధిత భవనాల యజమానులు అంగీకరించక పోవడంతో ఈ పనులు నిలిచిపోయాయి. ఈ సమస్యతో రోడ్డు అధ్వానంగా తయారైంది. దానికితోడు ట్రాఫిక్ సమస్య తీవ్రం అయ్యింది. రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రతిరోజూ ట్రాఫిక్ నిలిచిపోతుంది. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాల నిలిపివేతను అరికట్టడంతో పాటు రోడ్డు విస్తరణను పూర్తి చేయాల్సి ఉంది. రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించి రోడ్డ విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆత్మకూరులో ట్రాఫిక్ అంతరాయంతో నిలిచిన వాహనాలు

## ఉపాధి హామీ పనుల తనిఖీ



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్

**సీతారామపురం, జూలై 31:** మండలకేంద్రంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను బుధవారం ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ పరిశీలించారు. కూలీల పనులు, మస్టర్లను తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి రోజూ ఉదయం 6:30 నుండి 11 గంటల వరకు పనిచేయాలన్నారు. ఇలా చేస్తే రోజుకు రూ.300లు వేతనం వస్తుందన్నారు. కూలీలకు పనుల గురించి సూచనలిచ్చారు. ఆయన వెంట ఏపీఓ సుహాసిని ఉన్నారు.

## అద్దె భవనంలోకి పాఠశాల



పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈవో, గ్రామస్థులు

**ఉదయగిరి రూరల్, జూలై 31:** గండిపాళెం మెయిన్ ప్రాథమిక పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరడంతో అద్దె భవనంలోకి మార్చినట్లు ఎంఈవో షేక్ మస్తాన్‌వలి తెలిపారు. బుధవారం ఆయన గ్రామస్థులతో కలిసి పాఠశాలను పరిశీలించారు. సమస్యను డీఈవో దృష్టికి తీసుకె ళ్లామన్నారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా ఉన్నతాధికారుల ఆ దేశాలు, గ్రామస్థుల సూచన మేరకు పాఠశాల భవనాలను మార్చామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు షాహిదాఅక్తర్ పాల్గొన్నారు.

## రేపటి నుంచి సయ్యద్ ఉత్సవం



ఉత్సవానికి ముస్తాబైన దర్గా

**ఉదయగిరి రూరల్, జూలై 31:** స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో వెలసిన హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్‌సాహెబ్ ఖాదరీ ఔలియా ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2న సందల్‌మాలి కార్యక్రమం, 3న గంధోత్సవం, 4న జప్నేచిరాగి ఫాతెహా, 5న తహలీల్ ఫాతెహా కార్యక్రమాలతో ఉత్సవం ముగుస్తుందన్నారు. భక్తులకు అన్నదానంతో పాటు పాటకచేరి, ఖవ్వాలీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

## నేటి నుంచి పింఛన్ల పంపిణీ

**ఉదయగిరి రూరల్, జూలై 31:** లబ్ధిదారులకు గురు, శుక్రవారాల్లో ఇళ్ల వద్దకే వచ్చి సామాజిక పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లబ్ధిదారులు అందుబాటులో ఉండి పింఛన్ నగదు పొందాలని సూచించారు.

## ప్రైవేటు పాఠశాలపై చర్య తీసుకోండి

**అనంతసాగరం, జూలై 31:** ముస్తాపురం క్రాస్ రోడ్డులోని లిటిల్ ఏంజెల్స్ పాఠశాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విద్యార్థిని లాస్య తండ్రి బుజ్జిరెడ్డి, కుంటుబసభ్యులు డిమాండ్ చేశారు. ఇటీవల బుజ్జిరెడ్డిపై పాఠశాల కరస్పాండెంట్ మల్లికార్జున, వారి సిబ్బంది దాడి చేసిన ఘటనపై బుధవారం ఎంఈవో-2 ప్రభాకర్‌రెడ్డి కుటుంబసభ్యులను కలిసి వివరాలు ఆరా తీశారు. కరస్పాండెంట్ దాడి చేసిన తీరును చూసి తన కుమార్తె పాఠశాలకు వెళ్లనంటూ మారాం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గణితం సబ్జెక్టులో మార్కులు తక్కువగా వస్తున్నాయని ప్రశ్నిస్తే దాడికి పాల్పడ్డారని బుజ్జిరెడ్డి తెలిపారు.

## రేపు ఆత్మకూరులో మంత్రి ఆనం పర్యటన

**ఆత్మకూరు, జూలై 31:** రాష్ట్ర దేవదాయశాఖమాత్యులు ఆనం రామనారాయణరెడ్డి శుక్రవారం పట్టణంలో పర్యటించనున్నట్లు క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం ఓ ప్రక టన విడుదల అయ్యింది. ఉదయం 10గంటలకు మున్సిపల్ కార్యాలయంలో మంచినీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం తాగునీటి సరఫరాలోని సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించి పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12గంటలకు ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. సమావేశంలో తహశీల్దారు కార్యాలయ నూతన భవన సౌకర్యం, ఆర్‌అండ్‌బీ విశ్రాంతి అతిథి భవనం పనుల పురోగతి, నూతన బాలికల రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుపై సంబంధిత అధికారులతో మాట్లాడుతారు. సాయంత్రం 3-30 గంటలకు చేజర్ల మండలం పెరుమాళ్లపాడులోని ఆనం గార్డెన్స్‌లో చేజర్ల మండల టీడీపీ నాయకులతో సమావేశం అవుతారు. శనివారం ఉదయం గంటలకు పెరుమాళ్లపాడులోని ఆనం గార్డెన్స్‌లో సంగం, ఏఎస్‌పేట మండలాల టీడీపీ నాయకులతో సమావేశవుతారు. రాత్రి నెల్లూరులోని ఆనం నివాసంలో బస చేస్తారు. ఆదివారం ఉదయం 10 గంటలకు నెల్లూరు ఏసీ సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో ప్రజా వినతులను స్వీకరిస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు నెల్లూరు నుండి విజయవాడ బయలుదేరుతారు.

## చంద్రబాబుతోనే అన్నిరంగాల అభివృద్ధి సాధ్యం

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు



విలేకరులతో మాట్లాడుతున్న చెంచలబాబు యాదవ్

**ఉదయగిరి రూరల్, జూలై 31:** సంపద సృష్టించి రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ అన్నారు. బుధవారం స్థానిక చెంచురామయ్య అతిథిగృహంలో టీడీపీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పతనమైందన్నారు. ప్రస్తుతం జగన్ మానసిక పరిస్థితి బాగాలేదని ఎద్దేవా చేశారు. ఎన్డీయే కూటమి అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేశారన్నారు. పేదల ఇంటి నిర్మాణానికి ఇచ్చే నిధులను రూ.4 లక్షలకు పెంచడం హర్షణీయమన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు మంజూరు చేయడం చంద్రబాబు కృషే అన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తొలిసారిగా అసెంబ్లీలో నియోజవకర్గ సమస్యలపై గళమెత్తడం, వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ స్పందించి ఉదయగిరి, వింజమూరు వైద్యశాలలకు డయాలసిస్ కేంద్రాలు మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బయ్యన్న, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, మాబాషా, ఖాన్‌షా, రమణయ్య, మస్తాన్, సుమన్, తులసీ పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ భవనం పరిశీలన




అన్న క్యాంటీన్ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్ షేక్ ఫజులుల్లా

**ఆత్మకూరు, జూలై 31:** పట్టణంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ భవనాన్ని బుధవారం మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, ఏఈ జూపల్లి ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. క్యాంటీన్ పరిసరాలను శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 15 నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతుందని కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. ఈ క్రమంలో ఆత్మకూరు అన్న క్యాంటీన్ ఏర్పాటుకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

## అతితక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు



**బిట్రగుంట, జూలై 31:** పొలాల్లో 11కేవీ విద్యుత్ తీగ ఇంత తక్కువ ఎత్తులో ఉంటే ప్రమాదం జరగదా...? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. బోగోలు మండలం చెన్నారెడ్డిపాలెం-ఎన్వీపాలెం కాలువకు తూర్పుపొలాల్లోనూ, ఏబీ కండ్రిక పొలాల్లోనూ బుధవారం 11కేవీ విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. అయితే రైతులు అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. తీగలు జాయింట్ వేసేందుకు కండక్టర్ లేక పోవడంతో మూడు గంటలపాటు సిబ్బంది అవస్థలు పడ్డారు. 11కేవీ తీగలు రెండు తగులుకోకుండా రాళ్లు కట్టుకుని, కాలం వెల్లబుచ్చుతున్నామని రైతులు తెలిపారు. విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి సమస్య తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



# సంపద కేంద్రాల నిర్వీర్యం

- మరుగున పడిన చెత్త సంపద తయారీ కేంద్రాలు

**సీతారామపురం, జూలై 31:** స్వచ్ఛభారత్ కింద గ్రామ పంచాయతీల ఆర్థిక ఆదాయాన్ని పెంచేందుకు 2014లో టీడీపీ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద చెత్త నుంచి సంపదను తయారీ చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రానికి రూ.8నుంచి రూ.10లక్షల వరకు ఖర్చు చేసి మండలంలో 14కేంద్రాలను నిర్మించారు. గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ కోసం జనాభాను బట్టి 14కేంద్రాల్లో 40మంది గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేశారు. వీరికి గ్రామ పంచాయతీ నుంచి ఒక్కొక్కరికి నెలకు రూ.6వేలు అందించాలి. వీరు గ్రామాల్లోని ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి కేంద్రానికి తరలిస్తారు. అక్కడ పేపర్లు, ప్లా స్టిక్ వస్తువులు, గాజు పరికరాలు, ఇనుప వస్తు వులు వేర్వేరుగా చేసి తడి, పొడి చెత్తగా విభజించాలి. అయితే మండలవ్యాప్తంగా గ్రీన్ అంబాసిడర్లకు కొన్ని నెలల నుంచి జీతాలు లేకపోవడంతో కొన్ని కేంద్రాల్లో తప్ప చెత్త సేకరణ చాలా గ్రామాల్లో జరగడం లేదు. 2019లో వైసీపీ ప్రభుత్వం మారడంతో ఈ కేంద్రాలపై నిర్లక్ష్యం ప్రదర్శించారు. సంపద సృష్టి కేంద్రాలు నిర్వీర్యమై ఈ పథకం లక్ష్యం నీరుగారి పోయింది.



అయ్యావారిపల్లిలో నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రం

## రైతులకు అందని పచ్చిరొట్ట ఎరువులు

- అందుబాటులో లేని వ్యవసాయాధికారులు

**అల్లూరు, జూలై 31 :** తమకు అవసరమైన జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలను అందించే పరిస్థితి మండలంలో లేకుండా పోయిందని రైతులు అంటున్నారు. గత ఐదేళ్లుగా ఇదే పరిస్థితని వారు వాపోతున్నారు. రెండో కారు పంట లేకపోవడంతో పచ్చిరొట్ట పైర్లు వేసుకొని భూములను సారవంతంగా చేసుకునేందుకు కూడా వ్యవసాయ శాఖ రైతులకు సహకరించడం లేదు. పలుమార్లు అధికారులను రైతులు, రైతు నాయకులు ప్రశ్నించినా వారిలో స్పందన లేదు. కార్యాలయంలో కూడా అధికారులు అందుబాటులో ఉండడం లేదని వారంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో సబ్సిడీపై పచ్చిరొట్ట పైర్ల విత్తనాలు, జిప్సమ్, జింగ్ సల్ఫేట్ తదితర వాటిని అందజేసేవారని, ఐదేళ్లుగా వీటిని పంపిణీ చేయడం మర్చిపోయారని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు.



ఏపుగా పెరిగిన జీలగ (ఫైల్)

## కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

**గుడ్లూరు, జూలై 31:** మండలంలోని చేవూరు శ్రీరామదూత ఆశ్రమ పాఠశాలలో బుధవారం కంప్యూటర్ ల్యాబ్‌ను, విజువల్ క్లాసులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద, అనాథ విద్యార్థుల ఎదుగుదల కోసం, ఆశ్రమం అందిస్తున్న సేవలు హర్షించదగినవన్నారు. తొలుత ఆశ్రమ సిబ్బంది వేదపారాయణం చేస్తూ, ఇంటూరికి ఆత్మీయ స్వాగతం పలికారు. ఆశ్రమ నిర్వాహకులు దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఇంటూరి పాల్గొన్నారు. అనంతరం 154 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే దుప్పట్లు పంపిణీ చేశారు. తదుపరి ఆశ్రమ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆశ్రమ ఇన్‌చార్జి హనుమంతరావు చౌదరి, కరస్పాండెంట్ డాక్టర్ ఎం. చలపతి రావు, కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, డాక్టర్ చంద్రకుమార్, మాజీ ఎంపీపీ పొట్లేళ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

## ముసునూరులో శిక్షా సప్తాహ్

**కావలి,జూలై 31:** పట్టణంలోని ముసునూరు దళితవాడ ప్రాథమిక పాఠశాలలో బుధవారం శిక్షా సప్తాహ్ జరిగింది. ఇందులో భాగంగా సోమవరపు శ్రీలత తన కుమార్తె హర్షిత పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక భోజనాలు, మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో గోవిందయ్య, సీఆర్పీ శీనయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన



రోడ్డు బరమ్స్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

**కావలి, జూలై 31:** ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆదేశానుసారం పట్టణంలో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. స్థానిక వెంగళరావునగర్‌లో జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్, రోడ్డు బరమ్స్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అలాగే ఆ ప్రాంత ప్రజలు, నేతలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సాయి రామ్, ఏఈ శ్రీనివాసులురెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టూటౌన్, రూరల్ ఎస్ఐల బాధ్యతల స్వీకరణ



వెంకటేశ్వర్లు బాలకృష్ణ

**కావలి రూరల్, జూలై 31:** కావలి రెండవ పట్టణ ఎస్ఐగా వేమర్తి వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్ఐగా కే బాలక్రిష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.గతంలో వలేటి వారిపాలెం ఎస్ఐగా పనిచేసి వీఆర్‌కు వెళ్లిన వెంకటేశ్వర్లు బదిలీపై రెండో పట్టణ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. అలాగే కావలి రెండవ పట్టణ ఎస్ఐగా పనిచేస్తూ ఎన్నికలకు ముందు గుంటూరు ఎస్ఐగా బదిలీపై వెళ్లిన బాలక్రిష్ణ తిరిగి కావలికి వచ్చి రూరల్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు.

## 11న ఆత్మకూరు మండల సమావేశం

**ఆత్మకూరు, జూలై 31 :** ఆత్మకూరు మండల సర్వసభ్య సమావేశం ఆగస్టు 11న నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో బాలాజీనా యక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో అన్ని శాఖల పరిధిలో చేపడుతున్న పథకాలు, అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కావున ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన తెలిపారు.

## జాతీయభావం పెంపొందేలా ఐకానిక్ ఏర్పాటు



జాతీయ జెండా ఐకానిక్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

**కావలి,జూలై 31:** ప్రతిఒక్కరిలో జాతీయభావం పెంపొందేలా కావలిలో 100 అడుగుల జాతీయజెండా ఐకానిక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ట్రంకురోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో ఐకానిక్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. దీన్ని ఆగస్టు 15న ప్రారంభించేందుకు పనులు వేగవంతంగా చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్‌బాబు, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే వంటేరుకు నంది అవార్డు ప్రదానం



మాజీ ఎమ్మెల్యే వంటేరుకు నంది అవార్డును అందచేస్తున్న సంస్థ నిర్వాహకులు

**కావలి,జూలై 31:** మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ పారిశ్రామిక వేత్త వంటేరు వేణుగోపాలరెడ్డికి బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన ఓ కార్యక్రమంలో నంది అవార్డును ప్రదానం చేశారు. 30 ఏళ్లుగా రాజకీయంగా తనగళంతో ప్రభుత్వాలను కదిలించి, కావలి అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని, సొంత నిధులతో పలు సేవా, అభివృద్ధి కార్యక్రమాలు చేసినందుకు గుర్తుగా ఈ అవార్డును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్, క్రీస్తులో సంపూర్ణత ఇవాంజికల్ మిషన్ బైబిల్ కాలేజీ, విజయ్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వంటేరును అవార్డుతో సత్కరించారు.

## నిధుల స్వాహాపై ఎంపీడీవోకి ఫిర్యాదు



ఎంపీడీవోకి అర్జీ అందజేస్తున్న టీడీపీ నేతలు

**లింగసముద్రం, జూలై 31 :** ఐదేళ్లక్రితం ప్రహరీ గోడ నిర్మాణం డబ్బులు రూ.4.09 లక్షలు పంచాయతీ కార్యదర్శి స్వాహా చేశారని బుధవారం ఎంపీడీవో కే శ్రీనివాసరావుకు మండలంలోని వెంగళాపురం టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు ఆయనకు వినతిపత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్వ శిక్ష అభియాన్ పథకం కింద 2018 డిసెంబరు 10న సుమారు రూ.10.50 లక్షలతో వెంగళాపురం ఎంపీయూపీ పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టగా, అధికారులు రూ.9.64లక్షలకు బిల్లు చేశారని తెలిపారు. ఇందుకుగాను తమకు రూ.5.55 లక్షలు వచ్చాయని చెప్పారు. అయితే తమకు రావాల్సిన మిగతా రూ.4.09 లక్షలను అప్పటి పంచాయతీ కార్యదర్శి షేక్ బాషావలి డ్రా చేసుకొని స్వాహా చేశాడని వివరించారు. స్పందించిన ఎంపీడీవో మాట్లాడుతూ విచారించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ఫిర్యాదు చేసిన వారిలో గ్రామ టీడీపీ నేతలు చిట్టిబోయిన రత్తయ్య, గొంగటి కిరణ్, లోమడ శ్రీనివాసులు, పొట్టిపాటి వీరయ్య తదితరులు ఉన్నారు.

## పేదలపై భారాన్ని మోపడమే కేంద్రం అజెండా



మాట్లాడుతున్న మూలం రమేష్

**కావలిటౌన్, జూలై 31:** పేదలపై భారాన్ని మోయడం, కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడమే కేంద్ర ప్రభుత్వ అజెండా అని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ విమర్శించారు. పట్టణ సీపీఎం కార్యాలయంలో రెండు రోజులపాటు జరిగిన ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం శిక్షణ తరగుతులు బుధవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద బడ్జెట్‌లో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. పోలవరం ప్రాజెక్ట్‌కు నిధులు ఇస్తామన్నారేగానీ, బడ్జెట్‌లో కేటాయించలేదని, ముంపు పునరావాసులకు మొండి చేయి తప్పలేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించలేదని, విద్య, వైద్యానికి నేటి అవసరాలకు తగ్గట్లుగా నిధులు కేటాయించలేదన్నారు. అదానీ కెంత అంబానీకెంత దోచిపెట్టాలన్నదానిపైనే శ్రద్ధ చూపించారని దుయ్యబట్టారు.కార్యక్రమంలో వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకమరాజు, కార్యదర్శి మంగళి పుల్లయ్య, రాష్ట్ర నాయకులు తాళ్లూరు మాల్యాద్రి, సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ ద్వారా రైతులకు అందుబాటులో యూరియా

**సీతారామపురం,జులై 31 :** మండలంలోని మారంరెడ్డిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియా అందుబాటులో ఉందని, అవసరమైన రైతులు కొనుగోలు చేయవచ్చని మండల వ్యవసాయ శాఖ ఏవో చెన్నారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు 13.5 మెట్రిక్ టన్నుల యూరియా సహకార సంఘంలో అందుబాటులో ఉందని తెలిపారు.యూరియా కావలసిన రైతులు బస్తాకు రూ.266.50 చెల్లించాలన్నారు. రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలని కోరారు. వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆయన పేర్కొన్నారు.